1181

1933

దీక్షితులు కథలు

మేలురకము వజ్రములకు

ప్రత్యేకవ్యక్తిత్వము

ఒకే ధర



ప్రత్యేకఖ్యాతి

మేలురకము

సుప్రసిద్ధి

సురాజ్‌మల్స్

313, ఎస్ప్లనేడ్, మదరాసు.

3

దీక్షితులు కథలు

గ్రంథకర్త:

చింతా దీక్షితులు

శ్రీ వేమన గ్రంథాలయము.

[illegible] (కృష్ణా)

ప్రకటనకర్తలు:

నమ్మాళ్వార్స

౨౭, గోవిందప్పనాయకన్ వీధి.

పోస్టుబాక్సు నెం ౨౧౧, మద్రాసు.

సర్వస్వామ్య సంకలితము

౧౯౪౦

వెల ఎనిమిది అణాలు, లేక ఒక షిల్లింగు

విషయసూచిక

౧	దాసరిపాట	౭
౨	ఊరిపేరు	౧౪
౩	కిష్కింధలో కోతి ...	౨౩
౪	అభిప్రాయభేదం... ...	౩౩
౫	భార్యాస్మృతి	౩౭
౬	గోదావరి నవ్వింది ...	౪౩
౭	పెద్దమేడ	౫౫
౮	వామహస్తోద్ధారకసంఘము ...	౬౧
౯	చెంచురాణి	౭౧
౧౦	సుగాలీ కుటుంబము ...	౯౩

ఈ గ్రంథకర్తగారి యితరగ్రంథములు

పీశాదశి రు ౧-౦-౦, శబరి ౧-౦-౦, పరిణామవాదం ౧-౦-౦

అక్కు పిడకలు ౦-౨-౦

—వారికి వ్రాసినబడయుగలరు—

శ్రీ చింతాదీక్షితులుగారిని 'కథకచక్రవర్తి' అంటారు. ఆబిరుదు వారికి సర్వథా తగిఉన్న దనవచ్చును.

ఆంధ్రవాఙ్మయములో కథానికకు ప్రాముఖ్యము, ఒకనిశ్చిత స్వరూపము ఇచ్చినవారు దీక్షితులుగారు. సాహితీపత్రికలోనూ, సఖిలోనూ వారుప్రకటించినకథలే తరువాతిరచయితలకు మార్గదర్శకము అయినవి. ఉదాత్తవిషయము లెత్తుకొన్నా, హాస్యరసము పోషించదలచుకొన్నా, బాలబాలికలకోసము వ్రాయాలన్నా వీరిరచన ఎత్తుకొన్నా వారికల్పనమూ, కథనమూకూడా పరిణతస్థితి పొందే ఉంటవి. వారి 'ఏకాదశి', 'శబరి' మొదలయినగ్రంథాలు ఆంధ్రుల ఆమోదముబడసినవి. బాలానందంకథలూ 'సూరీ-సీతీ-వెంకీ' శీర్షికలోని కథలూ, 'లక్క-పిడతల' లోనిపాటలూ పసిపిల్లలకేకాక పెద్దవారికికూడా ఆనందప్రదములు. వీటిరావుకథలు నవ్యస్త్రీజీవితములోనిఘట్టాలను రసవంతముగా చిత్రిస్తున్నవి.

వీరికథలలోఉన్న వైవిధ్యమూ, వైదుష్యమూ ఇంకొకరి రచనలో సాధారణముగా కనబడవు. తమ కథలలోకొన్ని ఒకసంపుటముగా మా గ్రంథమాలలో ప్రకటించడానికి దయతో ప్రసాదించిన శ్రీదీక్షితులుగారికి గౌరవపూర్వకమయిన అభివందనము లర్పిస్తున్నాను.

—జమిలి నమ్మాళ్వారు.

అంకితము

శ్రీమహామహోపాధ్యాయ, వ్యాకరణాచార్య

కళాప్రపూర్ణ, రావుసాహేబ్

శ్రీగిడుగు వేంకట రామమూర్తిపంతులు బి. యే. గారికి

*

సర్వహక్కులూ గ్రంథకర్తవి.

1530 7

దాసరిపాట

౧

అతడు తెలగదాసరి. అతని నివాసస్థలము తెలుగు దేశము. అతని పరివారము, చుట్టములు, అతనిభార్యే. అతని ఆస్తి ఒకతాంబ్రా, ఒకగుమిసీ, ఒకజతఅంజెలులు.

అతనిదృష్టి యెప్పుడూ పదములలోదాగియున్న తెలుగు వీరులమీదనే. అతని ఆశయము ఎప్పుడూ తెలుగుదేహములను పదములుపాడి పులకలెత్తించడమే.

అతడుచూడని తెలుగుగ్రామములేదు. అతడు మెట్టని తెలుగుదేశములేదు, అతనిపాటలు వినని తెలుగువారులేరు—కొందరు నవనాగరీకులుతప్ప.

మరాటీమనుష్యులవలె యెర్రనిపెద్దతలపాగా పెట్టుకొని చిరిగిపోయిన పాతకోటువేసుకొని పాతజరీకండువా వల్లెవాటుగా ధరించి పంచెయెగగట్టి బుజముమీది తాంబ్రా వేళ్ళతోమీటుతూ మెళ్ళోపూసలు కదిలేటట్టు చిందులుతొక్కుతూ అతడు మరాటీకథపదము చెప్పేటప్పుడు వీరరసము ఉట్టిపడేది. అతని బొమముడికి పెట్టుకొన్ననామము పెచ్చులుపెచ్చులుగా ఊడిపోయేది. బొటనవేలికీ తర్జనకీ తగిలించుకొన్న అంజెళ్ళు ఖంగున మోగేవి. పక్కనేకూర్చున్న అతనిభార్య గుమిసిమీద మోకాలుపెట్టి భర్తముఖముమీదనే వీక్షణములుంచి గుమిసి

వాయించునపుడు భర్తచెప్పుపదమునకు మరింత గాంభీర్యము వచ్చేది. జనులు ముగ్ధులైపోయేవారు.

అతనికి యిరవైయ్యేయేట పెళ్ళైనది. పెళ్ళైనది మొదలు నేటివరకూ అతనిభార్య అతనివద్దనే ఉన్నది. పెండ్లి నాటి కామెకు పద్ధాలుగోయేడు. ఆమె తండ్రికూడా ఒక తెలగ దాసరే. కాని అతడు అకాలమృత్యువువాతపడుటచేత ఆమె తల్లివద్దనేఉండి చాలాదరిద్రమనుభవించింది. కాని కొన్నిపదములునేర్చుకుంది. తల్లిదగ్గిరనున్నకాలములో ఆమెకు తల్లే సర్వమున్నూ. పెళ్లిచేసుకున్నతర్వాత ఆమెకుభర్తే సర్వమూ. భర్త దగ్గిర ఆమె గుమిసివాయించడం నేర్చుకుంది. భర్తదగ్గిర ఆమె కొత్తపదము లనేకములు నేర్చుకొన్నది. భర్త పాడేటప్పుడు అతనిపాటకు తాను ఊతపదమును కలిపేది. వారిహృదయాలకు అద్వితీయస్థితి లేనట్టే వారిపాటకుకూడా లేదు.

పదములోని వీరరసమును భర్త వెలువరించేటప్పుడు ఆమెహృదయము వీరరసముతో ఉప్పొంగేది.

కరుణారసము తనపదమునకు భర్త ఒప్పించేటప్పుడు ఆమెకళ్ళవెంబడివచ్చిన కన్నీళ్ళు గుమిసినితడిపేవి. 'తందాన తాన' అనే ఊతపదము గద్గద మయ్యేది.

భర్తచమత్కారముచూపి చిరునవ్వు నవ్వినపుడు ఆమె గుమిసిదెబ్బలలో నవ్వు వినిపించేది.

కొంటెతనముతో అతడు మీసముమీద చెయ్యివేసి నాయికానాయకుల శృంగారమును వర్ణించేటప్పుడు ఆమె తల వంచి గుమిసి తప్పువాయించేది.

భేదములేనివారి ప్రేమకు, కౌటిల్యమెరుగనివారి ప్రేమకు,

౧

దాసరి పాట

దేహములు వేరైనను వారి ఆత్మలను ఒక్కటిగ చేసిన వారి ప్రేమకు ఫలముగా వారికి ఒక కొడుకుపుట్టాడు. వానికి ఇప్పుడు ఐదోయేడు.

౨

చదువుకున్నవాడంటే ఎవరు ? వ్రాలుచేయగలవాడేనా! వ్రాలుచేయలేని భట్రాజులు, దాసరులు, జంగములు, సాతానులు, వీధిభాగవతులు—వీరిమాటేమిటి? భారతభాగవతములను, మహావీరుల దేశీయకథలను ఇతరులకు బోధించగల వీరు చేవ్రాలు చేయలేనివారనే కారణముచేత చదువురానివారని త్రోసివేయవచ్చునా ? దేశములో కొందరువిద్యలను పోషించవలెను. కొందరు వృత్తులను పోషించవలెను. వృత్తులను పోషించే వారికి చదువులలో నిగ్గు తెలియాలి. దానికోసము సంఘములో కొందరు ఏర్పాటుకావాలి. భట్రాజులు, దాసరులు మున్నగు వారు ఇట్టివారు. వీరు సర్వసౌఖ్యములను పరిత్యజించి భిక్షుక వృత్తి అవలంబించేరు పూర్వము. ముఖ్యముగా మతప్రచారముకొరకై వారూరూరు తిరుగుతూ భిక్షుకులై దేశములోని అజ్ఞానమును ఒకవిధముగా పోగొట్టుచున్నారు. వీరినిచూచి నేటివారు 'కూలిపని చేసుకోకూడదా?' అనడం ఆచారమైనది. వంశపారంపర్యంగా వస్తూన్న ఆచారాలని ఒక్కసారి వదలిపెట్టడం కష్టం. అయినా వారికి భైక్ష్యవృత్తి నీచము కాదు: వారి దేవుడే ఒక భిక్షుకుడు కాబట్టి.

ఈకాలపు ముద్రాశాలలకన్న వీరే సంఘమునకు ఎక్కువ ఉపయోగకరంగా ఉండేవారు. అచ్చుయంత్రము చదువవచ్చినవారికే. వీరు అందరికీ ఉపకారముచేస్తున్నారు.

దీక్షితులు కథలు

మనదాసరి చాలాపాటలు పాడగలడు. బొబ్బిలికథ, తిమ్మరాజుకథ, కోడిపుంజులకథ, సర్వాయపాపడుకథ, కామమ్మకథ. కాంభోజరాజుకథ, చెంచుకథ మొదలైన కథలనేకములు రసవత్తరముగా వినిపించగలడు. ఈపదములన్నీ ఇతని భార్యకుకూడావచ్చును. వీరి అయిదేండ్లకొడుకుకు అప్పుడే అయిదారుకథలు ఒకమోస్తరుగా పాడడమువచ్చును.

ఇంతవరకు వీరినిభగవంతుడు ఆదరముతోనే చూచేడు. ఎక్కడికివెళ్లినా వీరికి కడుపునిండా తిండిదొరికేది. తగినబహుమానముదొరికేది. ఈదాసరిదంపతులకు మొదట ఒకరిమీద ఒకరికి ఎంతఅనురాగముండేదో వారిపాటలమీదకూడా వారికి అంతే అనురాగమే ఉండేది. ఇప్పుడు వారిద్దరూ వారిపాటలకన్న వారికొడుకుని ఎక్కువ అనురాగముతో చూచుకొంటున్నారు. కొడుకును ఒకరువిడిచి ఒకరు ఎత్తుకొనేవారేగాని నడిపించేవారుగారు. తమకు ఒకముద్ద తక్కువచేసుకునైనా తమకొడుకుకడుపు నిండించేవారు. అసాధ్యమైన కోరికలు చెల్లించి ఆపూటకి ఉపవాసము చేయడముకూడా అప్పుడప్పుడు కద్దు.

3

ఒకనాడు ఒకగ్రామములో దాసరిదంపతులు కోడిపుంజులకథ చెప్పుచున్నారు. దాసరి కూర్చునిఉన్నాడు. అతని పక్కనే అతనిభార్య వాద్యమువాయించుచున్నది. ఆమెఒడిలో వారిపుత్రుడు పడుకున్నాడు. దాసరి చూపులు అతనిమీదనే తరుచుగాపడుచున్నవి. ఆమెపిల్లవాణ్ణి ఉండుండి అక్కునచేర్చుకొనుచూ ఊతపదము పలకడం మరిచిపోయేది. కోడిపుంజుల యుద్ధమువర్ణించేటప్పుడు చూపే ఉత్సాహము దాసరి ఆరోజున

చూపలేకపోయేడు. రాజపుత్రుల పౌరుషవాక్యములు ఆనాడు నీరసములైనవి. ప్రజలందరు అతనిపాటనువిని పెదవి విరుచుకొన్నారు. కొందరు ముసిలివాడైనాడితడు, 'ఇక పదములు చెప్పలే' డన్నారు. గర్వము బలిసినదన్నారు మరికొందరు ఇతన్ని చూచి.

ఆరోజున వారికి రావలసినంతఆదాయమురాలేదు.

ఆరోజుకు సరిపడేటంత ఆదాయమైనారాలేదు.

రాత్రి మూడుగంటలైనది. కథముగిసినది. ప్రజలందరు ఇండ్లకువెళ్లిరి. దాసరి తనకొడుకుఒంటిమీద చెయ్యివేసిచూచేడు. ఒళ్ళుకాలిపోతూంది. దాసరిభార్య తనకొడుకు కాలికి వున్న కట్టువిప్పినది. దాసరి ఏదోపసరుముద్ద కాలిమీదిగాయముమీద వేసినాడు. ఆమెమళ్ళీ కట్టుకట్టినది. దాసరితనతల పాగామెత్తగా వుండేటందుకు పక్క వేసేడు. దానిమీద తన కోటుపరిచేడు. దాసరిభార్య తనకొంగు ఆపక్కమీద వేసి దాని మీద బాలుని పడుకోబెట్టి అతనిపక్కనే తాను పడుకొన్నది. ఈవలిపక్క దాసరి రాళ్ళమీద పడుక్కున్నాడు. తూర్పున ఉదయించిన చంద్రవంక మేలుకొనియున్న దంపతుల కన్నీటిబిందువులలో ప్రకాశించింది. ఊరుబయట చెట్టుక్రింద పడుక్కొని వున్న దాసరికుటుంబమునకు మరునాడు పాటపాడితేనేగాని పొట్టనిండదు.

౪

రాత్రి యెనిమిదిగంటలైంది. రెండు కిరసనాలుదీపాలు ఊరిచివర చెట్టుక్రింద వెలుగుచున్నవి. చుట్టూ ప్రజలు కూర్చుని ఉన్నారు. దాసరి ఒకబుజముమీద తాంబ్రా మీటుతున్నాడు.

బొబ్బిలికథ చెప్పుతున్నాడు. కూర్చునే చెప్పుతున్నాడు. యథా ప్రకారము అతనిభార్య అతనిప్రక్కనే కూర్చుచున్నది. బుజము మీదివారికొడుకుచిక్కి శల్యమైయున్నాడు. కాలిమీది కట్టు మరింత పెద్దదిగా ఉన్నది. ఉండుండి అతడు తలయెత్తి తండ్రికేసీ, తల్లికేసీ చూచి మళ్ళీ బుజముమీద తలవాల్చి కూర్చుచున్నాడు. ఆరోజున జ్వరముతగ్గినదని తల్లికి ఆశకలిగినది. ఆరోజున జ్వరము తగ్గినదని తండ్రికి బెంగగావుంది. బొబ్బిలికథ క్రమక్రమముగా రక్తికట్టుచున్నదని ప్రజలనుకొనుచున్నారు, బొబ్బిలి కోట ముట్టడించడానికి సైన్యములువూనుకొనుచున్నవి. యుద్ధమును వర్ణించి దాసరి ప్రజల మెప్పును పొందేడు. రంగారావు వీరకృత్యములు ప్రజలలో ఆవేశమును కలిగించినవి. తాంబ్రా తీగెలు కదలిపోవుచున్నవి. గుమిసి ఖంగుమనుచున్నది. దాసరి యెలుగెత్తి రంగరాయమరణమును విలపించాడు. ప్రజలకుకళ్ళ నీళ్ళు గిర్రునతిరిగినవి. తల్లి బుజముమీదనున్న కొడుకు ఒంటి మీద చెయ్యేసి చూచినది. ఒళ్ళుచల్లబడుచున్నది. దాసరి ముఖముకేసిచూచినది. అతడు విజయరామరాజు క్రౌర్యమును వర్ణిస్తున్నాడు. కొడుకు హీనస్వరముతో 'అయ్యా' అన్నాడు. ఒకచేతితో సానురాగముగా కొడుకును నిమిరి అతడు కథ సాగించాడు.

తాండ్ర పాపయ్యకు బొబ్బిలివీరుల మరణవార్త తెలిసినది. రౌద్రాకారుడై వచ్చి అతడు విజయరామరాజును చంపిన వార్త దాసరి పాడి ప్రజలకు తెలియజెప్పాడు. ప్రజలు తల వూపినారు. కాని అనుకొన్నంత రసవంతముగ పాపయ్య శౌర్యమును వర్ణించలేకపోయినా దేమిచెప్మా అనుకొన్నారు ప్రజలు.

దాసరి పాట

తల్లి తనకొడుకువంటిమీద మళ్ళీ చెయ్యి వేసి చూచినది. దాసరి తాంబ్రా కిందపెట్టి రెండుచేతులతోను కొడుకునెత్తుకొని రెండో బుజముమీద వేసుకొన్నాడు. వేసుకొని బిక్క మొగముతో భార్యవంక తిరిగి చూచేడు.

పాపయ్య బంధువులమరణమునకై ఎన్నడూ ఎప్పుడూ విలపించనట్లు ఆరోజున విలపించేడు. దాసరిపాడిన పాట ఇంత కరుణామయముగా ఎప్పుడూలేదని అనుకొన్నారు ప్రజలు. పాపయ్యతో పాటు దాసరితో పాటు ప్రజలుకూడా కన్నీళ్ళువిడిచి విలపించారు.

ఆనాడాదాసరి ఆలపించినవిలాపగీతికకు దాసరిహృదయ తంత్రులే తంబురాతీగలై శ్రుతికలిపినవి.

ఆనాడాదాసరి ఆలపించిన విలాపగీతికకు ఆతల్లి తన హృదయముమీద చేతులతో గుమిసివాయించినది.

౧౯-౨౭

ఊరి పేరు

౧

ఆ రాజ్యమును పాలిస్తూవున్న మహారాజుకీర్తి దేశదేశములా వ్యాపించినది, ఎక్కడలేని పండితులూ, కవులూ, యాచకులూ, రాయబారులూ ఆ మహారాజు దర్శనంకోసము వస్తూ పోతూ ఉండేవారు. కవు లీమహారాజును భోజుడన్నారు. యాచకు లీమహారాజును కర్ణుడన్నారు. పరరాజు లీమహారాజును ధర్మరాజన్నారు. ప్రజలందరూ ఈమహారాజును భగవంతుడన్నారు.

ఈ మహారాజుగారి అసలుపేరు శ్రీ భావరాజుగారు. గద్దెఎక్కి కొద్ది సంవత్సరములే అయినప్పటికీ ప్రజానురాగము గలిగి ప్రజాహితకార్యముల చేస్తూవుండేవాడు.

సమీపరాజ్యములోనున్న ప్రజలు కాటకములచేత మూడుసంవత్సరములబట్టి బాధపడుతూవున్నారు. అతివృష్టి, అనావృష్టి కారణములుగా పంటలుపండకపోవడము ఒక కారణము. కాటకముతోపాటు అంటు వ్యాధులుకూడా ప్రవేశించినవి.

ఇంక రాజ్యములో ఉండడము దుస్సాధ్యమనిచెప్పి అక్కడి బ్రాహ్మణులు కొందరు మూటా ముల్లే కట్టుకొని, భూములూ యిళ్ళూ వదలిపెట్టి పశువులను తోలుకొని భావరాజుగారి రాజ్యమునకు వచ్చినారు. వచ్చి మహారాజుగారి దర్శనార్థమై వెళ్ళినారు.

15

ఊరి పేరు

"మహారాజా! మా రాజ్యములో కాటకములవల్లా, వ్యాధులవల్లా నిలువ నీడలేక మీఅండ చేరుతున్నాము. తృణ కాష్ఠజలసమృద్ధిగల మీ రాజ్యములో మాకు తలదాచుకోవ డానికి చోటు దయచేయించాలి" అన్నారు.

ఆమహారాజుగారు మాంభాగన్నారు. ఫలవంతమైన భూములమధ్య గృహములు నిర్మించి ఆగృహములలో యీ బ్రాహ్మణులను కాపురముండమన్నారు, భావరాజుగారు. ఒక్కొక్క కుటుంబమునకు సరిపోయే గ్రాసము నీయగల భూములను వారి వారికి పంచిపెట్టి వాటిపై పన్నులను స్వల్ప ముగా విధించినారు.

మహారాజుగారి పైకృతజ్ఞత కొద్దీ ఆబ్రాహ్మణులం దరూ ఆ అగ్రహారమునకు భావాపురమనిపేరు పెట్టినారు. కొన్ని సంవత్సరాలు ఈమోస్తరుగా జరిగినవి. బ్రాహ్మణులం దరూ కలిసి మహారాజుగారి దర్శనార్థమై వెళ్ళినారు.

"ఏమి వచ్చారు భూదేవులు" అన్నారు మహారాజుగారు.

"మహాప్రభో! చతుర్వర్ణములవారూ లేకపోవడంవల్ల మాభావాపురం, లోపసహితముగా వుండుకుంటున్నది. అన్ని వృత్తులవారూ మా అగ్రహారమున లేకపోతే మేముమాత్రం బ్రతకడం ఎలాగ" అన్నారు.

మహారాజుగారు 'సరే' అన్నారు. భావాపురము కొంత కాలమునకు అన్నిజాతుల వారికీ ఆకరమై సిరి సంపదలతో తుల తూగుతూవున్నది. మరికొన్ని సంవత్సరములు జరిగినవి. భావా పురవాసులందరూ కలిసి మళ్ళీ మహారాజుగారి దర్శనార్థమై వెళ్ళినారు. "ఇప్పుడేమి?" అన్నారు మహారాజుగారు.

దీక్షితులు కథలు

"మహారాజా! పంటలవల్ల గ్రాసము సరిపోవుచున్నది. తాగుటకు కావలసినన్ని నీళ్లుకలవు. మాపశువులకు గడ్డికొదవము లేదు. మీరాజ్యములో పండే పంటలూ, కూరగాయలూ, మీ రాజ్యములోని మంచిమంచి పశువులూ, ఇతరగ్రామములలో మంచిమంచి పనివాండ్రు తయారుచేసిన వస్తువులూ మాకు లభించడం ఎట్లాగ? మేము దూరదేశములు వెళ్ళగలమా మహారాజా?" అన్నారు పురవాసులు.

"అయితే ఏమికావా" లన్నారు మహారాజుగారు.

"ఒకవారము మావూళ్ళో సంతజరిపేటట్లు ఉత్తరువు పాలించాలి ప్రభువువారు" అన్నారు ప్రజలు.

"సరే", అన్నారు మహారాజుగారు. ఇతరగ్రామముల నుంచి వచ్చిన సరుకులు తాముకొంటూ తమగ్రామములోనివి యితర గ్రామములవారికి అమ్ముతూ సంతుష్టిగా కాలము గడుపుతున్నారు ఛావాపురవాసులు. మరికొన్ని సంవత్సరములు జరిగినవి. ప్రజలందరూకలిసి మహారాజుగారి దర్శనార్థమై వెళ్ళి నారు మళ్ళీని.

"ఎందుకు వచ్చేరు" అన్నారు మహారాజుగారు.

"ప్రభువులవారు మావిన్నపం పాలించాలి. మాగ్రామములో వెలిసిన శ్రీకృష్ణస్వామికి దేవాలయం నిర్మించుకొని చాలాకాలమైనది. దేశ దేశములవారూ మా కృష్ణస్వామిని కొలిచి యిష్టసిద్ధులు పొందవలెనని మేము ఆశిస్తున్నాము" అన్నారు ప్రజలు. "ఏమిచేయమన్నారు" అన్నారు మహారాజు గారు. "తమరాజ్యములోవారూ ఇతరరాజ్యములలోవారూ తమతమ రాజ్యములలో ప్రసిద్ధికెక్కిన పనివాళ్లుతయారుచేసిన

ఊరి పేరు

రక రకముల సామానులతో మాఊళ్లో దుకాణములు పెట్ట వలెను. అందరూ మా కృష్ణస్వామిని కొలవవలెను. అందు కోసం మా భావాపురములో ఏడాది కొకమారు తిరునాళ్ళ జరిగేటందుకు ఉత్తరువు దయచేయించాలి. ఇంతే మామనవి'', అన్నారు.

''సరే'' అన్నారు మహారాజువారు. ప్రతియేడూ నేర్ప రులైన శిల్పులు తయారుచేసిన లోహవిగ్రహములు, శిలావిగ్ర హములు, కర్రసామానులు, యింకా యితర వస్తువులు చుట్టుపట్ల రాజ్యములలోని ప్రజలు తేగా భావాపురం కలకల లాడుతూ వుండేది. అనేకవిద్యలలో ప్రవీణులైనవారువచ్చి తమ విద్యలను ప్రదర్శించేవారు. కాడి పట్టులూ, గుండ్లెత్తడాలు, మొదలైన బలమును సూచించేపనులు చేసేవారు చాలామంది. వీటితో పాటు అశ్వజవపరీక్షలూ, వృషభ బలపరీక్షలూకూడా జరుగుతూ వుండేవి. ఇవిగాక పురాణకాలక్షేపాలూ, హరికథలూ, వీధిభా గవతాలూ, యక్షగానాలూ, తోలుబొమ్మలాటలూ మొద లైనవి ప్రజలకు సంతోషాన్ని కల్పించేవి.

అన్నిటికన్నా గొప్పవిషయం ఏమంటే శ్రీకృష్ణస్వామి మహత్తు దేశదేశములా వ్యాపించింది.

భావాపురం తిరునాళ్ళ చాలా ప్రసిద్ధికెక్కింది.

ఈరీతిగా చాలా సంవత్సరములు జరిగినవి.

భావాపురవాసులందరూ ఏవిధమైన లోటూలేకుండా తమయేలికవంటి ధర్మప్రభువులు యిదివరకు పుట్టలేదనీ, యిక పుట్టబోరనీ దృఢవిశ్వాసముగలవారై కాలమును పుచ్చినారు.

శ్రీశ్రీభావరాజుగారు కొన్నేళ్ళకు కీర్తిశేషులైనారు.

దీక్షితులు కథలు

చాలకాలమువరకూ ఆరాజ్యమును వారివంశస్థులు పరిపాలనచేసినారు. కొన్నితరములైన తరువాత ఆరాజ్యము యీవంశస్థులచేతినుండి వేరొకరి వశమైనది.

భావరాజుగారి వంశమువారు రాజ్యచ్యుతులైనప్పటికీ భావరాజుగారికీర్తి భావాపురములో స్థిరస్థాయియైవున్నదిగదా అని వారివంశస్థులూ సంతోషించేవారు. కొన్నివందల సంవత్సరములు గడచినవి.

రాజ్యముల సరిహద్దులుమారినవి. స్వదేశరాజుల పరిపాలనము అంతరించింది. దూరదేశములనుంచి భిన్న వేషభాషలుగల కొత్తవారువచ్చి యీరాజ్యములను ఆక్రమించి ఏలడము ప్రారంభించినారు. రాజ్యములలో, అనుకోని మార్పులు అనేకములు సంభవించినవి.

౨

భావాపురంలోని ప్రజలలో వేషభాషల్లో మార్పులు పుట్టినవి. రాజుల్నిబట్టి ప్రజలు మారడము సామాన్యంగా సహజం.

వేషభాషలతోభాటు వారి వృత్తులుకూడా మారిపోయినవి. మనఃప్రవృత్తులు మారినవి. ఈక్రొత్తసంప్రదాయాల స్వీకరించిన యువకులందరూకలిసి ఒకనాడు గ్రామస్థుల సభ చేయించారు. అందులో ముఖ్యముగా రాజవిద్యనభ్యసించినవారే యీసభ నలంకరించారు.

అసలు సభచెయ్యడానికి కారణం ఏమిటీఅంటే-ఆచుట్టుపట్ల గ్రామముల నేలుతూన్న ప్రతినిధి స్తోత్రప్రియుడు. తానీదేశమున కొద్దికాలమే ఉండువాడనేసంగతి గ్రహించి ఆ స్వల్ప

కాలములో తనకీర్తిని ఆ ప్రాంతముల నెలకొల్పవలెననే అపే క్షతో వున్నాడు. స్తోత్రప్రియుడికి స్తోత్రపాఠకులు దొరకడం ఏమికష్టము? అందులో ఆయన సర్వాధికారియై వున్నప్పుడు. భావాపురయువకులు పెక్కురు ఆయన నాశ్రయించినారు. ఆయన తన మనోభీష్టమును వీరికి వెల్లడిచెయ్యగా "అదెంత పని" అన్నారు వీరు.

"అయ్యా! మీరా భావాపురము ననుసరించియున్న భూములనుకొన్ని నివేశనస్థలములుగా ప్రజలకు యిప్పించాలి. దానికోసమై మీరు స్వల్పముగామాత్రము దరఖాస్తుసొమ్ము పుచ్చుకోవాలి" అన్నారు.

"అయితే భూమికోసం దరఖాస్తులు పెట్టించండి" అన్నాడాయన.

యువకులు, అందరిచేతా, స్వల్పమూల్యమునకు వస్తున్నాయని, నివేశనస్థలములకోసము దరఖాస్తులు పెట్టించినారు. భావాపురమునను సరించి కొద్దికాలములో ఒకపేట ఏర్పాటు కాబడ్డది. ఆ పేటకు ప్రాముఖ్యముకలగడానికి ఆ అధికారి తన ఆఫీసుల నక్కడనే కట్టించుకున్నాడు. యువకులందరూ కలిసి ఆ పేటకు ఆ అధికారి పేరు పెట్టితీరాలి అన్నారు.

ఆ పేటనందరూ కూపరుపేట అని పేర్కొన మొదలు పెట్టినారు.

కొన్ని సంవత్సరములు జరిగినవి.

"మీపేరు మావూళ్ళో శాశ్వతముగా వుంటుందిగాదా, ఇంకెందుకు మీకు విచారం" అన్నారు యువకులు, అధికారిని చూచి "పేటకు అంత ప్రాముఖ్యములేదు. ఊరి పేరు దేశదేశ

ములా తెలుస్తుంది. పేటపేరు చుట్టుపక్కల మాత్రమే చెప్పు
కుంటారు'' అన్నాడు అధికారి.

''చిత్తము. అలాగే చేయిస్తాము'' అన్నారు యువకులు.
''మేలు మరువను సుమండీ'' అన్నాడు అధికారి.

భావాపురవాసుల సభ కరతాళధ్వనులతో బాగుగా
జరిగినది. అగ్రాసనాధిపతి సభను జరిపించాడు. యువకులు
కొందరు ఉపన్యాసములిచ్చారు.

''అగ్రాసనాధిపా,! సభ్యసోదరులారా. ఈనాడు మన
మిక్కడ సమావేశమైన సంగతి మీకందరకు దెలిసినదే.
న్యాయతీర్పరియు, ధర్మమూర్తియునగు మన యధికారి కూపరు
గారి యెడల మనము చూపవలసిన కృతజ్ఞత క్రియాపూర్వక
ముగా నుండవలెనని నేను మెండుగ నుపపాదించుచున్నాడ.
అయ్యధికారి గుణములపుట్ట. వన్నెపెట్టిన కుండనము. త్రుప్పు
పట్టిన యినుముగాడు. ఈయన పేర మనమీపురమును పిలిచి
నట్లయిన మనకు అనేకవిధములగు లాభములున్నవి. ఆయన
యెడల మనము కృతజ్ఞత చూపిన వారమగుదుము. మనయూరి
ప్రస్తుతనామంబు చాల ప్రాతపడియున్నది. ఆ పేరు మార్చనిచో
మన యూరివారందరు పూర్వాచారపరాయణులనియు, మూఢ
విశ్వాసముకలవారనియు పాలకు లూహింతురు. కాబట్టి మన
యూరికి కూపరుపురమను నామధేయ ముంచవలెనని నేను మీ
సమ్మతికోరినాను. నేను నుడివిన తెఱంగున మీరలాచరించిన
నేనమందానందకందళితహృదయారవిందుడనగుదును. అప్పుడే
మనము కూపరుగారియెడల కృతఘ్నులము కాలేదని ప్రపంచ
మునకు ముక్తకంఠములో నొక్కి వక్కాణించినవార మగు

దుము.'' యువకులందరూ కరతాళధ్వనులుచేసి తమ సమ్మతిని తెలిపిరి. ఒక మూలనుంచి ఒక ముసలివాడు లేచి "అయ్యలారా! మాపెద్దలు చెప్పగా విన్నాను. ఏమహారాజో మన పెద్దలకు ఉపకారం చెయ్యడంవల్ల మనపెద్ద లీపురమునకు భావాపురమనే పేరుపెట్టినారట. నేను ముసలివాడిని. నామాటలు మీకు వినిపిస్తున్నాయో లేదో. పేరు మార్చడం దోషం. దోషం. తరవాత మీచిత్తం.''

యువకులందరూ గోలచేసినారు. అగ్రాసనాధిపతిగారు వోట్సు తీసుకున్నారు.

పురమునకు కొత్తపేరు వుంచవలెనని తేలింది. అల్పాహారములతో సభ ముగిసింది.

సభాతీర్మానములు దొరగారికి తెలియచేశారు. గ్రామరికార్డులలో యిప్పటినుంచి కొత్తపేరే వాడుతూవుండవలసినదిగా వారు ఉత్తరువు చేసినారు. అనాటినుంచీ భావాపురమనేపేరు అంతరించిపోయినది. కూపరుపురమనేపేరు వ్యవహారములోనికి వచ్చినది.

... ...

సంవత్సరాది సమీపిస్తూవున్నది. యువకులందరూ అధికారితో ఎక్కువ చనువుగా వుంటున్నారు. అధికారి వీరివంటివారులేరని స్నేహితులతోటీ, పై అధికారులతోటీ చెప్పినాడు. వీరినిగురించి పెద్దపెద్ద వుత్తరములు వ్రాసినాడు. వారందరూ ఎంతోఆశతో కనిపెట్టుకొనివున్నారు.

సంవత్సరాదివచ్చినది. బోలెడంత డబ్బుఖర్చుపెట్టి అధికారిని యువకులు గౌరవించినారా రోజున. సంవత్సరాదిపట్టిక

వచ్చినది. దేశములోని ప్రముఖులగు వారందరికీ అందు బిరుదు లిచ్చినారు. కూపరుపురములోని యువకుల పేళ్ళుమూడు ఆపట్టికలోవున్నాయి.

ఒకరికి "రావు" అనుబిరుదు వచ్చినది.

రెండవవారికి "దివాను" అనుబిరుదు వచ్చినది.

మూడవవారికి "సాహేబు" అనుబిరుదువచ్చినది.

యువకులు ముగ్గురూ గ్రామమంతా స్వంతఖర్చులతో వూరేగినారు. ఈఅధికారివంటి ప్రభువు యింతకుముందు పుట్టలేదు, యింకముందు పుట్టబోడని వుపన్యసించినారు. కొంతకాలము గడిచింది.

కూపరుపురం ప్రజలనోళ్ళల్లోపడి క్రమక్రమంగా నలిగిపోయింది. నేడు దానికి కుప్పాపురం అనేపేరుస్థిరమైంది. నేటి కవులు తమగ్రంథాల్లో దీనిని రాశీపుటభేదనమని వర్ణిస్తూ వస్తున్నారు.

౧౯-౨౦

కిష్కింధలో కోతి ✓

౧

ఆకొండను మీరు చూచి ఉండరు. నాటికీ నేటికీ ఎవ్వరూ కూడా ఆకొండను చూచి ఉండరు. చూడరు. చూడడానికి ఎవ్వరికీ మనస్కరించదు. అంత పాపభూయిష్ఠమైన కొండ అది. న్యాయానికి ఆకొండది తప్పుకాదు. దాని నాశ్రయించుకొని బ్రతికిన నావల్ల ఆకొండకు కళంకం వచ్చింది.

పవిత్రమైన ఏటిగట్టుననే ఉన్నది ఆకొండ; లోకాల కళంకాన్నంతా కడిగివేసే శక్తిగల ఆయేరు ఆకొండ కళంకాన్ని కడగలేదు. నావల్లనే ఆకళంకం ఆకొండకు పట్టుకొంది కాబట్టి.

పవిత్రమైన ఏరు. అద్దరినీ ఇద్దరినీ దట్టముగా పెరిగిన ఫలవృక్షములు. నీటిఅంచుల నాశ్రయించి పెరిగిన రెల్లు దుబ్బులూ, రెల్లుదుబ్బులనాశ్రయించిన చిన్నపక్షులూ, అనంత ప్రాణికోటి. ఆయేటి ఒకగట్టున నాకొండ. కొండకు అన్నివైపులా ఫలవృక్షములు. ఎవరు పెంచారో మాకోసమని ఆఫల వృక్షములు; ఎవరు మాకోసమని పాలవంటి ఏటినీళ్లు ఆ ప్రాంతముననే ప్రవహింపజేస్తున్నారో; మాకు ఇరుగు పొరుగుగా ఉండేటందుకు ఎవరు ఆపాటలుపాడే పక్షులను, ఆచిందులు త్రొక్కే మృగములను, ఆగంతులువేసే కీటకాదులను ఆప్రాణి కోటి నంతనూ సమకూర్చారో; ఎవరి దయాదాక్షిణ్యములు

దీక్షితులు కథలు

ప్రాపుగా మేము ఆ అడవిలో కులాసాగా కాపురం చేస్తున్నామో- మాకు తెలియదు. తెలుసుకుందామని ఊహా, ఇచ్ఛ మాకు కలగలేదు. నేనూ, నాకుటుంబమూ ఆకొండమీద కాపురము, ఆ అడవిలో సంచారము, ఆయేటిమీద విహారము. సౌఖ్యమునకు ఇదేమేరకదా అనుకొన్నాము. మాకొండమీద పెద్దపెద్ద పాషాణములు పేర్చిపెట్టినట్లున్నవి. ఆపాషాణములే ద్వారముగా ఉన్నవి. గదులుగా ఏర్పడ్డవి. అంతఃపురములైనవి. ఆపాషాణములే వేదులు, జరుగుడుబండలు; ఆపాషాణములే కోటగోడలు, సౌరంగములైనవి. ఆకొండ మాడునికి పట్టుగా, మాఇల్లుగా, మానగరుగా మేము భావించుకొంటున్నాము.

ఆ కొండప్రక్కలమీద నిలువుగా చెట్లు పెరిగినవి. దట్టముగా పెరిగినవి; ఆకొండచుట్టూ దట్టముగా పెరిగిన చెట్లు; ఆకొండనుంచి చూపుకందనంతదూరమువరకూ దట్టముగా చెట్లు; ఆచెట్లు మాకు సంచారభూములు ; ఆచెట్లు మాకు ఆటపట్టులు; ఆచెట్లు మాకు భోజనములు; ఆచెట్లు మాకు లీలోద్యానములు. సౌఖ్యమునకు ఆకొండా ఆఅడవీ మేర అని మాకు మాత్రం తోచడములేదూ ?

ఆచెట్లకొమ్మలలో రాత్రివేళ మేము నిద్రించే సమయాన చిరుతపులులూ, పెద్దపులులూ, ఏనుగులూ, సివంగులూ, తోడేళ్లూ ఆప్రాంతమున సంచరిస్తూ బొబ్బరిస్తూఉంటవి. మాకు అవి తలారులు. ఈబొబ్బరింతలతో అడవిఅంతా ప్రతిధ్వనిస్తుంటే మాకు హాయిగా నిద్రపట్టుతుంది.

పగటివేళ తేళ్లు మాకొండచుట్టూ చెంగలిస్తూ తప

గుతవి. పక్షులు, వన్నెవన్నెల పక్షులు, రెక్కలు విప్పి చాచి ఎగురుతూ మాకు నేత్రానందము కలుగజేస్తవి. రకరకముల గొంతుకలతో రకరకముల పాటలతో, రకరకముల పలుకులతో అడవిని మధురారావములలో ముంచివేస్తవి కొన్ని పక్షులు. రాలేకరాలేక చెట్లసందులలోనుంచి సూర్యకిరణములు బలవంతముగా సందుచేసుకువచ్చి పచ్చికలమీద శయనిస్తవి. మాకొండప్రక్కలమీద మేకలూ, జింకలూ, ఆవులూ మందలుగా వచ్చి తియ్యనిపచ్చిక మేస్తవి.

మాయేటి కీవలిగట్టునా ఆవలిగట్టునా పెరిగిన వృక్షములు కొమ్మలూ కొమ్మలూ కలుపుకోవడం వల్ల మేమంతా ఏటి నడిమిభాగముచేరి నీడలతోనూ వెలుగులతోనూ ప్రవహించే సుళ్లుతిరిగే, తలక్రిందులయ్యే, చెంగునదాటే ఏటినీళ్ళను చూస్తూ ఉంటాము.

ఈ సౌఖ్యోన్నతికి వశులమై తిండికీ నీటికీ లోటు లేకుండా ఆకొండమీద మేము కాపురము చేస్తున్నాము. అప్పటి కింకా ఆకొండకు కళంకము రాలేదు.

౨

ఒకనాడు ఒకపెద్దకేక వినిపించింది. ఆకేకకు చెట్లకొమ్మలల్లల్లాడినవి. కొండగుహలు ప్రతిధ్వనించినవి. ఆ కేక నందుకొని మా యేరు అన్ని దిక్కులా దానిని వ్యాపింపచేసింది.

ఆ కేక వానరలోకాన్ని ఉద్దేశించినది. వానరలోకానికంతకూ అది చాటింపు. పుట్టినాడట లోకములో పుణ్యపురుషుడొక్కడు. సంహరించినాడట వానరచక్రవర్తిని వాలిని.

కట్టినాడట పట్టము కపిలోకమునకు సామ్రాట్టుగా

సుగ్రీవునకు. ఆపుణ్యపురుషుడు అవతారపురుషుడట. ఆ అవతారపురుషుని నామమై పవిత్రమైనదట రామశబ్దము.

ఆచాటింపు, ఆ కేక, ఆపిలుపు మాశ్రవణపుటములలో ప్రవేశించి హృదయమున హత్తుకొన్నది. ఆ కేక మాకు ఆదేశమైనది.

పుణ్యపురుషుడు అవతారపురుషుడు జన్మించినకాలాన మీరు సమకాలీనులై ఉండడం తటస్థించిందా? అప్పుడుగాని మాసంతోషం మీకు బోధపడదు.

పుణ్యపురుషుని కనగలిగిన కాలము ఎంత మహత్తరమైనదో తత్కాలముననే ఉండే జనులెంత అదృష్టవంతులో ఆ కాలపువారికి తెలియకపోయినా తరువాతి ప్రజలు తెలుసుకొంటారు. ఆకాలమున తాముండకపోతిమిగదా అని వగతురు.

కాలము అనంతమైనది. అందులో కొన్నిభాగాలు ఉత్కృష్టములు. ఉదయించే సూర్యునిశోభ ప్రభాతానికి పట్టినట్లు ఉదయించే మహాపురుషునిశోభ ఆకాలానికి పట్టుతుంది.

ఒకదివ్యకాంతి ఆకాలాన్ని ఆవరిస్తుంది.

ఒకదివ్యసౌరభము ఆకాలములో ఇమిడి ఉంటుంది. ఆకాలానికే ఒక దివ్యమైనమాధుర్యం ఉంటుంది. ఆకాలములోనే పక్షులు మరీ శ్రావ్యముగా పాడుతవి. ఆకాలములోనే మేఘములు నెలకు మూడువానలు కురుస్తవి. పంచభూతములూ ఆకాలభాగాన్ని అంటిఉన్న కల్మషాన్ని కడిగివెయ్యడానికి పూనుకొంటవి.

మహాపురుషోదయాన్ని చూడగలిగిన ఆనాటిప్రజలు ఎంత అదృష్టవంతులై ఉంటారు!

కిష్కింధలో కోతి

ఆకాలపుప్రజ లందరూ అదృష్టవంతులా? ఆకాలపువారి కందరికీ సంతోషముంటుందా? కారు; ఉండదు. కోరికలు పెంచుకొని పెంచుకొని ఆకోరికలు సఫలపరుచుకోవడమే సంతోషమని ఊహించేవారికి మహాపురుషోదయముతో ఏమిపని?

అధికారమును ఆశ్రయముగా చేసుకొని లోకమున కుపకారం చేస్తున్నామని చెప్పి అపకారం చేసేవారికి మహాపురుషోదయము అసంభవము.

తమతమ శాసనములకు ప్రజలను లొంగదీసుకొని వాటినే మతముగా భావించుకోమని బోధించేవారికి మహాపురుషోదయ మేటికి? మహాపురుషోదయమునాటి ప్రజలు అవతారకారణమైన మహాపురుషుని కార్యములు సాధించుకోడానికి సాధనములై ఉంటారు. అందువల్ల నేవారికి సౌఖ్యముండదు. లోకులు సాధారణముగా దేనిని సౌఖ్యమని భావిస్తారో అది ఉండదు. వారి జీవితమంతా కష్టభూయిష్ఠమై ఉంటుంది. మహాపురుషునితో బాటు జన్మించినందుకు వారికి ఫలము ఈసడింపులు, బాధలు, మరణము. కాని వారి మనస్సుమాత్రము నిండుశాంతితో నిండి ఉంటుంది.

బాధలు తలుచుకొని మహాపురుషుని ఆదేశములు లెక్కచెయ్యరు కొందరు.

మహాపురుషుని ఆదేశనిర్వాహణము స్వర్గతుల్యముగా భావించి సమస్తమూ అందుకొరకై ధారపోస్తారు కొందరు.

3

ఆనాటి కపిలోకమునకు ఆజ్ఞవచ్చినది, రాముని ఆజ్ఞ సుగ్రీవునిద్వారా వచ్చినది.

దీక్షితులు కథలు

ప్రతియొక్క కపినీ ఉద్దేశించిచేయబడ్డ ఆజ్ఞ అది. రాక్షస సంహారమునకు పూనుకొమ్మని ఆజ్ఞ. సుగ్రీవుని కేతనముక్రింద చేరి రామకార్యమును కపులందరూ నిర్వహించమని ఆజ్ఞ.

అట్టి ఆజ్ఞలో ధనములేదు. సౌఖ్యము లేదు. అట్టి ఆజ్ఞలో నిరంతరత్యాగ మున్నది. స్వర్గ మున్నది.

ఆ ఆజ్ఞ కిష్కింధ అంతటా వ్యాపించినది. కిష్కింధా వాసులందరూ దానిని పాటించారు. సుగ్రీవునాజ్ఞ తలదాల్చి స్వధర్మనిర్వహణార్థము బయలుదేరారు. స్త్రీపురుషవిచక్షణ లేదు. వృద్ధులూ, బాలురూ అనేవిచక్షణ లేదు. అందరూ ఒక్క హృదయముతో ఒక్కపట్టుదలతో, భక్తితో ఆవేశముతో సుగ్రీవునికొండ చేరారు. త్యాగమనే బుద్ధిలేదు. కీర్తివచ్చుననే ఆశలేదు. శాశ్వతత్వమువారికి కలుగుననే ఆశలేదు. స్వామి కార్యముమీదనే బుద్ధి. మహాపురుషుని ఆదేశమును విధేయ పూర్వకముగా అంగీకరింపవలెననియే సంకల్పము. వారందరూ ధన్యులని వేరే చెప్పవలెనా ?

ఆ ఆజ్ఞ మాకొండనూ చేరినది. మాచెవులలోకూడ పడ్డది. ఆ ఆజ్ఞవిని మాకొండ, అచ్చటివనము, అయేరు పులకితములైనవి. ఆ ఆజ్ఞను విన్నసంతోషము మాకు కలిగింది. ఆ ఆజ్ఞను అందరూ పరిపాలిస్తున్నారనే వార్త మాకు సంతోషము కలిగించింది. మా జాతి వారందరూ స్వామికార్యధురంధరులనిన్నీ, మాజాతివారందరూ త్యాగశీలురు, పరాక్రమశాలులూ అనిన్నీ మాకు గర్వము కలిగింది. మాహృదయములుకూడా ఉప్పొంగినవి.

సుగ్రీవుని కేతనము క్రిందకు మేము కూడా సాయుధులమై

చేరవలెనుగదా! సోత్సాహులమై శ్రీరామకార్యముకు మేము మాత్రము పూనుకొనవద్దా? మమ్ముకూడా ఉద్దేశించినదేగదా ఆ ఆజ్ఞ. స్వామిఆజ్ఞ కెదురుపోవచ్చునా? దైవకార్యము కాదనవచ్చునా! ఎవరికొరకు యీదేహములు పెంచుకొను చుంట--స్వామికొరకేగదా!

ఎవరివల్ల యీసౌఖ్యములు మాకు కలుగుతున్నవి—స్వామివల్లనేకదా! జన్మకు సాఫల్య మేమిటి?—బ్రదికినందువల్ల ఫలమేమిటి?—అవతారపురుషుడువచ్చి తనకార్యము నిర్వహించమని ఆదేశించినప్పుడ వెనుకంజ వెయ్యడం? మేముమాత్రము కపులము గామా? కిష్కింధనేలే సుగ్రీవుడు మారాజు గాడా? సుగ్రీవుని దేవుడు మా దేవుడు గాడా?

మేము కర్తవ్యమును నిర్ణయించుకోవలసినపని యేమున్నది? మేము ఆలోచించవలసిన పనియేమున్నది? మేము సందేహించవలసిన పనియేమున్నది! కాని—

౮

కాని మేము కర్తవ్యమును నిర్ణయించుకోవలసివచ్చింది. మేము సందేహించాము? మేము ఆలోచించవలసి వచ్చింది! ఆలోచించడం మొదలుపెట్టాము. సంశయాత్మ నశిస్తాడంటారు. మేము సంశయించాము. సంశయాలు తీర్చుకొని ఆలోచనలు సాగించి ముగించి తరువాత స్వామికార్యానికి పూనుకోవలెనని సంకల్పము చేసుకొన్నవా రాకార్యములలో ఎప్పుడైనా దిగడం సంభవిస్తుందా?

ఇక్కడ మాకొండ—సర్వసౌఖ్యాలకూ ఆలవాలమైన కొండ—ఇహసౌఖ్యాలకి మేరచూపించే కొండ!

దీక్షితులు కథలు

అక్కడ లంకాపురి—భీషణవక్త్రగహ్వరము తెరుచుకొని నృత్యము చేస్తూన్న మృత్యుదేవత కాటపట్టయిన లంకాపురి—భయము, బాధ, బీభత్సముల కాకరమైన లంకాపురి!

ఇది మేలా? అది మేలా?

ఇక్కడి ఈ యేరు - ఈ వనము - ఈ మృగముల సందడి ఇక్కడి ఈ విహారములు ఇక్కడి ఈ సంచారములు ఈ సుఖములు—వీటికి బదులుగా అక్కడి సముద్రోత్తరణము, సేతు నిర్మాణము, దూరప్రయాణము—ఆ రాక్షసుల కోలాహలము—అక్కడి గర్భనిర్భేదకమగు రణభేరీశబ్దములు—అక్కడి రణరంగవిహారములు, శత్రుదేశసంచారములు—అక్కడి ఆ కష్టములు! ఇక్కడ ఉండుట మేలా! అక్కడికి పోవుట మేలా?

ఇహసౌఖ్యములకూ పరసౌఖ్యములకూ సంఘర్షణ కలిగింది. ఇంద్రియసౌఖ్యములకూ పరసౌఖ్యములకూ ప్రబల యుద్ధము తటస్థించింది.

ప్రత్యక్షసౌఖ్యములను చూపి ఇంద్రియములు పరసౌఖ్యముల నీసడించుచున్నవి.

రానున్న శాశ్వతత్వముకై ఆశా, అందులో నిరవధికానందమునూ తెలిపి పరసౌఖ్యములు ఇంద్రియములపై దాడి వెడలుచున్నవి.

ఇంద్రియసుఖములలో మృత్యువు నిత్యమూ సంచారం చేస్తూ ఉంటుంది.

పరసౌఖ్యములో నితత్త్వము నిర్మలత్వము!

చేతులో సుఖములను వదిలిపెట్టి ఎప్పుడో రానున్న సుఖముల కపేక్షించడం వివేకమేనా? మా దేహములే మా స్వా

కిష్కింధలో కోతి

మి కేతనముకిందికిపోయి సహాయము చేయవలెనా? మామనస్సుల కాశక్తిలేదా? మాఇచ్ఛాశక్తి మాస్వామి ననుసరించి ఉండరాదా? మాసంకల్పబలము మాదేహబలముకన్న ఎక్కువ ప్రయోజనకారి కాకూడదా?

వానరసేనల విజయఘోషములు మాకొండను చేరినవి. మావానరసేనల సేతునిర్మాణములో మాసంకల్పసాహాయ్యము మేము చూచుకొన్నాము.

మావానరసేనల లంకాప్రవేశములో మామనస్సులూ ఉన్నవి. మావానరసేనల భీషణయుద్ధములో మామనస్సులూ పాల్గొన్నవి.

రాక్షససంహారము జరుగుతున్నది. వీరవానర హుంకారనాదములను మాకొండ ప్రతిధ్వనిస్తున్నది. రాక్షసహాహాకారములు మాయేటి చప్పుళ్ళలో కలిసిపోతున్నవి.

రాక్షసరాజును రామభూపాలుడు సంహారించిన వార్త పంచభూతములూ, దశదిక్కులూ వ్యాపింపజేసినవి. మా కొండకూ ఆవార్త చేరినది.

మామనస్సులలో సంతోషము మేము తెచ్చిపెట్టుకొన్నదా? నిజమైనదేనా? దానికి సహజత్వము లేదేమి?

లోకములో కొండలు తలలూపి ఆడినవి! మాకొండ తల ఊపి ఆడలేదు.

లోకములో నదులు చెంగుచెంగున గంతులువేస్తూ ప్రవహించినవి. మాయేరు మందమై, శుష్కమై ఇసుక తిన్నెలనంటిపెట్టుకు పోయింది.

లోకములో వనములు చిగిరించినవి. మొగ్గలు తొడిగి

నవి. పుష్పించినవి. పరిమళములను నల్గడల ప్రసరించినవి.

మావనము తలవాల్చినది. పుష్పముల రాల్చినది. వాయువును బంధించినది.

లోకము ప్రకాశవంతమైనది. మానివాస మంధకారమయమైనది.

లోకము నవ్వినది !

మావాసస్థానము సిగ్గుచే తలవంచి దుఃఖముచే కుమిలిపోయినది.

స్వామికార్యనిర్వహణము మావానరకులమునకు గర్వకారణమైనది.

మాకు శాశ్వతకళంకము నాపాదించినది.

లంకనుగెలిచి కిష్కింధారాజ్యమును మావారు చేరుకొన్నారట. ఆవార్త మాకుచేరినది. మాకు ఉత్సాహము లేదు.

మాకొండ మాకు భోజనము పెట్టడము మానుకొన్నది.

మాయేటి స్వాదుజలము లిప్పుడు చేదైనవి.

మాకు విహారములు లేవు.

పశ్చాత్తాపమువల్ల లాభ ముంటుందా? స్వామికార్యము లక్షించని సేవకులకు గతిఉన్నదా ?

అవతారపురుషుని ఆదేశమునే అంగీకరించని మందులకెన్నటికైనా మోక్షలాభమున్నదా? ఆకొండకు కళంకం నావల్లవచ్చింది. ఆకొండవల్ల నాకు కళంకం వచ్చిందని చెప్పి నాపాపమును నేను వృద్ధిచేసుకోను. ఆకొండను మీరు చూచి ఉండరు. చూడరు.

అభిప్రాయభేదము ✓

౧

ఆయనకు కూతురుతప్ప ఇంకెవరూ సంతానములేరు. ఆయన వడ్డీవ్యాపారంచేసే షాహుకారువద్ద గుమాస్తా. ఆయన ద్వారానే షాహుకారు బదుళ్ళు ఇచ్చేవాడు. ఆయనే పద్దులు వ్రాసేవాడు, అప్పులు వసూళ్ళు చేసేవాడు. ఆయనకు ముప్ఫయి రూపాయలజీతం. ఇదిగాక నూటికిరూపాయచొప్పున తాను బదులిప్పించినవారిదగ్గరనుంచి రుసుము వసూలుచేసేవాడు. దానాదీనా ఆయన జీవయాత్ర గడుపుతున్నాడు. ఇల్లు కొన్నాడు, తోట వేయించాడు.

ఈమధ్యనే ఆయన భార్య కొక కాసులపేరూ, కూతురి కొకకంఠె చేయించాడు. కూతురు కంటె పెట్టుకొని ఆడుకొంటూంటే తల్లిదండ్రులు చూచి సంతోషించేవారు. కూతురికి అయిదోయేడు.

౨

ఆప్రాంతాన యానాదిమనిషి కాపురముంది. ఆమెకు ఒకకూతురు. ఆకూతురికి మూడోయేడు. రెండుసంవత్సరములైనది భర్త ఆమెను వదిలిపెట్టి ఎక్కడకో వెళ్ళి. అప్పటినుంచీ ఆ యానాదిమనిషి దొరికినప్పుడు కూలీనాలీచేసుకొంటూ ఏ చెట్టుకిందో ఏపంచనో నిద్రపోతూ కూతురినిపెట్టుకుని కాల

క్షేపంచేస్తూ ఉన్నది. కూలిదొరకనప్పుడూ, రెండుమూడు రోజులపాటు తిండిదొరకనప్పుడూ కూతురిని పోషించడానికి మార్గం కనపడక ఆమె వీధులవెంట ముష్టికి బయలుదేరేది.

ఆ యానాదిమనిషికి ఆకూతురే సర్వమూ. ఇరుగు పొరుగువాళ్ళను యాచించి తెచ్చుకొన్న చిరుగుచొక్కాల తోనూ, పరికిణీలతోనూ కూతురికి ముస్తాబుచేసేది. ముస్తాబు చేసిన కూతురిని చూచి ఆతల్లి హృదయం ఉప్పొంగేది.

నల్లని, నున్నని. బూదిద అంటిన శరీరం; చిక్కుకట్టిన నల్లనిజుట్టూ; తళతళలాడిన వ్రేకళ్ళూ; అకారణముగా పెద వులు విడిపడడంచేత కలిగిననవ్వూ రోజురోజూచూచే ఆమెకు భర్తలేనిలోపం కనిపించలేదు. దీనికితోడు కొంతముస్తాబు కూతురికి చేస్తేనేకాని ఆతల్లికి మనశ్శాంతి లేకపోయేది.

అందుకని బయళ్ళలో వికసించిన తంగేడుపువ్వులు తీసుకువచ్చి ఆమె కూతురికి చెవులో జూకాలుంచేది, మెళ్ళో పేరులు వేసేది.

ఒకమారు పచ్చగన్నేరు పువ్వులూ, ఒకమారు తురాయి పువ్వులూ, ఒకమారు తంగేడుపువ్వులూ సంపాదించి కూతురికి ముస్తాబు చేసేది. కాని ఆమెకు ఇంకా తృప్తి కలగ లేదు. కారణం ఏమిటంటే?

పండుగులకూ పబ్బాలకూ నాగరీకులపిల్లలు బంగారు నగలు ధరించడం ఆమెచూచింది. అవిచాలా బాగున్నవని ఆమె అనుకుంది. తన కూతురుకూడా అలాంటినగలు పెట్టు కుంటే ఎంతబాగుంటుందో—ఎంతబాగుంటుందో! ఆపూటకుతిం డిలేని ఆయానాదిమనిషికి బంగారునగలు ఎక్కడనుంచి వస్తవి?

అభిప్రాయభేదము

3

సంవత్సరాదినాడు అందరూ ముస్తాబైనారు. అందరూ వేపపువ్వు తిన్నారు.

ఆ యానాదిమనిషికి సంవత్సరాదికి ఇతరదినములకూ తేడా ఏమీలేదు. అన్నిరోజులూ ఒక్కటే. అన్నిరోజులూ తిండికీ బట్టకూ తాపత్రయపడవలసినరోజులే.

అప్పుడు తంగేడుపువ్వులు పూయడంలేదు. రాధామనోహరం పువ్వులూ, నందివర్ధనంపువ్వులూ కలవు. వాటితోటి ఆమె కూతురికి అలంకరించింది. కాని వెనుకటికోరిక ఇంకా సఫలం కాలేదు. తనకూతురికి బంగారునగలుంచి ముస్తాబుచేసి ముద్దు పెట్టుకుంటే-ముద్దుపెట్టుకుంటే——

ఆనాడు మధ్యాహ్నం కూతురిని చంకనుపెట్టుకొని వీధి వెంట నడచి వెళుతున్నది యానాదిమనిషి. కూతురు తల్లితో ఏవేవో ఊసులాడుతున్నది.

ఒకచోట ఆయన-అంటే షాహుకారుదగ్గిరగుమాస్తా ——కూతురు ఆడుకుంటున్నది. కంటె మెళ్లో పెట్టుకొని ఆడుకొంటున్నది. ఆయానాదిమనిషి ఆపిల్లను చూచింది. ఆకంటె చూచింది. తనకూతురికి ఆకంటె——అలాంటికంటె పెట్టితే— పెట్టితే ఎంత బాగుంటుందో—అలాంటికంటె ఎలాగ పెట్టడం? పోనీ ఆకంటేపెట్టితే—అమ్మో! ఆకంటే!

ఆతల్లి ప్రాణం ఉండబట్టిందికాదు. ఆ యానాదిమనిషి ఆపిల్లదగ్గిరికి వెళ్ళింది. పళ్ళుపెడతానని మంచిమాటలాడింది. మెళ్ళోకంటెతీసింది. తనకూతురుమెళ్ళోపెట్టింది. చూచింది. తల్లిప్రాణం కుదుటపడింది. తనకూతురిని ముద్దుపెట్టుకొంది.

కాని ఒక సందేహంకలిగింది. తంగేడుపువ్వులవల్ల కలిగే అందం కంటే ఈకంటెవల్ల ఏమిఎక్కువ అందంకలిగింది? ఎందుకో ఈభాగ్యవంతులు ఈలాంటి నగలుపెట్టుకుంటూరు?

కంటె మెళ్ళోనుంచి తీసినతర్వాత గుమాస్తాకూతురు కెవ్వున కేకవేసింది. యానాదిమనిషి భయపడింది. ఆపిల్ల కేక విన్నవాళ్లు పరుగెత్తుకువచ్చారు. యానాదిమనిషి పరుగెత్తింది భయపడి. వాళ్ళు వెంటపడ్డారు. పట్టుకొన్నారు. తన్నినారు చితకామతకా ఆ యానాదిమనిషిని.

కంటె తీసినట్లు ఆమె ఒప్పుకుంది. కాని కారణం చెప్పిందికాదు. ఆమెకూతురు మెళ్ళోకంటె వాళ్ళు తీసుకొన్నారు. కూతురు ఏడ్చింది. యానాదిమనిషి కూతురుఏడ్పు విని జాలిచెందింది.

పొట్టగడవక ఆమె దొంగతనం చేసిందని పోలీసువాళ్ళకు ఆమెను అప్పచెప్పారు.

గుమాస్తా న్యాయముగా సంపాదించినడబ్బుతో చేయించినకంటె అన్యాయంగా దొంగిలించినందుకు యానాదిమనిషి కొంతకాలం చెరసాలలో కూతురుతోకూడా ఉండవలసి వచ్చింది. దొంగతనము చేసినందుకని ప్రజలన్నారు, తన కూతురికి ముస్తాబు చేసినందుకని ఆమె అనుకొన్నది.

౧౯-౨౭

భార్యమృతి ✓

౧

ఆదేశమును ఒకరాజు పాలిస్తున్నాడు. అతడు ధర్మశీలుడు, ఏకపత్నీవ్రతుడు.

ఆరాజు వివాహమాడినకన్య బాల్యమునుంచీ అతని ప్రేమదృష్టులలోనే పెరిగింది. ఆమెహృదయాన ప్రేమాంకూరాలు పుట్టడానికి అతని ప్రేమదృష్టులే కారణము. ఆమెలో ప్రేమాంకురాలు పుట్టిననాటినుంచీ అతని హృదయము రాజ్యముమీదనుంచి మళ్ళి ఆమె మీదనే పూర్తిగా లగ్నమయిపోయింది.

వారికి వివాహమైనది. ఎడబాటెరుగని ప్రేమసౌఖ్యములకు వారే పరమావధి అనిపించుకొన్నారు.

వారిప్రేమ బాల్యములో పుట్టింది. లేతమామిడిచిగురులాగ నవనవలాడింది.

యౌవనములో మందారపుష్పమువలె వారిప్రేమ వికసించింది, మల్లెపువ్వులాగ వాసించింది.

యౌవనము సడలుతోంది, వారిప్రేమ దృఢమౌతోంది.

వారిప్రేమకు ఫలముగా వారికి రత్నాలవంటి కొడుకులూ, కూతుళ్ళూ పుట్టారు.

సుఖదుఃఖాల కాకరమైన సంసారములో పడ్డవాళ్ళు మహారాజులైనా, ఎంతటిప్రేమ వాళ్ళల్లో ప్రజ్వలిస్తూఉన్నా,

వాటిఫలాలను వా రనుభవించక తీరదు.

రాణీగారి కష్టలేశము రాజుగారికి మహాకష్టమయ్యేది రాణీగారిదగ్గిరికి దుఃఖలేశమైనా చేరకుండా రాజుగారు తమ జాగ్రత్తను, దైవభక్తిని, అధికారాన్ని, హృదయాన్ని కాపలా ఉంచేవారు.

ఈవిధంగా చాలాకాలం జరిగింది.

విధివశాన ఒకనాడు రాణీగారికి చిన్నజబ్బు చేసింది. మందులిచ్చారు. కుదరలేదు. జబ్బు తీవ్రమయింది. రాజ్యములో ఉండే వైద్యశిఖామణులందరూ ఆలోచించి వైద్యముచేశారు. రోగము తిరుగుముఖము పెట్టలేదు. ఆనాటి కానాడు రోగము ముదిరిపోయింది. వాడివాడి, కొమ్మనుంచి పువ్వు రాలిపోయి నట్లు ఆవిడ ఇహలోకాన్ని విడిచిపోయింది.

రాజుగారికి రాజ్యములో ఉండే ప్రజలంతా అనున యము కల్పించడానికి ప్రయత్నించారు. రాజుగారెంత దుఃఖిం చారో ప్రజలంతగా దుఃఖించారు. రాజ్యము రాజ్యమంతా దద్దరిల్లిపోయింది.

రాజుగారికి దుఃఖము తీరలేదు. రాజ్యకార్యములనుంచి విరమించి రాజు తనప్రేమమూర్తిని నిరంతరమూ ధ్యానిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. దుఃఖము తీరడంలేదు! స్నేహి తులు, బంధువులు, ఆప్తులు ఎవరూ ఏమీచెయ్యలేకపోయారు. ఆయనముఖాన మందహాసమైనా ఎప్పుడూ అంకురించడంలేదు.

రాణీగారిని విడిచి రాజుగారు ఆట్టేకాలం ఉండలేరు అనుకొన్నారు ప్రజలు. ప్రజల భగవత్ప్రార్థనలుకూడా రాజు గారి దుఃఖాన్ని అరికట్టలేకపోయినవి.

39

భార్యమృతి [illegible]

౨

ఆ రాజ్యములోనే ఒకమర్రిచెట్టుకింద ఒక బిచ్చగాడున్నాడు. అతనికి నడివయస్సు దాటింది. అతన్ని ఆశ్రయించి, నడివయస్సులోఉన్న ఒకస్త్రీకూడా ఆచెట్టునీడనే ఉన్నది. వారిద్దరూ ఆచెట్టుకిందే నక్షత్రాలనూ, చంద్రుణ్ణీ సాక్షులుగా పెట్టుకొని చాలాకాలం కిందటనే పెళ్ళిచేసుకొన్నారు.

చిన్నతనములో ఆబిచ్చగాడు ఆమర్రిచెట్టునీడనుచేరాడు. ఎందుకుచేరాడో అతనికి తెలియదు. తనను కనిపెంచిన తల్లిదండ్రులెవరో అతనికి తెలియలేదు. తోటిబిచ్చగాళ్ళ సహవాసము వల్ల అతడు బిచ్చమెత్తి పొట్టపోసుకోవడం నేర్చుకొన్నాడు. తనచెట్టుకంటే సౌఖ్యప్రదమైన ఆవాసము వేరే ఇంకొక్కటి ఉండవచ్చునని అత డనుకోలేదు.

వేసవికాలంలో సూర్యుడు నిప్పులు కురుస్తూన్నప్పుడూ ఘూళుపులు కొట్టుతూన్నప్పుడూ ఆచెట్టునీడే అతన్ని కాపాడింది. వానాకాలంలో జోరున వానధారలు పడుతూన్నప్పుడూ, ధనికులు తాము వెచ్చగా ఇళ్ళల్లో హాయిగా ఉండేటప్పుడూ—ఆ చెట్టునీడ పక్షులకువలెనే అతనికి శరణమయ్యేది. శీతాకాలంలో చలి గడగడ వణికించేటప్పుడూ, రాజులు రకరకాల కంబళీలతో చలిని తరిమివెయ్యడానికి ప్రయత్నించేటప్పుడూ, ఆ చెట్టునీడే అతనికి–చిరుగుగుడ్డలు కప్పుకొనే అతనికి–వెచ్చనిచ్చేది. వసంతకోయిలలు అతనిచెట్టుమీద కూర్చుని కూసేవి, చిలకలు పలికేవి. సాయంకాలము కాగానే ఆచెట్టుతొర్రలో కాపురముండే రెండుగుడ్లగూబలు బయటికివచ్చి అతన్ని పలకరించేవి.

అప్పుడప్పుడు అతని స్నేహితులు—తోడిబిచ్చగాళ్ళు ఆ

చెట్టుకిందికి వచ్చి అతనితో ఇష్టాగోష్టి జరిపేవారు.

అతనికి యౌవనము అంకురించింది. యౌవనానికి జాతి మతవిచక్షణ లేదు, ధనముతో సంబంధము లేదు, జంతువులూ, మనుష్యులూ అనేభేదం లేదు. వందలకొద్ది భార్యలను పెండ్లాడ గల రాజులనే ఆశ్రయించాలని దానికుండదు. కూటికిజరుగని బిచ్చగాళ్ళ నాశ్రయించడ మెందుకనుకోదు, యౌవనం. రాజుల నాశ్రయించిన తాను బిచ్చగాళ్ళ నాశ్రయిస్తే పరువు లోప మేమో ననుకోదు. నల్లవాళ్ళ నాశ్రయిస్తే తెల్లదొరలకు కోపంవస్తుందేమో ననికూడా అనుకోదు.

అతనికి యౌవనం అంకురించడంతోనే ఏదో ఒక "వద లనికోరిక" అతనిని పట్టుకొంది. ఏమిటో తెలియదు. బిచ్చమెత్తు కొని పొట్టనింపుకోవాలనేసంగతి అప్పుడప్పుడు మరిచేవాడు.

ఒకనాడు రైలుస్టేషనులో అడుక్కోడానికి అతడు వెళ్ళాడు. ఆరైలులోనుంచి ఒక ఆడపిల్ల దిగింది. చిరుగు గుడ్డ లలోనుంచి పడుచుతనపు లావణ్యము పైకి ఉరుకుతోంది. పిల్ల గేటుదగ్గిరికివచ్చింది టిక్కట్టు లేదు. బంట్రోతు మెడమీదచెయ్యి వేసి గెంటాడు. తూలి కిందపడింది. జారిపోయిన బట్టలమూట తీసుకొంది. నవ్వింది. బిచ్చగాడు చూచాడు తనబసకు ఆమెను తీసుకువెళ్ళాడు. ఆనాడే ఆచెట్టుకిందే వారికి వివాహం జరిగింది.

ప్రతిరోజూ వారిద్దరూ కలిసి బిచ్చానికిబయలుదేరేవారు.

ఆకోయిలల కూజితములలో, ఆచిలుకలపలుకులలో, ఆ గుడ్లగూబల కూతలలో, ఆవెన్నెలలో, ఆఘూళుపులలో, ఆచలి లో, ఆఎండలో తమజీవితాన్ని కలిపివేసుకొని ఆచెట్టునీడలో వాళ్ళు సుఖమూ అనుభవించారు—రాజులనుభవించే సుఖమే!

గొప్పవాళ్ళనుభవించే సుఖమే. దుఃఖమూ అనుభవించారు— రాజులూ, గొప్పవాళ్ళూ అనుభవించేలాటి దుఃఖమే !

వాళ్ళకు మధ్యమధ్య సంతానంకూడా కలిగింది, పిల్లలు కాలురావడంతోనే ఏదో ఒకచిప్పపట్టుకొని తల్లిదండ్రులను వదిలిపెట్టి ఏదోఒకచెట్టునో, ఒకవీధినో ఆశ్రయించేవారు. వారికి కలిగిన సంతానమంతా ఈవిధముగా అన్నిదిక్కులకూ చెదిరిపోయారు. బిచ్చగాడూ వాడిభార్యా ఈవిధంగా కాలక్షేపంచేస్తూ ఉండగా ఒకనాటి సాయంకాలం విధివశాన ఆమెకు చిన్నజబ్బు చేసింది, రాత్రల్లా మేలుకొని ఆమెజబ్బును తన ఆలోచనలతో, కోరికలతో పోగొట్టవలెనని అతడు ప్రయత్నించాడు. తెల్లవారే సరికి జబ్బు నిమ్మళించలేదు సరికదా ఆమె బిచ్చానికి బయలు దేరడానికికూడా ఓపిక లేకపోయింది. ఆమెను ఆచెట్టుకిందే పడుకోబెట్టి తనభుజంమీద గుడ్డ ఆమెకుకప్పి బిచ్చగాడు తనచిప్పా, కర్రా పుచ్చుకొని బిచ్చమెత్తుకోడానికి బయలుదేరాడు. బయలుదేరకపోతే ఎట్లా? ఆరోజుకు గంజేదీ ?

ఒంటరిగా వచ్చావేమని తోడిబిచ్చగాళ్ళు అడిగారు. చెప్పాడు, అందులో ఒకడు ఒకమాత్రయిచ్చి ఆమెకు వెయ్యమన్నాడు! బిచ్చగాళ్ళల్లోనూ వైద్యులున్నారు! కొన్నివీధులుతిరిగి కొంచెంబియ్యం బిచ్చమెత్తుకొని యింటికివచ్చి భార్యకు మాత్ర వేశాడు. బియ్యం చెట్టుకిందే ఉడికించాడు. తానింత తిన్నాడు. భార్యతినేస్థితిలో లేదు. మిగిలినగంజీకూడా అక్కడ వదలిపెట్టి భార్యదగ్గిరచేరి ఆమెకు ఉపచారం చేస్తున్నాడు. రోగంమాత్రం ముదురుతోంది. కొన్నాళ్ళు గడచినవి. ఆమెకు బ్రతికే యోగ్యతలేదని బిచ్చగాళ్ళు నిశ్చయించారు. ఒకనాటిరాత్రి ఆమె

ఆచెట్టుకిందే ప్రాణాలు వదిలిపెట్టింది. బిచ్చగాడు ఆమెపక్కనే కూచున్నాడు. అతడుపడ్డ కష్టాలూ, అతడు పొందిన దుఃఖమూ ఆమర్రిచెట్టుకుతప్ప ఇంకెవరికీ తెలియవు.

3

రెండురోజు లయింది. ఆ బిచ్చగాడు ఒక్కడూ ఆచెట్టుకిందే పడిఉన్నాడు. మూడోరోజు వచ్చింది. ఆకలివేసింది. జోలి చూచుకొన్నాడు. కుక్కలు జోలి పీకివేసి బియ్యం తినివేసినవి. తోడి బిచ్చగాళ్ళు తమపొట్టకోసం తంటాలుపడుతూ అతనిసంగతే మరిచారు. చిరిగినజోలి చేత్తోపుచ్చుకొని తూలుతూ ఆబిచ్చగాడు ఇంటింటికీ బిచ్చమెత్తడానికి వెళ్ళాడు. "మొద్దులా ఉన్నావు, కూలి చేసుకోకూడదా" అన్నారు కొందరు మామూలు ప్రకారం. "చెయ్యి ఊరుకోలే" దన్నారు కొందరు. "పాడితేనేగాని బియ్యం వెయ్య" మని కొందరుపిల్లలన్నారు. మధ్యాహ్నమయింది. ఒక ముసలిముత్తయిదువ 'గంజి తాగుతావా అబ్బీ' అంది. దాక పట్టేడు. ఆమెపోసినగంజి తాగాడు. మర్రిచెట్టు కిందికి వచ్చాడు. జోలితలకింద పెట్టుకొని కళ్లుమూసుకు పడుకొన్నాడు.

. . . .

రోజూరోజూ అతడు బిచ్చానికి వెళ్లుతూనూ ఉన్నాడు, పొట్టనింపుకొంటూనూఉన్నాడు. ఏదోఒకవిధంగా, భార్య నప్పుడప్పుడు తలుచుకొంటూనూ ఉన్నాడు. యథాప్రకారం కోయిలలు కూస్తూనూ ఉన్నవి, చిలకలు పలుకుతూనూ ఉన్నవి. గుడ్లగూబలు సాయంకాలం కావడంతోనే అతన్ని—అతన్ని ఒక్కణ్ణే—పలకరిస్తూనూ ఉన్నవి.

C.-33

"గోదావరినవ్వింది"

౧

సాయంకాలము. పెద్ద ముత్తైదువ లాగ సూర్యుడు పసుపూకుంకుం పూసుకొని గోదావరిలో మునుగబోతున్నాడు. పక్షులు గూళ్ళకు చేరుకుంటున్నవి. పశువులు ఇళ్లకు మళ్ళుతున్నవి. నాగరీకగర్వ మెరుగని జానపదులుకూడా తమ తమ యిండ్లకు పోతున్నారు. నాగరీకులు క్లబ్బులకు వెళ్లుతున్నారు. నాగరీకుణ్ణి నేను షికారు పోతున్నాను!

గోదావరి యిద్దరి గట్టుమీదనుంచి నడిచి వెళుతున్నాను. గోదావరిగాలి తగిలినప్పుడు తప్ప, మిగిలిన సమయాల్లో గట్టు గట్టంతా పట్నవాసపు వాసన కొడుతోంది. ఒకచోట ఒక పెద్దమనిషి కాఫీకి బదులు ఇంకో పానీయమేకో పుచ్చుకుంటే దేహానికి ఆరోగ్యకరంగా ఉంటుందని ఒక సువాసినితో ముచ్చటిస్తున్నాడు. ఒకచోట ఇద్దరు వర్తకులు ధరలతేడాలను గురించీ, లాభాలను గురించీ ప్రసంగించుకొంటున్నారు. తాను తొడుక్కొన్న జపానుపట్టు లాగూ, "పోలో కాలరు పష్టూ" తలుచుకొంటూ ఆనందం పొందుతున్నాడు ఒక బీదవిద్యార్థి.

వెళ్ళగా వెళ్ళగా క్రమక్రమంగా ఈ వాసన తగ్గడం మొదలెట్టింది. కొంతసేపటికి ఒకకొత్తవాసన వేసింది. అది పల్లెటూరి వాసన.

దీక్షితులు కథలు

చెట్లనుంచి కమ్మనిగాలి కొట్టుతోంది — గోదావరి మీాదనుంచి వచ్చినగాలి. మోటారుకార్ల బూడిద సోకని చెట్ల ఆకులు పచ్చగా, నున్నగా, అందంగా, జేగురు ఎండలో ఆడు తున్నాయి. గట్టుకు రెండువైపులా స్వేచ్ఛగా పెరిగినదుబ్బులు. ఆ దుబ్బులలో ముగ్గురు ఆడపిల్లలు సంచరిస్తున్నారు. సిగ్గు వాళ్ళ హృదయాలలో ప్రవేశించబోయే వయస్సు. కాళ్ళకు జోళ్ళు తొడుక్కొన్నారు. జపానుజోళ్లు కావు. ఈ కాలపు చదు వుకొనే ఆడవాళ్ళు వేసుకొనే వన్నెల చిన్నెల నగిషీస్లిప్పర్సు కావు. వాళ్ళ గ్రామంలో, వాళ్ళ అన్నలో తమ్ములో మామ లో తండ్రులో కుట్టించిన జోళ్ళు. పాదాలను కాపాడేజోళ్ళు. జోళ్ళవల్ల అందం సంపాదించుగోగోరే పాదాలు కావు వారివి. పాదాలవల్లనే జోళ్ళకు అందంవస్తోంది. ఏ సభలోనూ తీర్మానం చేసుకొని తదనుగుణంగా ధరించిన జోళ్లుకూడా కావవి.

ఆ దుబ్బులలో ఆ ముగ్గురు ఆడపిల్లలూ ఏం చేస్తు న్నారు? వాళ్ళు ఆ దుబ్బులలో పాడుకొంటున్నారు. చుట్టుపట్ల చెట్లమీాద చిన్న చిన్న పక్షులు కూడా పాడుకొంటున్నవి. గోదావరిలో చిన్న చిన్న అలలుకూడా నాగరీకులకు వినిపించ కుండా పాడుకొంటున్నవి.

వాళ్లు వేసుకొన్న బట్టలు బీదబట్టలు— చిరుగుల బట్టలు — కాని జపాను బట్టలుమాత్రముకావు. ఈ కాలపు చదువు కొన్న స్త్రీలు కట్టుకొనే తళుకు తళుకు బట్టలుచూచే నాకళ్లకి వాళ్ల బీద చిరుగు బట్టలే అందముగా కనిపించేయి. సొంత సొమ్ములకీ ఎరువు సొమ్ములకీ ఉండే తేడాలాంటిదే యీ బట్టల తేడా అనుకుంటా.

"గో దా వ రి న వ్విం ది"

వాళ్ల ముఖములు సహజ సౌందర్యమును బూడిదతో కప్పుకోలేదు. వాళ్ళ తలకట్లకు జపాను ఇంగ్లండు దేశములు అందము తీసుకురావడంలేదు.

గోదావరి గట్టున పెరిగే మోదుగు మొక్క దోరఎరుపు పువ్వుల్లాగ వాళ్లు పుట్టినట్లే ఉండి మెరసి పోతున్నారు.

సూర్యబింబం గోదావరిలో సగం దిగి పోయింది.

చిదుకులూ, కర్రముక్కలూ, వేళ్ళూ నింపిన తట్టలను తలపై పెట్టుకొని ఆ ముగ్గురు కన్యలూ నెమ్మదిగా గట్టెక్కి ఇంటిమొగము పట్టారు. తోవలో వాళ్ళను చూస్తున్న నేను వాళ్ళ కళ్ళకు తగిలేను.

పట్నవాసపు మనుష్యుల్ని పల్లెటూరి గేదెలు చూస్తే ఏం చేస్తాయి? అలాగే పట్టణవాసపు నన్ను వాళ్లు అలాగ బెదురుగా తప్పించుకు పోయారు.

నాగరీకగర్వమే నా తల కెక్కి ఉన్నట్లయితే వాళ్ళని "పశువు" లని ఇంగ్లీషున తిట్టిఉందును. ఆలోచించి నన్ను నేనే అనుకొన్నాను ఆ మాట. ఎందువల్లనంటే వాళ్లు మొక్కలు పూసే పువ్వులు. నేనూ నా తెగవాళ్ళమూ కాగితపుపువ్వులము.

వాళ్ళవెంబడే నేను నడుస్తున్నాను కొంతదూరంగా. సంక్రాంతిరోజు లవడంవల్ల గొబ్బిపాటలు జ్ఞాపకం చేసుకొం టున్నా రా పిల్లలు. ఆపాటలు విందామని కొంచెం వాళ్ళను సమీపించాను. వాళ్లు పాట ఆపి కళ్లు తళుక్కు మనిపించారు. నేను వెనక్కి తగ్గాను.

అప్పుడే గేదెలనూ ఆవులనూ తోలుకుంటూ గొల్ల పిల్లలు యిళ్ళకు వెడుతున్నారు. మీావేనా పశువులంటే మావే

అని నాకేసి వింతగా చూచి గేదెల నదలించారు.

పల్లెలకు వెళ్లుతున్నారు—పట్నవాసమునకు కార్యార్థులై వచ్చిన స్త్రీపురుషులు. కొందరుస్త్రీలు కావళ్లు మెడల మీద వేసుకువెళ్లుతున్నారు—వట్టికావళ్లు—బరువులేని కావళ్లు. పట్నవాసపు సరుకులు కొనుక్కొని పొట్లాలు మోసుకు పోతున్నారు కొందరు—ఇంగ్లండులో ప్రచురించే ఇంగ్లీషు న్యూసుపేపర్లతో కట్టిన పొట్లాలు.

ఎవరి పనిమీద వారు వెడుతున్నారు. పని లేకుండా ఆ గోదావరిగట్టున ప్రాణమున్న జీవమేదీ లేదు—చదువుకొన్న నే నొక్కణ్ణి తప్ప!

సూర్యబింబం ఇంకా గోదావరిలో మునగలేదు పూర్తిగా. మేఘాలు సూర్యుడి రంగులతో అలంకరించుకొన్నాయి. గోదావరిలో అలలు పెద్దవౌతున్నాయి.

ఆడపిల్లలు ముగ్గురూ ఊసులాడుకుంటూ వెడుతున్నారు. తట్టల బరువు మూలాన్ని నడిచేటప్పుడు ఆ పిల్లలకు అందమైన మెడవంపులు కలుగుతున్నాయి.

వాళ్ళగ్రామం సమీపించాము. తాటాకు యిళ్ళ గ్రామం. పశువులు దూడల కోసం యిళ్ళకు పరుగెత్తుకు వెళ్లాయి. పసుల కాపర్లు వాటి వెనకనే వెళ్ళి కట్టివేస్తున్నారు.

ఆ ముగ్గురు పిల్లలూ వాళ్ళ వాళ్ళ యిళ్ళకు చేరుకున్నారు. వాళ్ళ తల్లు లప్పుడే బజారునుంచి బియ్యం కొనుక్కువచ్చి యిళ్ళకు చేరుకొన్నారు. వాళ్ళ తండ్రులూ అన్నలూ తమ్ములూ అప్పుడే కూలిపనులు ముగించి కూలి డబ్బులతో యిళ్ళకు వచ్చారు.

"గోదావరి నవ్వింది"

ఆ పిల్లలు వాళ్ళు తెచ్చిన చిదుకలూ కర్రలూ వాళ్ళమ్మలకు వప్పగించారు. వాళ్ళమ్మలు ఆ చిదుకులతో ఉడుకు నీళ్లుకాచి వాళ్ళ నాన్నలకూ అన్నలకూ స్నానం చేయిస్తున్నారు. ఆ చిదుకులతోనే వాళ్ళమ్మలు వాళ్ళ కుటుంబానికంతకీ అన్నం వండుతున్నారు.

ఆనాటితో ఆ బియ్యం సరి. ఆ చిదుకులు సరి. మర్నాడు యథాప్రకారం పిల్లలు చిదుకులకు, తల్లి బియ్యానికీ, నాన్నలూ అన్నలూ కూలికి.

పక్షులకూ వాళ్ళకీ ఏమీ తేడా నాకు కనిపించలేదు. వాళ్ళకీ పక్షులకీ దేవుడుమీద—వాళ్ళను పుట్టించిన దేవుడు మీద—విశ్వాసముంది.

ఒక పక్షిదగ్గిరకువెళ్ళి, పక్షీ పక్షీ, రోజూ ఎందుకు తిండికి తంటాలు పడతావు, ఒకనాడే కూడ బెట్టుకొని సుఖంగా కొంత కాలం కూచుని గడుపుకోరాదా అంటే ఏమంటుంది? ఈ ప్రపంచం అంతట్లోనూ భగవంతుడు జీవకోటికి కావలసిన యావత్తూ కూడబెట్టి ఉంచాడు. ఇం కెక్కడ నేను వేరే కూడబెట్టుకోడం—అంటుంది. నాగరికుడికి నా కా మాటలలో సత్యం కనిపించదు.

గోదావరి కేసి తిరిగి చూచాను. సూర్యుడు మాయమయ్యాడు. గ్రామంలో జానపదులు భోజనాలు చేసి సుఖనిద్రలో మునిగిపోయారు.

నేను గోదావరిగట్టు చేరుకున్నాను. పక్షులు నిద్రపోతున్నాయి. చెట్లూ నిద్రపోతున్నాయి. నేను గట్టంట ఈదురో మంటూ నడిచివచ్చి పట్నం చేరుకున్నాను. పట్నంలో ప్రజలు ఇంకా ఇళ్ళమొహం పట్టలేదు.

దీక్షితులు కథలు

౨

నాకు పట్నవాసంమీద అసహ్యం పుట్టింది. ఆపల్లెటూరికి వెళ్ళి అక్కడే ఉండిపోతే బాగుంటుం దనిపించింది. ఉదయమే గొల్లపిల్లలతో బయలుదేరి పశువుల్ని తోలుకుంటూ వెళ్ళి ఏ చెట్టునీడలోనో కూచుని ప్రకృతితో ఊసులాడుకుంటూ ఉంటే ఎంత బాగుంటుంది! చద్దిమూటలు విప్పుకొని చెట్లనీడల్లో తిని నా పశువులతోపాటు నేనూ ఆ గోదావరినీరు తాగి ఆచెట్ల నీడల్లో ఆడుకొంటూ ఉంటే! ఆ ప్రకృతి ఒళ్ళోనే అక్కడే నిద్రపోతే !

లేకుంటే, ఆ పిల్లలతోపాటు నేనూ ఒక గంప తీసుకొని చెప్పులు తొడుక్కొని పాటలుపాడే పక్షులు దాక్కొనే ఆ దుబ్బలలో చిదుకు లేరుతూ ఉంటే! పిల్లలతోపాటు నేనూ పాటలుపాడితే! మాతోపాటు ఆ పక్షులూ పాడితే! మాపాటలన్నీ గోదావరి వింటే! అయితే నాగరీకుణ్ణి ఆ పిల్లలు దగ్గిరికి రానిస్తారా? మనిషి ముట్టుకొన్న పక్షిని మళ్ళీ పక్షులు తమలో చేర్చుకోవట! నన్నా పిల్లలు వాళ్ళతో చిదుకు లేరనిస్తారా?

ఆ గ్రామంలోనే ఉండిపోయి ఆ గ్రామస్థుల వలెనే నేనూ నిర్విచారజీవనం చేస్తూఉంటే! ఆలోచించి చూస్తే నే నా పనికి తగనేమో అనిపించింది. కూలిపని చేసి కాయలు కాసిన చేతులు కావు నావి. ముళ్ళల్లోనూ, చేలగట్లనూ తిరిగి మొద్దుబారిన పాదాలు కావు నావి. శీతోష్ణాల నొకమాదిరిగా గ్రహించ గలిగే దేహము కాదు నాది. ఉన్నదానితో సంతోషపడే చదువుకొన్నబుద్ధి కాదు నాది. ప్రపంచాన్నంతనూ నా యింట్లో పెట్టుకోవాలని ఆశించే చదువుకొన్నబుద్ధి నాది.

"గోదావరి నవ్వింది"

శీతోష్ణాలను నిరంతరమూ ప్రతిఘటించవలెనని ప్రయత్నము చేసే దేహము నాది. భూమిమీద మోపితే దానిమీదనుండే రోగ క్రిములను ఆకర్షించే పాదాలు నావి. బడి పుస్తకాలు మోపిన చేతులుగాని బండరాళ్లు మోపిన చేతులుగావు నావి.

అయినా మనస్సమాధానము చేసుకొన్నాను. పోనీ నేను చదువుకొన్నవాడనుగదా, నాకు వచ్చిన చదువు ఆ గ్రామస్థులకు చెప్పి తద్వారా జీవనోపాధి కల్పించుకోకూడదా అనుకొన్నాను. కొన్నాళ్ళు ఆ గ్రామంలోనే ఉండి గ్రామ సేవచేస్తూ వాళ్ళ కృతజ్ఞతపొందకూడదా అనుకొన్నాను—చూచారా, నా చదువుకొన్న ఊహ! నేను చదువు చెప్పినందుకు వాళ్ళు నాకు కృతజ్ఞత చూపాలిట! కూలిపని చేసేవాళ్ళు యజమానులు తమకుకృతజ్ఞత చూపా లనుకొంటున్నారా? చిరుకు లేరుకొనే ఆ కన్యలు తమతల్లులు తమకు కృతజ్ఞత చూపాలనుకొంటున్నారా? పశువులు కాసేవాళ్ళు ఆ పశువులు తమకు కృతజ్ఞత చూపాలంటున్నారా? సూర్యచంద్రాదులు కృతజ్ఞత నాశిస్తున్నారా? చదువు చెప్పబోయే నాకుమాత్రం ఆ గ్రామస్థులు కృతజ్ఞత చూపా లనుకొంటున్నాను!

తరవాత కొన్నాళ్ళు ఉన్నతరువాత ఆ గ్రామంలోనే గృహనిర్మాణం చేసుకొని ఒకయింటివాణ్ణి అవుతే! ఆ చిరుకు లేరుకునే ఒకపిల్లను పెళ్ళిచేసుకొని—

3

ప్రతిరోజూ గోదావరి గట్టున షికారు వెళ్ళడం మొదలు పెట్టాను. క్రమక్రమంగా ఆ గ్రామస్థులతో పరిచయం కల్పించుకొని, తరవాత వాళ్ళ సమ్మతిని గ్రామంలో ప్రవేశించవలె

నని సంకల్పం. ఊరిపెద్దల పరిచయం సంపాదించి ఒక చిన్నబడి పెట్టి తెలుగు, ఇంగ్లీషూ, లెక్కలూ, సివిక్సూ వగైరా శాస్త్రాదులు వాళ్ళకు బోధించవలెనని అనుకొన్నాను.

ఆ ముగ్గురి పిల్లలలో ఒక పిల్లతో స్నేహం సంపాదించుకొని క్రమక్రమంగా ఆమెప్రేమ దుర్గాన్ని ముట్టడించి పట్టుకోవా లనుకొన్నాను.

ఒకనాటి సాయంకాలం గోదావరి గట్టుమీద నిలబడ్డాను. చెట్ల ఆకులు ప్రతిరోజూ నన్ను చూస్తూండడం వల్ల నన్ను పరిచయస్తుణ్ణిగా భావించినవి.

చిన్నచిన్న పక్షులు కిల కిల మంటున్నవి. ఆ దుబ్బులలో నా కళ్లు వెదకడం మొదలుపెట్టినవి. ఎవరికోసమో నేను చెప్పడ మెందుకు? మీకు తెలుసును. దుబ్బులు వట్టి చేతులు తిప్పి నాకు ప్రత్యుత్తర మిచ్చినవి.

ఎదురుగా గోదావరి. గోదావరి అవతల చిన్న చిన్న మేఘాలు పొడిగిన ఆకాశం. ఆ గోదావరి అంచునుంచి ఒకపాట ప్రవహించి నా చెవులలో పడ్డది. అటు చూచాను. ఒకనల్లని విగ్రహం కనిపించింది. ఒక చిదుకు లేరుకొనే పిల్ల. ఒక పాట పాడుతోంది కాబోలు.

ఆ చోటికి కొద్దిదూరంలో ఒక మడి. ఆ మడిలో పని చేస్తూన్న ఒక పిల్లవాడు. ఆ పిల్లవాడు ఆ పాటను విని నడుమెత్తి గోదావరికేసి తిరిగి ఒక చిన్న పల్లెటూరిపాట ఆ పిల్లకేసి పంపేడు. ఆ పిల్లకూ, ఆపిల్లవాడికీ మధ్యనున్న అవకాశం వాళ్ళ పాటలకు బాట అయినది. ఆ బాటగుండా వాళ్ళ హృదయాలు ప్రయాణం చేస్తున్నవి. ఆ బాటగుండా ప్రయాణంచేసి

వచ్చిన ఆ పిల్ల హృదయాన్ని వాడు పట్టుకొని దాచుకొన్నాడు. ఆ పిల్ల వాడి హృదయాన్ని ఆ పిల్ల పట్టుకొని దాచుకుంది. గోదావరి ఈ తమాషా అంతాచూచి నవ్వింది. ఇదంతాచూచి నేను బిక్కమొహం వేశాను.

ఆ పిల్లవాడు మడి వదిలి ఆ పిల్ల కేసి వస్తున్నాడు. ఆ పిల్ల చిదుకుల బుట్ట నెత్తిమీద పెట్టుకొని ఆ పిల్లవాడికేసి వస్తోంది. వాళ్ళిద్దరూ కలుసుకొన్నారు. వాళ్లిద్దరూ చేతులు కలుపుకొని గట్టువేపు వస్తున్నారు. ఇళ్లకు వెడుతున్నారు. ఆ పిల్ల బీద చిరుగులబట్టలే కట్టుకొంది. ఆ పిల్ల చిదుకులగంప యిటూ అటూ ఆడి ఆ పిల్ల ముఖాన్నీ మెడనీ యిటూ అటూ తిప్పించి అందాలు కురిపిస్తోంది. ఆ పిల్ల కళ్ళలోంచి ఆ పిల్ల వాడి హృదయం తొంగిచూస్తోంది. ఆ పిల్లవాడి చేతులోకర్ర; తలకు తలపాగా, మొలకు గోచీ; వంటికి నల్లని తళతళ; కళ్లల్లో నుంచి ఆమె హృదయం తొంగి చూస్తోంది.

వాళ్ళు నన్ను చూచారు. చేతులు వదిలేశారు. దూర దూరంగా నడవడం మొదలు పెట్టారు. నన్ను వాళ్ళు సమీపించారు. ఆ పిల్ల నన్ను చూచింది. నిత్యమూ నేను ఆ పిల్లకోసం ఏరి ఉంచుతూ ఉన్న చిదుకులు ఆ నాడు పిల్ల తీసుకోలేదు. ఆ పిల్లవాణ్ణీ నే నెరుగుదును. వాడు నన్ను పలకరించకుండానే వెళ్ళిపోయాడు.

నేను కొంతసేపు అక్కడే నిలబడిపోయాను.

౪

ఊరిపెద్దలతో ప్రసంగించాను. చదువుకోడానికి పిల్లలికి తీరుబడి లేదన్నారు. జీవనోపాధి వాళ్ళకు భగవంతుడేనో

కల్పించే ఉన్నాడు కాబట్టి వేరే ఈ చదువు జీవనోపాధి కల్పించవలసిన అవసరం లేదన్నారు. చదువు ఒక జీవనోపాధి కోసమే కాదనిన్నీ జ్ఞానాభివృద్ధి...యిత్యాదిగా చెప్పాను. చెప్పేటప్పుడే నా అంతరాత్మ నాకు జ్ఞాపకం చేసింది—ఏమ నంటే, నేను చదువుకొన్నది జీవనోపాధికే అనీ, లోకమంతా యిప్పుడు చదువుకుంటూ ఉన్నది జీవనోపాధికే అనీ, ఆ గ్రామములో నేను చదువుచెప్పదలచుకొన్నది జీవనోపాధికే అనీ.

వాళ్ళడిగారు నన్ను, ఏమి చదువు చెప్పుతావని. ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, హిష్టరీవగైరా పేళ్ళు చెప్పాను. వాళ్ళొకమాట చెప్పేరు. వాళ్ళ ఊళ్లో ఒక అమ్మాయి చదువుకోడానికి పట్నవాసం వెళ్ళిందిట. ఎవరో వచ్చి తీసుకువెళ్లారుట. ఆ పిల్లకు తల్లిదండ్రులు లేకపోవడంవల్ల వెళ్ళవీలయిందిట. ఆపిల్ల చదువుకొందిట. దానికి ఫలంగా ఆపిల్లకి వచ్చిందేమిటంటే! వేషాలు వేసుకుందామని తీరని ఆశా, వాళ్ళదేవుళ్ళని కొలవకపోవడం, తన గ్రామస్థులనుచూచి అసహ్యించుకోడమూ, అన్నిటికన్న గొప్పవిషయం—పెళ్ళిచేసుకోక పోవడం. నిజానికి పెళ్ళి చేసుకోకపోవడంలో ఆ పిల్లది తప్పేమీ లేదుట. ఎందువల్లనో ఏ సంబంధమూ కుదరలేదుట. కాబట్టి వాళ్ళదేవుళ్ళని మరిపించే చదువు వాళ్ళ కక్కరలేదన్నారు. వేషాలు పెంచేచదువు వాళ్ళ కక్కర్లేదన్నారు. పెళ్లిని చంపే చదువు వాళ్ల కక్కరలేదన్నారు.

అయితే ఏమంటా రన్నాను. నేను ఆ గ్రామస్థులకు చదువు చెప్పే మాటయితే రాత్రివేళ రామాయణమో, భారతమో, భాగవతమో పాఠాలు చెప్పమన్నారు—నన్ను—

53

"గోదావరినవ్వింది"

ఇంగ్లీషు చదువుకొన్న నన్ను! నేను మాట్లాడలేను. నూటికి ముప్పైమూడున్నర తెలివితేటలు తెలుగులో సంపాదించిన నేను భారతభాగవతరామాయణాదులు పాఠం చెప్పడమా? సెలవుపుచ్చుకొని బయలుదేరాను.

సాయంకాలము గోదావరి గట్టునే వస్తున్నాను. పల్లెలకు పోయే స్త్రీపురుషులు ఎదురుపడ్డారు. అలవాటుచొప్పున దుబ్బులకేసి చూచాను. దుబ్బులు నన్నుచూచి నవ్వాయి. ఆ పిల్లకోసం గోదావరితీరం అంతా కళ్ళతో పరీక్షచేశాను. ఆ పిల్ల ఒక చెట్టు కొమ్మమీద కూచుని ఎండుపుల్లలు విరిచి కింద పడేస్తోంది. ఆ పిల్లవాడికోసం చూచాను. వాడు దూరాన్నున్న పశువుల నదలించి యింటిముఖం పట్టిస్తున్నాడు. నే నక్కడ ఆగాను. ఆ పిల్లవాడు చెట్టు మొదటకు వచ్చాడు. ఆ పిల్ల విరిచి పడవేసిన పుల్లలన్నీ ఆ గంపలోకి ఎత్తాడు. ఆ పిల్ల చెట్టు దిగుతోంది. ఆ పిల్లవాడు ఆ పిల్లకేసి చూస్తున్నాడు. వెనక్కు విరిచికట్టిన చీర, మెడమీదికి దిగజారుచున్న ముడి వేసిన పెద్ద జుట్టు, కాళ్లకు కడియాలు, పెదవులకు నవ్వులు, కళ్లకు తళుకులు.

పక్షి చెట్టుకొమ్మమీద గెంతడం చూచారా? చెట్టు నంటిపెట్టుకొని పాకే తీగనుచూచారా? తొడిమవీడి కిందికి దిగజారే పువ్వును చూచారా? పిల్ల కిందకు దుమికింది చిన్న కొమ్మ మీదనుంచి. పిల్లవాడు నవ్వాడు. పిల్లవాడు బుట్ట ఆమె నెత్తి మీద పెట్టాడు.

వాళ్ళు పాటలకు మెరుగులు పెడుతూ నడిచివస్తున్నారు. చెట్ల పూవు లొక్కొక్కటి వాళ్లమీద రాలుతున్నాయి. గట్టు

పక్క మోదుగు పువ్వులు రెండు తుంపి పిల్లవాడు ఆ పిల్ల కర్ణాల నలంకరించాడు. పక్షులు కిలకిల లాడుతున్నాయి. సూర్యుని అరుణకిరణాలు లోకాన్నంతనీ కప్పాయి కాని వాళ్ల మీద మరింత దట్టంగా పడ్డాయి. గోదావరి వాయువుద్వారా వాళ్ల కాశీర్వచనాలు పంపింది. వాళ్ళు గట్టెక్కారు. నన్ను చూచారు. "వెడుతున్నా, పిల్లా!" అన్నాను. "మంచిది, అన్నయ్యగారూ! మళ్ళీ ఎప్పుడొస్తా"రంది. ఆ పిల్ల విగ్రహమంతా నన్ను చూచి నవ్వినట్లయింది.

"వెడుతున్నానురా, అబ్బీ!" అన్నాను. "మంచిది, బాబయ్యా!" అన్నా డా పిల్లోడు.

వాళ్ళు నన్ను దాటిపోయారు. గోదావరి కేసిచూచాను. నిజమో కాదో నేను చెప్పలేనుగాని గోదావరికూడా నన్ను చూచి నవ్వినట్లయింది.

౧౯౩౬

పెద్ద మేడ

ఆవీధిలో ఒక పెద్దమేడ ఉన్నది.

ఆ దారిని పోతూ ఉన్నవాళ్ళు తల ఎత్తి ఆ మేడకేసి చూచి మళ్ళీ తల కిందికి దించరు. ఆశ్చర్యపోతారు.

వాళ్లు ఆ మేడలో అందమే చూస్తారో, ఉన్నతే చూస్తారో, ధనదేవతనే చూస్తారో, చెప్పడము కష్టము.

ఆ మేడను ఆశ్రయించుకొని చాలా ఇళ్ళు ఉన్నవి. మండువా ఇళ్ళూ, పూరిళ్ళూ, గుడిసెలూ. ఆ యింటిపక్కనే రాములవారి కోవెల ఉన్నది. ఆ పెద్దమేడ మేఘమండలాలలో నుంచి కోవెలకేసి పెంకెతనపు చూపు చూస్తూ ఉంటుంది. ఆ చూపు తగిలి కోవెలలో ఉన్న రాములవారు ఒకమూలకు ఒదిగిపోయారా అనిపిస్తుంది.

ఆ మేడను డబ్బుతో కట్టారు.

మండువా ఇళ్ళనూ, పూరిళ్ళనూ, గుడిసెలనూ మర్యాదతో కట్టారు.

కోవెలను భక్తితో కట్టారు.

ఆ మేడను ఆశ్రయించుకొని కొందరు మనుష్యులున్నారు. వారు ఎప్పుడూ రూపాయల చప్పుడులో మునిగి ఉంటారు.

ఆరూపాయలచప్పుడులో పక్కకోవెలలోని తూర్యనాదాలు వారికి వినిపించవు. పక్క కుటీరాలలోని స్వచ్ఛహృదయ

పరిమళము వారాఘ్రాణించలేరు.

ఆమేడలో గూడు కట్టుకొనడానికి ఒక పిచికైనా రాదు.

ఆ మేడమీద విశ్రాంతి తీసుకోడానికి ఒక పావురమైనా వాలదు. గంగడోలు గోకించుకోడానికి ఒక ఆవైనా ఆమేడ ముందు నిలువదు.

ఆగుడిసెలలో కొందరు మనుష్యులు కాపురమున్నారు. అ గుడిసెల చూరులలోనే కొన్ని పిచికలుకూడా కాపుర మున్నవి. ఆగుడిసెలపంచ పెరిగిన పచ్చ చెట్లమీద చిలకలు కబుర్లు చెప్పుకుంటవి.

ఆగుడిసెలపంచలలో మేకపిల్లలు సరదాగా ఆడుకొంటవి.

ఆవులు ఆ పంచలలో చేరి మెడా మెడా రాచుకొంటూ కూర్కు చెందుతవి. మనుష్యులూ, పక్షులూ, జంతువులూ అరమరిక లేకుండా అక్కడ కాపురము చేస్తున్నారు.

కోవెలలో శ్రీరామచంద్రమూర్తి వెలిశాడు. రాముల వారి పాదదర్శనము కోరి ప్రతిఉదయమూ గుడిసెలలోని ప్రజలు ఆలయములో మూగుతారు.

రాములవారిద్వారా ధనదేవతను ఉపాసించడానికి మేడ లోనివారు బట్టలూ, పువ్వులూ, పండ్లూ అనే లంచాలతో అక్కడికి ప్రతిఉదయమూ వస్తారు.

కోవెలగూళ్ళను పావురాలు స్వగృహాలు చేసుకొన్నవి. కోవెల ముందున్న వరికంకులను పిచికలు స్వేచ్ఛగా అనుభ విస్తవి. కోవెలగోపురాలమీద చిలకలు విశ్రాంతికై వాలి మనశ్శాంతి పొందుతవి.

కోవెలముందు ఆ దారిని పోయే ఆవులు ఆగి కనురెప్ప

లతో నమస్కారాలు రాములవారి పాదాలకు సమర్పిస్తవి.

రాములవారి ఎదుట పావురాలు మొగ్గలువేసి వినోదము కల్పిస్తవి.

రాములవారి ఒడిలో పిచికలు సుఖనిద్ర పొందుతవి.

రాములవారిపలుకులు అనుకరించబోయి చిలకలు చిన్నబుచ్చుకొంటూ ఉంటే, రాములవారు విలాసముగానవ్వుతారు.

రాములవారికి వసంతోత్సవము జరిగే కాలాన కోకిలలు తూర్యనాదాలతో తమస్వరాలు కలిపి ఆ ఉత్సవానికి కొత్త అందము తీసుకు వస్తవి.

గోవులు తమ కోమలహృదయకోరకాలను రాములవారి కర్పించి సమాధి చెందినట్లు కోవెలపంచ నిద్రపోతవి.

మేడలోవారు బజారులో కొని తెచ్చిన పువ్వులను శిఖలలో ధరిస్తారు. గుడిసెలముందు పూలమొక్కలు నవ్వినపువ్వులు రాములవారి దేహము నాశ్రయించి పావన మౌతవి. తరువాత గుడిసెలలో వారి శిఖలలో ప్రవేశిస్తవి.

సంక్రాంతిపండుగ వచ్చింది.

రాములవారికి ప్రతిరోజూ ఉత్సవాలు జరుపుతున్నారు ప్రజలు. ఆ ఉత్సవాలు చూచి మనుష్యులూ, పశుపక్ష్యాదులూ అందరూ సంతోషిస్తున్నారు.

సంక్రాంతి పండగనాడు గుడిసెలన్నీ ముస్తాబైనవి. గుడిసెలముందు రకరకాలముగ్గులు వికాసము చూపుతున్నవి.

పెద్దమేడకూడా ముస్తాబైంది. ఆ ముస్తాబు చమ్కీబట్టల ముస్తాబులాగ ఉన్నది.

కోవెలకు దివ్యతేజస్సు ఆ నాడు వచ్చింది. రాములవారి

హృదయము భక్తుల ప్రార్థనలవల్ల మహాసముద్రమై ఉప్పొంగి పోతూ ఉన్నది. రాములవారు ఆనాడు చాచిన రెండుచేతుల మధ్యకూ ఎందరైనా పోయి దివ్యసౌఖ్యములు పొందవచ్చు నన్నట్లున్నవి. ఆ దేవుని కౌగిలిలో ప్రపంచము లన్నీ ఇముడ గలవు. ఆ కౌగిలికి అనంతకై వారము. ఆ కౌగిలిలో ఊహకు అందని ఆనందము నిబిడీకృతమై ఉన్నది. ఆ కౌగిలిలో ఆనం దము నూతనజీవనమును ప్రసాదించ గలదు.

అటువంటి కౌగిలి ఆనాడు ప్రజలకు రాములవారి అపారకృపావిశేషముచేత కలిగింది.

గుడిసెలలోనివారు ఆ కౌగిలిలో చిక్కుకొన్నారు. చిల కలూ, కోయిలలూ, గోవులూ, మున్నగు భక్తు లందరూ కౌగి లివిందు గైకొని సౌఖ్య మనుభవిస్తున్నారు. మేడవారికి రా ములవారి కౌగిలి కనబడలేదు. రాములవారు చేసుకొన్న ముస్తాబుమాత్రము చూచి వారు మురిసినారు.

కోవెలముందుకూడా సంక్రాంతిముగ్గులు పెట్టారు. పెద్ద రథము, గంటలరథము, జెండాలరథము సర్వాంగసుందరమై కోవెలముందు అది జీవకళలతో ప్రకాశిస్తున్నది. ఆ రథము మీద అంటిటా పువ్వులు హసిస్తున్నవి. ఆ రథముమీద పసు పూకుంకుం పావనత్వాన్ని వెదజల్లుతున్నవి. ఆ రథంమీద రా ములవారు కూర్చున్నారా అన్నమోస్తరుగా అది ప్రకాశిస్తు న్నది. పెద్దమేడముందుకూడా ముగ్గులున్నవి. రథములు, గుం టలకోనేళ్లు, తాబేళ్లు, పాములు, గుమ్మడిపండ్లు - ఎన్నోరకాల ముగ్గులు. ఆ ముగ్గులమీద పువ్వులూ ఉన్నవి. అవి అన్నీ ఆ యింటిముందు కూనికిపాట్లు పడుచూఉన్న ట్లున్నవి.

పెద్ద మేడ – గుడిసెలు

మహావైభవముతో తాను చేసుకొన్నముస్తాబు చూచుకొని, పక్కగుడిసెల ముస్తాబు ఆ కళ్ళతోనే చూచి పెద్ద మేడ నవ్వింది. గుడిసెలు తమముస్తాబు చూచుకొని, పెద్దమేడముస్తాబు చూడజాలక కోవెలపక్క కొదిగి ప్రతినవ్వు నవ్వినవి.

మేడ కోపముతో ప్రశ్నించింది:

"ఎందుకు నన్ను చూచి నవ్వుతారు?"

"నీ నవ్వుకు ప్రతిగా మేము నవ్వాము."

"నా అంతస్థులు విశాలములు. అందులో కళాశోభితములైన స్తంభాలు సుందరములు. నా గోడలమీది చిత్రములు రంగులతో పులకరిస్తూ ఉంటవి. నా శిఖరముమీది గోపురము లతాద్యలంకారాలతో కిరీటశోభ పొందుతున్నవి. నాలో అందమంతా ఇమిడి ఉన్నది. వీటిని అతిశయించే నా ఉన్నతి మీకు కళ్ళెత్తి చూడరానిది. నా నవ్వుకు కారణము ఇప్పుడు మీకు బోధపడిందా?"

"ఆ ఉన్నతి చూచుకొని నీవు నవ్వావు కాబోలు. నీ అంతస్థుల అమరిక మా ధైర్యమువల్ల కలిగిందే. కళాశోభితమైన స్తంభాలు మా కౌశలమునే ప్రకటిస్తున్నవి. గోడలమీది చిత్రాలు మా ఓర్పుకూ, నేర్పుకూ నిదర్శనాలు. నీ కిరీటము నీకు మేము పెట్టిందే. నీ ఉన్నతి నీకు మేము కల్పించిందే."

"మీ ధైర్యమును, మీ కౌశల్యమును, మీ ఓర్పును నేను మీకు ప్రతిఫలమిచ్చి కొనుక్కున్నాను. అందువల్ల వాటి ప్రసక్తి మీకు ఉండరాదు."

"మా కౌశల్యాదులు తుచ్ఛమైనధనముతో సరితూగవు."

ఈ సంభాషణ విని కోవెల ఫక్కున నవ్వింది.

దీక్షితులు కథలు

ఆ నవ్వు విని గుడిసెలు సిగ్గుతో తలలు వంచుకొన్నవి. ఆ నవ్వు చూచి పెద్దమేడ అపరిమితమైన ఆనందముపొందింది.

చాలా కాలము గడచింది.

గుడిసెలుండేచోట ఒక వనము పెరిగింది. ఆ వనములో పూలమొక్కలూ, పళ్ళచెట్లూ, దుబ్బులూ ఎక్కువగా పెరిగినవి. పూలమొక్కలమీద తుమ్మెదలూ, సీతాకోకచిలుకలూ ఆడుకొంటూ ఉంటవి ఎప్పుడూను. పళ్లచెట్లమీద నివాసము ఏర్పాటుచేసుకొని రకరకాలపక్షులు పళ్లు తింటూ గానము చేస్తూ ఉంటవి. దుబ్బులలో అనేకరకాల కీటకములూ, చిన్న జంతువులూ, చిన్నపక్షులూ తలదాచుకుంటూ ఉంటవి. ఆ వనమంతా ఎప్పుడూ కలకల లాడుతూ ఉంటుంది.

కోవెల ఉండేచోట ఒకరావిచెట్టు మొలిచింది. ఆ రావిచెట్టు ఆ ప్రాంతాల జంతుజాలాని కంతకూ చలవ ఇస్తూ ఉంటుంది. ఆ రావిచెట్టు మొదటా, కొమ్మలమీదా, ఆకులమీదా అంతా జీవకోటి. రావిచెట్టు ఆకుల గలగల జంతుజాలాన్ని అంతనూ జోకొట్టుతూ ఉంటుంది.

పెద్దమేడ ఉండేచోట రాళ్ళగుట్టలు ఉన్నవి. ఆ గుట్టల చుట్టూ బొమ్మచెముడు మొలిచిపోయింది. ఆ గుట్టలనిండా పాముల పుట్టలు. రాత్రివేళ గుడ్లగూబలు ఆ గుట్టలెక్కి కూస్తూ వుండడంకూడా కద్దు.

రావిచెట్టు ఆ గుట్టలమీదకూడా పళ్ళు రాల్చి మొలకలు మొలిపించాలని చూస్తూ ఉంటుంది. కాని జంతువులు ఆ మొలకలను బతకనియ్యవు.

౧౯-౨-౯

వామహస్తోద్ధారక సంఘము

మంగయ్యఉద్యోగము పోవడముకు అనేకమంది అనేక కారణాలు చెప్పారు. లక్షణమైన గవర్నమెంటు ఉద్యోగం పోవడమంటే సామాన్యము కాదు. ఉద్యోగముతోపాటు అధికారమూ, జీతమూకూడా పోయినట్టేగదా. అంతకంటె ముఖ్యమైన సంగతి – నెలజీతాన్ని మించిన డబ్బు-దోసిళ్లాది డబ్బు కూడా పోవడము తటస్థించింది. ఆ కారణముచేత మంగయ్య ఉద్యోగముపోవడాన్నిగురించి అతని మిత్రులలో కలవరం పుట్టిందంటే ఆశ్చర్యము లేదు.

వారుచెప్పిన కారణాలలో ఒకటి ఏమిటంటే- ఒకనాడు ఒక తెల్లదొర ఆఫీసు తనిఖీచేయడానికి వచ్చాడు. మంగయ్య ఆయన దర్శనం చేసుకొన్నాడు. వారి కిద్దరికీ జరిగిన సంభాషణలో మంగయ్య "మాది గోదావరిజిల్లా" అని చెప్పినట్లూ, దొర "గొడావెరిజిల్లా ఏఊరు?" అని దొర అడిగినట్లూ, "గొడావరి" కాదు గోదావరి అని మంగయ్య తప్పు దిద్దినట్లూ, తన తప్పు సవరించుకోకుండా తెల్లదొర "గొడారీజిల్లా" కాదా అని ముఖంఎర్రజేసినట్లూ, "గోడారీ" కాదు గోదావరి అని మంగయ్య మళ్ళీ చెప్పినట్లూ దానిమీద దొర కోపం పట్టలేక, శ్వేతప్రభుత్వగౌరవమును నిలవబెట్టే ఊహతో మల్లసంప్రదాయసిద్ధముగా చేతులను సవరించుకున్నట్లూ, తరువాత మంగయ్య

శరీరమాద్యంఖలు ధర్మసాధనమ్మను వాక్యమును జ్ఞాపకముచేసికొని, పారిపోయినట్లూ, మరునాడు ఉద్యోగముపోయినట్లూ కొందరు చెప్పుచున్నారు.

కాని నిజమైన కారణ మదికాదు. అంటే అది ఒకటే కాదు. మంగయ్యపైని అధికారం చలాయించే అధికారి పరంపరలో ఒకపూర్వాచారపరాయణుడైన నల్లదొర ఉన్నాడు. ఆనల్లదొర దగ్గిరకు మంగయ్య కాగితాలు దస్కతు చేయించుకోవడానికి వెళ్లుతూ ఉండేవాడు, ప్రతిరోజును. ఎన్నిమాట్లు వద్దని చెప్పినా మంగయ్య ఎడమచేతితో కాగితాలు అధికారికి అందించేవాడు. ఆరీతిగా చేయడంతప్పని అధికారి ఎన్నిమాట్లు మందలించినా అలవాటుచొప్పున మళ్లీ మళ్లీ ఎడమచేతితోనే కాగితాలు అందించేవాడు. అధికారికి కోపం వచ్చి, మంగయ్య అవిధేయతతో మెలగుతూ ఉంటాడని పై ఉద్యోగస్తులకు వ్రాసినాడు. అవిధేయత ఒక కారణమూ, గోదావరీ చర్చ వొక కారణమూ - ఈరెండు కారణాలూ మంగయ్య వుద్యోగమును పోగొట్టినవి.

మంగయ్య ఉద్యోగము పోవడముకు ఎడమచెయ్యి కారణమైనదన్న సంగతి ఎడమచేతులలో పొక్కింది. ఎడమచేతులు చేసేకార్యాలన్నీ నీచములని ప్రజలు గ్రహించుచున్నట్లు అవి గ్రహించినవి. కొంతకాలానికి ఎడమచేతులన్నింటికీ ప్రబోధం కలిగింది. వెలుగులో పడ్డవి. కుడిచేతులుచేసే పనులు గౌరవాస్పదములన్న సంగతికూడా అవిగ్రహించినవి. కుడిచేతులమీద ఎడమచేతులు కత్తి దూసినవి. నలుసంత నిప్పంటే ఎన్నిగ్రామాలైనా తగులపడతవి. మహాసంగ్రామానికి కారణము ఎంత సూ

వామహస్తోద్ధారకసంఘము

ష్నమో అందరూ గ్రహించినదే. కుడి ఎడమచేతుల మహా సంగ్రామానికి కూడా మంగయ్య ఉద్యోగంపోవడమనే చిన్న విషయమే పెద్ద కారణమయినదనడములో ఆశ్చర్యమేమీలేదు.

కుడిచేతులనుచూస్తే పూర్వం అన్యోన్యంగా ఉండేవి ఇప్పుడు కుడిచేతులమాటతలపెట్టితే తలకంటగించుకొనుచున్నవి ఎడమచేతులన్నీని. కుడిచేతులుమాత్రం ఎడమచేతులను చూచి నవ్వేవి. ఆనవ్వు పరిహాసంక్రింద ఎడమచేతులు భావించి వాటిని మరీ అసహ్యించుకొనేవి. ఈరీతిగా కొన్నాళ్ళు జరిగినది.

ఐకమత్యం బలమనే న్యాయం జ్ఞాపకం చేసుకొని ఎడమ చేతులన్నీ ఆవిషయాన్ని గురించి పెద్దపెద్ద ఉపన్యాసాలు వగైరాచేసి చివరకు ఒక సంఘం స్థాపించుకొనుటకై తీర్మానము చేసుకొన్నవి. దానికి ''వామహస్తోద్ధారకసంఘు''మని పేరు పెట్టినవి. స్వసంఘపురోభివృద్ధికి ముఖ్యముగా పాటుపడుటకై ఈసంఘము నేర్పాటు చేసినట్లు అవి ప్రకటించుకొన్నవి.

సంఘమనడముతోనే దానికి అధ్యక్షుడు వగైరా లాంఛనాలన్నీ వుండవలెనుగదా. అందుకని చెప్పి ''మంగయ్య వామహస్తము అధ్యక్షుడుగా ఉండుటకై ఎడమచేతుల సభలో తీర్మానమైనది. అన్నిపనులూ ఎడమచేతితోనే చేస్తూన్న ఒక స్థూలకాయుని స్థూలవామహస్త మువాధ్యక్షుపదవి గ్రహించినది. ఎడమచేతితోనే వ్రాతవ్రాసే ఇంకో ఆసామీ వామహస్తము కార్యదర్శిపద మలంకరించినది. ఎడమచేతితో రూపాయలు ఎంచడము, బొత్తులుపెట్టడము మొదలైన కార్యములుచేసే ఇంకో వామహస్తము కోశాధ్యక్షుపదవి స్వీకరించినది. మిగిలిన ఎడమచేతులన్నీ సభ్యులైనవి. ఈరీతిగా ఒక

సంఘమును ఏర్పాటు చేసికొని అవి అనేకతీర్మానములను అనేకసభలలో ప్యాసుచేసికొన్నవి. వాటి వాద మిది.

'అనాదినుంచీ విద్యాగంధము లేనివాటినిగా జేసి కుడి చేతులు మమ్ము అనాదరణ చేస్తూ వున్నవి. కుడిచేతులూ, మేమూ ఒక్కమోస్తరుగానే పుట్టితిమి. వాటిని కోస్తే పాలూ, మమ్ము కోస్తే రక్తమూ రావడము లేదు. ఒకమోస్తరు రక్తమే, ఒకమోస్తరు ఎముకలే, ఒక మోస్తరు కండలే, ఒక్కటేపొడవు, ఒక్కటే నిర్మాణము మాఉభయులకూ గలవు. భగవంతుడు మాకన్యాయము చేయలేదు. కుడిచేతులే మా కన్యాయముచేసినవి.

కమ్మని భోజనము లారగించుటకు కుడిచేతులే కావలెను. కష్టతరమైన కార్యములు చేయుటకు కుడిచేతులే కావలెను. బరువులుమోయుటకు, చెట్లు కొట్టుటకు, చిత్తరువులు వ్రాయుటకు, రాళ్ళుమలుచుటకు యంత్రములు నడుపుటకు సమస్తకార్యములకూ కుడిచేతులే కావలెనట. చక్కనివ్రాత వ్రాయుటకూ చదివేటప్పుడు పుస్తకము పట్టుకొనుటకూ కుడి చేతులే కావలెనట. చదువుకూ వ్రాతకూ మమ్ము ఈరీతిగా దూరముచేస్తూఉన్న వీ కుడిచేతులు. విద్యాగంధము లేనివాటినిగా ఈ కుడిచేతులు మమ్ముచేసి తరువాత విద్యాగంధములేదని ఆక్షేపించుచున్నవి. ఆడవాళ్ళతో షేక్‌హాండు చేసికొనుటకు, పుష్పములతో దేవునిపూజించుటకు, దేవునికి అభిషేకముచేయుటకు కుడిచేతులులేనిదే జరుగదు. ఇక మేము ఆడారివాళ్లలాగ ముసుగువేసుకొని ఇంట్లోకూర్చోవలసినదే.

మేము నాజూకువాళ్ళం కాబట్టి కష్టమైనపనులు చేయ

వామహస్తోద్ధారక సంఘము

లేమట. మమ్మూ నాజూకుగా చేస్తయీకుడిచేతులే. ఇప్పుడు మమ్మూ నాజూకిని ఆక్షేపిస్తూవుంట ఈకుడిచేతులే. మాకుచేసిన ద్రోహం ఇంతాఅంతా అని చెప్పడానికి వీలులేదు. ప్రతి నీచ కార్యానికీ మమ్ము నియోగించడమూ, ప్రతీఘనకార్యానికీ తాము తగుదు మమ్మాఅని పురస్కరించుకొని పనిచెయ్యడమూను. ఇంత అన్యాయం ఎక్కడైనా కద్దా?

చూడండి తెల్లదొరల చేతులు. భోజనానికి కుడి ఎడమ భేదంలేకుండా రెండుచేతులూ ఉపయోగపడుచున్నవి. ఏనీచ కార్యానికైనా ఒక్క ఎడమచేతులే చెయ్యాలనికాని లేక ఒక కుడిచేతులే చెయ్యవలెనని కాని లేకుండా ఏలాగవీలుగా వుంటే ఆలాగ పనికి వస్తున్నవి. ఇంతెందుకూ! ఒక్క గోకుకోవడము మాట ఆలోచించండి. మాసంఘములో గోకుకోవడము కూడా కుడిచేతులే చేయవలెనట! అందుకు మేము పనికి రామట. తెల్లదొరలలో ఏవైపు దురదుంటే ఆవైపుచెయ్యే గోకుతుంది. ఈఆచారము జంతువులలో కూడా వుంది. కోతులలో ముఖ్యముగావున్నది. మమ్ము ఈకుడిచేతులు కోతులకన్నా, జంతువులకన్నా హీనముగా చూస్తూవున్నవి. ఈదాస్యములో ఎంతకాలము మేముండడము. పామంటిదానికి విరుగుడు ఉంది, ఈకుడిచేతులకు ఉండకపోతుందా చూద్దాము.

మమ్ము యీకుడిచేతులు నీచముగాచూస్తూన్న వనుటకు యింకో నిదర్శనం. కుడిచేతులు మాకు పుర్రచేతులనే అవమానకరమైన పేరుపెట్టి ఆక్షేపిస్తూవుండడము అందరూ ఎరిగిన విషయమే. ఎడమచేతులతో వ్రాతమొదలగు పనులుచేసే వారిని పుర్రచేతివాళ్ళని, ఆడారిపెద్దమ్మలనీ గేలిచేయడం సర్వ

సామాన్యము. ఇకముందు ఇట్టి నీచనామములు మనకుంచరాదని మనము గట్టిగా తీర్మానముచేయవలవున్నది." ఇంతటినుండీ ఎడమచేతులన్నీ దొరలసాంప్రదాయము ననుసరించుచు ఘనకార్యాలన్నీ తామే చెయ్యడము మొదలుపెట్టినవి. ఆదేశములో ఎక్కడచూచినా ఎడమచేతితో భోజనముచేసేవారే, వ్రాసేవారే, ఎడమచేతితో టెన్నీసాడేవారే. ఈరీతిగా కొంతకాలం జరిగింది. ఇక కుడిచేతులు ఏమిచేసినవంటే, అవికూడా ఒకసంఘమును ఏర్పాటుచేసుకొని, ఒకటిరెండు పత్రికలు స్థాపించి కార్యక్రమము నడిపించుటకు మారుగా ఎడమచేతులవాదమును మాత్రము ఖండించి ఊరుకొన్నవి. వామహస్తోద్ధారకసంఘవాద ఖండనము అనుపేరుతో ఈరీతిగా అవిప్రకటించినవి.

"శ్రుతిస్మృతి పురాణేతిహాసములను తరచితరచి చూడగా ఎక్కడా కుడిచేతులకే ప్రాధాన్యమున్నదికాని ఎడమచేతులకు లేదనీ, ఆచారముకూడా ఆరీతిగానే ఉన్నదనీ, పూర్వాచారములను మీరి సంచరించడము సంఘమున కనర్థదాయకమనీ, కలికాలప్రభావమువల్ల యిట్టిఆందోళనలు సంఘములో పుట్టుచున్నవనీ ఇంతకీ కుడిచేతులు ఎడమచేతులకు అపకారము చేస్తూవున్నవని చెప్పిన హేతువులు హేతువులుకావనీ, ఎడమచేతులకూ కుడిచేతులకూ సమానమైన హక్కే వున్నదనీ ఇంకా ఏమేమో చెప్పినవి.

చేసే ప్రతిపనికీ కుడి ఎడమ చేతు లుపయోగపడుచున్నవనికూడా అవి చెప్పినవి. భోజనము చేసేటప్పుడు మంచినీళ్ళు త్రాగుటకు ఎడమచేతులే ఉపయోగపడుచున్నవి. చెట్లు కొట్టుటకు కుడిచేతు లెంత అవసరమో ఎడమచేతులుకూడ అంతఅవ

వామహస్తోద్ధారకసంఘము

సరమే. చిత్తరవులు వ్రాయుటకు కుంచె కుడిచేతులో ఉంటే రంగులపలక ఎడమచేతిలోనే ఉంటుంది. ఇంక వ్రాతవిషయములో ఎడమచేయి కాగితం పట్టుకొంటేనేగాని కుడిచేయి వ్రాయనేలేదు. చదువు విషయమై ఎడమచేతులు అబద్ధములను వ్రాసినవి. ఎడమచేతుల వాదమంతా అబద్ధములతోనూ, హేత్వాభాసలతోనూ నిండియున్నది. చదువుకొనేటప్పుడు ఎడమచేతులే పుస్తకమును పట్టుకొనుచున్నవి కాని కుడిచేతులు కావు. కుడిచేతులు పత్రములు తిరగవేయుటకు మాత్ర ముపయోగించుచున్నవి. ఇంక ఎడమచేతికి ప్రాముఖ్యమున్న యితర విషయములు ఆలోచిద్దాము. పెండ్లిండ్లలో ఎడమచేతితోనే తాను ప్రేమించిన వధువుకుడిహస్తమును పట్టుకొనుచున్నాడు వరుడు. అర్ధనారీశ్వరుడగు శివుడు తన ఎడమభాగము జగజ్జనని యగు పార్వతికి పంచియిచ్చాడు. ఇంక దేవతావిగ్రహాల్లో కుడి ఎడమ భేదం లేనేలేదు. ఒక చెయ్యి అభయహస్తం. ఒక చెయ్యి వరదహస్తం. ఇత్యాదిగా ఉంటున్నది. ఎన్నివిధాల చూచినా ఎడమచేతులకు కుడిచేతులు అనాదారణ చేస్తూన్నట్లులేదు. మాయాప్రపంచాన్ని కల్పించుకొని చేయని అపచారములు కుడిచేతులు తమకు చేస్తూన్నట్లు అవి ప్రకటించుకొనుచున్నవి. దానివల్ల వాటికేమి ఉపయోగమో తెలియదు. తెల్లవాళ్ళతో జట్టుకట్టి డబ్బు సంపాదించుకోవాలంటే ఇతర మార్గములు లేవా ? ఇక గోకుకోవడం సంగతి. న్యాయానికి రెండుచేతులూ గోకుకోవడానికి పనికివస్తూనే వున్నవి అందులో ముఖ్యముగా ఎడమవేపు దురదకు కుడిచేతులూ, కుడివేపుదురదకు ఎడమచేతులూ ఉపయోగపడుతూనే ఉన్నవి. కుడిచేతికి

దురదపెట్టితే కుడిచేతులే గోకుకోవడము లేదుకదా? అంత గోకుకోవడమనేది ఘనకార్యముక్రింద భావించుకొన్నట్లైతే ఆ ఘనకార్యమును ఎడమచేతులు చెయ్యడానికి ఏమీఆక్షేపణలేదు.

వీణ వాయించేటప్పుడు, పిల్లంగ్రోవి ఊదేటప్పుడు, కుడిచేతులెంత ఉపయోగపడుచున్నవో ఎడమచేతులుకూడా అంత ఉపయోగపడుచున్నవనే సంగతి ఎడమచేతులు మరచిపోవడము ఎట్టిచిత్తవృత్తిని తెలియచేస్తున్నదో ప్రాజ్ఞులుగ్రహించకపోరు."

ఈరీతిగా ఖండనముల్రాస్తే దానికి ప్రతిగా ఎడమచేతులన్నీ 'వామహస్తోద్ధారకసంఘవాదఖండనముండన'మనే పేరుతో వేరొక వ్యాసమునువ్రాసి ప్రకటించినవి. వధువును ఎడమవేపుపెట్టుట ఎడమచేతుల గౌరవమునకు కాదనీ, స్త్రీలుసంఘములో నీచస్థానమును ఆక్రమిస్తున్నారు కాబట్టి నీచమైన ఎడమచేతిక్రిందనే వారినిపెట్టడము తటస్థించినదనీ, ఇంక మానవుడుచేయు ప్రతికార్యములోనూ ప్రాముఖ్యత కుడిచేతులకేగాని ఎడమచేతులకు లేదనీ, కుడిచేతుల వాదమంతా స్వవచనవ్యాఘాతాలతో నిండియున్నదనీ, ఎడమచేతులన్నీ మేల్కొని కుడిచేతుల దుర్ణయములనూ, దుర్మార్గములను అరికట్టితేనేగాని సంఘము బాగుపడదనీ, స్వరాజ్యమురాదనీ వ్రాసుకొన్నవి.

వీరివాదము ఈరీతిగా ఉంటూండగా పులిమీద పుట్రఅన్నట్లు దేశమందంతటా అనేకసంఘములు బయలుదేరినవి. అందులో ముఖ్యముగా చెప్పతగ్గవి "అంగుళీసంఘములు". స్వశాఖాభివృద్ధినీ, స్వశాఖోత్కృష్టతనూ సూచించుటకై ఈ అంగుళీసంఘములు స్థాపింపబడ్డవి.

అంగుష్ఠాంగుళీసంఘము తామే పెద్దలమని లోకము

నకు చాటుటకు స్థాపింపబడ్డది. అన్నివేళ్ళకంటె అవి పెద్దవి కాబట్టిన్నీ, బొటనవ్రేళ్ళు లేనిదే ఏవస్తువునూ పట్టుకొనుటకు వీలులేదు కాబట్టిన్నీ వాటికే ఆధిక్యతఉన్నదని వాటివాదము.

తర్జన్యాంగుళీసంఘము తామే గొప్పవారమని ప్రకటించుకొనుటకేర్పడ్డది. నిర్దేశించుటకు దేనిని చూపవలసివచ్చినా తమ సహాయములేనిదే జరగదు. కాబట్టి వాటికి ఆధిక్యతకలదు అని వాటివాదము. మధ్యమాంగుళీసంఘము పొడుగునుబట్టి అధిక్యత కోరుచున్నది. అనామికసంఘమువారు తమకు అనామకులని శత్రువులు పేరుపెట్టి అన్యాయముచేసినారనీ, తామే బంగారమెప్పుడూ ధరించవలసిన ఐశ్వర్యవంతులమనీ కావున తమకే ఆధిక్యముండవలెననీ వాదించుచున్నారు.

కనిష్ఠికాంగుళీసంఘమువారు తమ్ము అందరూ కడవారిగా చూచి తమకు తగని పేరుపెట్టినారనీ, తాము అల్పులు కాబట్టి తమకే ఆధిక్యమీయవలసినదనీ, వాదించుచున్నవి. ఈ అంగుళీసంఘములు తమలో తాము పోరాడుకొనడమేగాక వామహస్తములతోనూ, దక్షిణహస్తములతోనూ హోరాహోరి పోరాడుటకు రణరంగమున దిగినవి.

స్థితిగతు లీ రీతిగా ఉండగా మిగిలిన తెగలకుకూడా ప్రబోధము కలిగించి నేత్రోద్ధారక సంఘము, ఉదరోద్ధారక సంఘము, పాదప్రబోధసంఘము శ్రోత్రోపకారిణీసంఘము యిత్యాది సంఘము లనేకములు బయలుదేరి తమతమ సంఘములను బాగుచేయు ఉద్దేశ్యముతో పనిచేయుచున్నవి, కాని యీసంఘములు అధ్యక్షాదుల నెన్నుకోవడము యిత్యాదిపనులతోను, సాలుసాలుకు కొన్నితీర్మానములను ప్యాసుచేసుకోవ

డముతోను తృప్తి పొందినవి. వామవాస్త్రోద్ధారకసంఘము మాత్రముచాలా పట్టుదలతో పనిచేసినది. కుడిచేతులపనులన్నీ ఎడమచేతులు చేయడము మొదలుపెట్టినవి. కుడిచేతులను నిర్లక్ష్యముచేసి ఏపనీ వాటికిలేకుండాచేస్తే అవికృశించిపోవుననీ, ఆపైని అన్నిపనులూ తామే చేసుకోవచ్చుననీ ఎడమచేతులు భావించినవి. ఇకముందునుంచి ఎడమచేతులన్నీ తమ పేర్లను మార్చుకొని కుడిచేతులనే పేర్లుపెట్టుకోవలెననే తీర్మానములు కూడా సభలలో చర్చకువచ్చినవి. కొన్ని ఎడమచేతులు కుడి చేతులనుపేరుతోనే వ్యవహరింపబడడంకూడా తటస్థించింది.

కుడిచేతులు పని లేకపోవడంవల్ల విశ్రాంతి తీసుకోవడం మొదలుపెట్టినవి.

సంఘములు క్రొత్తగా స్థాపించినకాలములో ఎడమచేతి చిటికినవేలూ, అనామికా కలసి కలం పుచ్చుకొని వ్రాతలు వ్రాయడం నేర్చుకొన్నవి. కాని ఆకలం క్రమక్రమంగా బొటన వ్రేలు సమీపానికి వస్తూవున్నది. కొంతకాలానికి కుడిచేతిలోనికి కూడా రావచ్చునని ఈమధ్య క్రొత్తగా స్థాపించిన "వరాహ మిహిరజ్యోతిషాలయము" వారు ప్రకటించినారు.

ప్రస్తుత పరిస్థితులనుబట్టి భవిష్యత్తు ఏలాగ వుంటుందో నిర్ణయించడము కష్టము కాని ప్రస్తుతము దీని పర్యవసానమే మిటంటే మంగయ్యకు మంచి ఉద్యోగము దొరికినది. పూర్వమువలెనే దోసిళ్ళాది డబ్బు గడించుకొంటున్నాడు.

పనిపాటలులేని కవులకూ, వ్యాసకర్తలకూ, నవలాకారులకూ కథకులకూ ఎడమచేతినిండా వ్రాయడానికి పనిదొరికింది.

౧౯౬౬

71

చెంచురాణి

౧

కర్నూలునుంచి శ్రీశైలము వెళ్ళేటప్పుడు తోవలో నాగలూటి అనేగ్రామమువద్ద యాత్రికులు మజిలీచేస్తారు. ఆ చిన్న గ్రామములో కాపుర మున్న వాళ్ళందరూ చెంచువాళ్ళే. దానికే యీమధ్య బైరాగికట్ట అనీ, మొండికట్ట అనీ పేర్లు వచ్చాయి.

నాగలూటిలో దేవాలయము ఉన్నది. దానికి ఎదురుగా నెగళ్లు వెలిగించి యాత్రికులు రాత్రులు గడుపుతారు. కొందరు దేవాలయమండపము మీద కెక్కి పడుకుంటారు.

నాగలూటి గ్రామము అడవులమధ్య ఉన్నది. మామిడిచెట్లూ, వెదురుదుబ్బులూ అక్కడ ఎక్కువగా పెరిగిఉన్నవి. మాఘమాసములో తాండ్రచెట్లు బాగా పుష్పిస్తవి. ఆపువ్వుల సౌరభము రాత్రివేళల నాగలూటి ప్రాంతాల వ్యాపిస్తుంది. అప్పుడే మామిడికాయలూ, చిలకకొట్టులూ రాలడం ఆరంభం. చెంచువాళ్ళు ఆ కాయలూ, పళ్ళూ తిని, పొట్ట నింపుకుంటారు.

వేసవికాలములో నాగలూటివద్ద మృగభయము కద్దు. రాత్రివేళ అప్పుడప్పుడు నీళ్ళు తాగడానికి ఒక్కొక్క పెద్దపులి ఆ ప్రాంతాలకు వస్తూవుంటుంది. అందు కోసరమే యాత్రికులు

నిద్ర మాని నెగళ్ళచుట్టూ కూర్చుంటారు.

నాగలూటి దగ్గిర చిన్న నీళ్ళకుండు (పుష్కరిణి)వున్నది. ఆ కుండులోకి ఎప్పుడూ పాతాళగంగ ధారగా వచ్చి పడుతూ ఉంటుంది. ఆ కుండులోనే యాత్రికులు స్నానముచేయడము. ఆ నీళ్ళే ఆ గ్రామస్థులు తాగడము. ఆ నీళ్ళ కోసమే పెద్ద పులులు రాత్రివేళల రావడము.

నల్లమల కొండలు అరణ్యమయము. అక్కడక్కడ చెంచుగూడెములు చాలాకలవు. నాగలూటి అటువంటి చెంచు గూడెమే. ఈ కొండలలోనే పుణ్యక్షేత్రములు కలవు. శ్రీశైల మన్నిటిలోను మహాత్తుకలదని ప్రసిద్ధికెక్కినది. శ్రీశైలము మీది రాళ్ళన్నీ శివలింగములేనట. శ్రీశైలముమీది చెంచు లందరూ సిద్ధులేనట.

శ్రీశైలమును బట్టి నల్లమలకొండలకూ, అందలి అరణ్యములోని చెట్లకూకూడా మహాత్తు కలిగింది.

ఒకయేడు శివరాత్రికి శ్రీశైలము వెళ్ళి తిరిగి వస్తూ కొందరు యాత్రికులు నాగలూటి సమీపాన వంటచేసుకొంటు న్నారట. వారికి ఆ నాటికి ఒకచెవులపిల్లి ఆహారము కాను న్నది. కుండలో దాని మాంసముంచి కూరవండుతూ కలియ బెట్టడానికి ఏమీ లేక కర్రముక్క పక్కనుపడివుంటే దానితో ఆ కూర కలియబెట్టేసరికి కుండలోనుంచి చెవులపిల్లి బుడుంగున బయటికి దుమికి పారిపోయిందట. సంజీవిని కున్న ప్రభావము నల్లమలకొండల మీది కొన్ని చెట్లకు కలదట.

చెట్లకే కాకుండా అక్కడ వాసముచేసే కొందరు సిద్ధు లకుకూడా యిటువంటి మహాత్తు కలదట.

చెంచు రాణీ

మనుష్యులకు ఆకలి లేకుండా వుంటే ఎంత బాగుంటుందో, ఏ తాపత్రయమూ లేకుండా హాయిగా భగవన్నామస్మరణ చేస్తూ కాలంగడపవచ్చునుగదా అనుకొనేవాడు ఒక బ్రాహ్మణుడు. అతడు అగుపించిన బైరాగుల నందరినీ ఆశ్రయించి ఆకలి లేకుండా చేసుకొందామని చాలా ప్రయత్నించినాడు. ఒకమారు అతడు నల్లమలకొండలలో ఒక సిద్ధుడిని చూచాడు. ఆసిద్ధుడు ఏదో పసరు తాగించి ఆ బ్రాహ్మడికి ఆకలి లేకుండా చేశాడు. అప్పటికి సంతోషించినప్పటికీ ఆ బ్రాహ్మడు తరువాత పడ్డ ఆందోళన యింతా అంతా కాదు. భగవన్నామస్మరణ అటుండగా తనకేదో జాడ్యము సంభవించినట్టు అతడు భావించి ఎన్నో మందులు మింగాడు. లాభము లేకపోయింది. తుదకొక బైరాగి ఆతనికి తటస్థపడ్డాడు. ఆబైరాగి అతనికో మందిచ్చినాడు. ఆ మందుప్రభావమువల్ల అతడు పూర్వము తాను తిన్న పసరు కక్కివేసినాడు. ఆ బైరాగి ఆ పసరు తాను తిని క్షుధను జయించి అంతరాయరహితమైన సమాధిలో ప్రవేశించాడు. నల్లమలకొండల ప్రభావము అట్టిదని లోకులు చెప్పుకొంటారు.

నాగలూటిగూడెములో చాలా వెదురుగుడిసె లున్నవి. కాని ఒకగుడిసెమాత్రము దూరముగా ఒక మామిడిచెట్టు కింద పుష్కరిణికి సమీపముగా వున్నది. ఆ గుడిసెలో ఒక చెంచెతా, ఒక చెంచుబాలుడూ కాపురమున్నారు.

చెంచుది ముసలిది. నల్లని శరీరము. వయస్సులో అందకత్తె. ఇప్పుడు శరీరమంతా ముడతలు పడ్డది. చెంచుబాలుడు చామనచాయరంగు, నీలిరంగు కళ్ళు, రాగి వెంట్రుకలు.

చెంచుబాలుడికి ఇరవై సంవత్సరముల వయస్సు. ఇతడు ముసలిదాని కొడుకే. పగలు వేటాడి తనకూ, తనతల్లికీ సరిపోయినంత ఆహారము సంపాదించేవాడు. ముసలిది ఎప్పుడూ గుడిసెముందు ఏదో పరధ్యానముగా ఆలోచిస్తూ కూర్చుండేది. అక్కడ చెంచువాళ్ళందరూ ఆమెను చెంచురాణీ అని పిలుస్తారు.

యాత్రికులు ఆమెనుచూచి ఆమెను చెంచురాణీ అని పిలవడము విని ఆమె గొప్పసిద్ధురాలని భావించి కొబ్బరికాయలూ, అరటిపళ్ళూ ఆవిడకు సమర్పిస్తూ వుంటారు. ముసలిదాని దృష్టి పళ్ళమీదగాని యాత్రికులమీద గాని ఎప్పుడూ పడలేదు. అప్పుడప్పు డామె యీరీతిగా గొణుగుకొనేది. "సముద్రాలు. సముద్రాలమధ్య దేశం. దేశంలో ఊళ్ళు. ఒక ఊళ్ళో నా దేవుడు." యాత్రికులకు ఈమాటలు అర్థమయ్యేవికావు.

ముసలిదానికి చిన్నతనములో తల్లిదండ్రు లుంచిన పేరు లచ్చి. మధ్యకాలములో వచ్చినపేరు బెస్సీ. అంత్యకాలములో వచ్చిన పేరు చెంచురాణీ. ఆమె కొడుకుపేరు వీరభద్రుడు.

ఆమె యితరులతో ఎప్పుడూ మాట్లాడక పోయినప్పటికీ కొడుకుతో అప్పుడప్పుడు ప్రసంగించేది. సముద్రాలుదాటి, దేశాలుదాటి తనను తనకొడుకు తీసుకొని వెళ్ళగలడేమో అని అడిగేది. సముద్రాలమధ్య దేవతల దేశాలు చూడడానికి అతనికి కుతూహలము వున్నదేమోనని కనుక్కొనేది. అక్కడ అడవులు వుంటాయా, అక్కడ వేటాడవచ్చునా, అక్కడ చెంచువాళ్లుంటారా అని అత డడిగేవాడు. అక్కడ మనదేవుడున్నాడు, పెద్దవాడవైనాక అక్కడకు నన్ను తీసుకొని వెళ్ళవా అని ఆమె ప్రశ్నించేది. వీరభద్రుడు ఆమె మాట లర్థము చేసుకొన

లేక ఒక్కొక్కప్పుడు ప్రత్యుత్తర మిచ్చేవాడే కాడు.

ఉరు లోడ్డి పట్టి తెచ్చిన క్షుద్రజంతువులూ, కాయలూ, పళ్ళూ, ఊచబియ్యమూ, తేనెపట్టులమైనమూ ఆమె దేహాన్ని పోషిస్తున్నవి. ఆమె హృదయమును పోషించడముకు తన కొడుకు విగ్రహమూ, తన ఆలోచనలూ ఉండేవి.

అప్పుడప్పు డామె నిట్టూర్పు విడిచేది. వాయువుకూడా అప్పుడే ఏచెట్ల సందునుంచో నిట్టూర్పు విడిచేది.

ఆమె అప్పుడప్పుడు కన్నీళ్ళు విడిచేది. చెట్ల ఆకులనుండి అప్పుడే మంచు బిందువులు రాలేవి.

ఆమె అప్పుడప్పుడు కొడుకును కౌగిలించుకొని నీవే నా దేవుడవా అనేది. నేను కాననేవా డతడు. కాని ఆమాట లామెకు వినబడకుండా వెదురుదుబ్బులు కీచుమని ధ్వనిచేసేవి.

౨

ఆ ప్రాంతములలో నివాసముచేసే చెంచువాళ్ళందరూ వీరభద్రుణ్ణి చెంచురాణీకొడుకనే పిలిచేవారు. అతనిని వాళ్ళం దరూ గౌరవముగా చూచేవారు. వీరభద్రుడు వేటాడడములో చాలా నేర్పరి. విల్లమ్ములు పుచ్చుకొని అడవిలోకి వేటకువెళ్ళి అత డెప్పుడూ వట్టిచేతులతో ఇంటికి రాలేదు.

తాను అందరు చెంచువాళ్ళలాగా ఉండకపోవడమూ; తననూ, తన తల్లినీ అందరూ గౌరవముగా చూడడమూ అత నికి బోధపడినదికాదు. అందుకు కారణ మేమైనా ఉండునా అని అతడు చాలా మందిని అడిగాడు. ఏ కారణముచేతనో వాళ్లు అతనికి సరియైన కారణము చెప్పారు కారు. తన తల్లితప్ప ఇం కెవరూ తనకు చెప్పరని ఊహించి అతడు ఒకనాడు తల్లిని చెప్ప

వలసిందని తొందరపెట్టినాడు. తల్లి సందేహించి సందేహించి తుదకు చెప్పింది. పాతాళగంగ కొండలమధ్యనుంచి ప్రవహిస్తూ ఉన్నదనీ, ఆ పాతాళగంగ అక్కడకు తూర్పుగా ఎక్కడో అరణ్యముమధ్య కొండలలో మలుపు తిరిగినదనీ, ఆ మలుపుదగ్గిర నీరు చలనములేకుండా ఉంటుందనీ, ఆమలుపు గుహావలె ఉంటుందనీ, దానిపేరు పీనుగులగొంది అనీ, అక్కడకు వెళ్ళినట్లయితే ఇద్దరు చెంచువాళ్ళు కనిపిస్తారనీ, ఆ చెంచువాళ్ళను కలుసుకొని తాను లచ్చికొడుకునని చెప్పి లచ్చి సముద్రాలమధ్యకు వెళ్లుతున్నదని చెప్పవలసినదనీ, వాళ్ళే నీకు జన్మవృత్తాంతము యావత్తూ చెప్పుతారనీ ఆమె చెప్పింది. వీరభద్రుడికి అక్కడకు వెళ్ళవలెనని కుతూహలము కలిగినది. కాని తల్లిని ఒక్కతైనా వదలిపెట్టి ఎలాగవెళ్ళడం? చెంచురాణి ఆ సంగతి గ్రహించి తనకు అక్కడ ఉన్న చెంచువాళ్లు తిండిపెట్టుతూ ఉంటారు కాబట్టి ఆ విషయమై అతడు బెంగపెట్టుకోవలసిన అవసరము లేదని చెప్పింది.

వీరభద్రుడు ప్రయాణానికి సిద్ధపడ్డాడు. విల్లమ్ములు తీసుకొన్నాడు. మొలలో పెద్దకత్తి దోపుకొన్నాడు. పెట్టుకొన్న గోచీ, పై మీదబట్ట తోటే బయలుదేరాడు. అడవులలో నడవడము ప్రారంభించినాడు.

తెల్లవారుజామున బయిలుదేరి బారెడుపొద్దు ఎక్కేసరికి పెద్దచెరువు చేరుకున్నాడు. అక్కడ చెంచుగూడెము, లంబాడీగూడెమూ ఉన్నవి.

ఆ గూడెములవైపుపోక అతడు తోవలో సంపాదించిన మామిడికాయలూ, టుంకిపళ్ళూ, చింతగుల్లలూ తిని; చెరువులో

చెంచు రాణీ

నీళ్లు దాహంతాగి ప్రయాణంసాగించాడు. తోవలో చెంచువాళ్ళు అతన్ని చూచి ఎవడో పరాయివాడు వచ్చాడనుకొని బద్దా, అలుగులూ సర్దుకొన్నారు. సమీపమునుంచి చూచి చెంచురాణీకొడుకు, చెంచురాణీకొడుకు అని అరుస్తూ పారిపోయినారు.

నడవగా నడవగా కృష్ణానది కానవచ్చింది. బండలమీదనుంచి మందముగా ప్రవహిస్తూవుంది. దానిగట్టునే అతడు నడిచిపోతున్నాడు. వెదురుదుబ్బులలోనుండి అడవికోళ్లు కూయడం ప్రారంభించినవి. కోతులమందలు అతనిని చూచి ఒక బండమీదనుంచి ఇంకొక బండమీదికి దుముకుతూపోయి అదృశ్యమైనవి. తోవలో టేకుచెట్లూ, మద్దిచెట్లూ, గొడుగుతుమ్మచెట్లూ, మంచిగంధపుచెట్లూ, వెదురుపొదలూ ఎన్నోవున్నవి. అతడు వాటిని చూడకుండా తల్లిసంగతీ, తనసంగతీ తలుచుకొంటూ వెళ్ళుతున్నాడు. సాయంత్రమయ్యేసరికి శ్రీశైలము చేరుకున్నాడు. తోవలో చెంచువాళ్ళెవళ్ళూ అతనికి తటస్థపడలేదు. అతనికి ఆకలివేసింది. కత్తితో ఒక ఈతచెట్టు పడగొట్టి దానిని నరికి మొవ్వతిని ఆకలిదప్పులు అణుచుకొన్నాడు. శ్రీశైల దేవాలయానికి ఎదురుగావున్న సత్రపు గదులలో ఆ రాత్రి నిద్రపోయాడు. రాత్రి నాలుగోజామున లేచి, నలిగిన బాటగుండా వెళ్ళినాడు. తోవలో వెలుగుబంట్లు అతన్ని, అతని విల్లునూ చూచి తప్పుకొన్నవి. జింకలమందలు చెంగుచెంగున దాట్లువేస్తూ పారిపోయినవి. చాలాదూరం నడిచిపోగా అతనికి పాతాళగంగ గోచరమైనది. పాతాళగంగను అనుసరించి అతడు నడిచిపోయాడు. చిటచిట లాడుతూ ఎండకాస్తు

న్నది. పాతాళగంగలో స్నానముచేసి కడుపునిండా నీళ్ళుతాగి ఒక బండప్రక్క నీడలో విశ్రమించాడు. అతని చుట్టూ పెద్ద కొండలు; అక్కడక్కడ వెదచల్లినట్లు పెద్ద పెద్ద రాళ్ళు. కొండలనిండా చెట్లు. పెద్ద పులులు సంచారముచేసే చోటది. అతనికి అక్కడ కునుకుపట్టింది. ఎంతసేపు నిద్రపోయాడో తెలియదు. కళ్ళు తెరిచే సరికి అతనికి ఎదురుగావున్న బండమీాద ఒక చెంచుపిల్ల కనబడినది. కళ్ళు నులుముకొని లేచి కూర్చుని మళ్ళీ చూచాడు. నల్లని పడుచు చెంచుపిల్ల పదహారు సంవత్సరముల ఈడుగలది అతనిని పరకాయించి చూస్తున్నది. ఆమె పక్క ఒకబుట్ట; బుట్టలో పళ్ళూ, కాయలూ, కత్తీ, ఉరులూ మొదలైన వస్తువు లున్నవి.

చెంచుపిల్లలోనుంచి లావణ్యము సూర్యబింబమునుంచి వచ్చేకిరణముల లాగవచ్చి అతని మనస్సు నాకర్షించింది. అతని మనస్సు మనస్సులో లేదు.

"నీవు చెంచువేనా ?" అని ప్రశ్నించింది చెంచుపిల్ల.

"అవును" అన్నాడు వీరభద్రుడు.

"మన మిద్దరమూ ఈకొండలలో ఉండి పోదాము. నాతోకూడా వుంటావా ?"

"నీకు తల్లిదండ్రులు లేరా ?"

"లేరు, ఉన్నారు. నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పవేం ?"

"నాకు పీనుగులగొంది చూపిస్తావా ?"

"చూపిస్తే నా నేస్తమవుతావా ?"

"మా అమ్మ నడుగుతాను."

"మీ అమ్మ ఎక్కడుంది?"

"నాగలూటిలో"

"నాగలూటిలో అడవే లేదు. ఇక్కడెంత అడవో! మనం స్వేచ్ఛగా తిరుగవచ్చు కాదూ?"

"అవును."

ఈ రీతిగా కొంతసేపు సంభాషణ జరిగింది. వీరభద్రుడికి చెంచుపిల్ల కడుపునిండా పళ్లుపెట్టింది. ఇద్దరూ కలిసి కేకలు వేసుకొంటూ పాతాళగంగ అవతలిగట్టుకు ఈదుకుపోయారు. ఏరుదాటి, అక్కడకొండలు చుట్టుతిరిగి యిద్దరూ వెళ్ళుతున్నారు. తోవలో ఎన్నో ఊసులు, కథలు చెంచుపిల్ల చెప్పింది. ఎన్నో పాటలుపాడింది. ఆ రాత్రి వాళ్ళు ఒకచెట్టుమీద గడిపారు కబుర్లు చెప్పుకొంటూను. తెల్లవారకుండా లేచి వాళ్ళిద్దరూ ప్రయాణంసాగించారు. నలగని బాటలగుండా, యితరులకు తెలియని మార్గాలగుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోయింది.

పాతాళగంగ కొండలమధ్యనుండి ప్రవహిస్తూ వున్నది. ఒకచోట పాతాళగంగకు అడ్డముగా పర్వతము నిలిచివున్నది. కృష్ణానది ఆ పర్వతముచుట్టూ తిరిగి ప్రవహించవలసినచోటు ఇక్కడ. వరదలరోజులలో కృష్ణానది పర్వతమును పొడిచివేస్తూ వుంటుంది. చాలాకాలము ఈ రీతిగా చేయడమువల్ల ఆ కొండలో ఒకమోస్తరు గుహ ఏర్పాటైనది. వరదలులేనికాలములో ప్రవాహము మందముగా వుండడముచేత గుహలోనీళ్ళు చలనములేకుండా వుంటవి. నదిలోపడ్డ దూలకులు వగైరా అన్ని వస్తువులనూ కృష్ణానది యీ గుహలో దాచుకొంటుంది. నదికి

దీక్షితులు కథలు

ఎగువను ఉన్నతమైన కొండ ఒకటి వున్నది. ఆ కొండకు సరాసరి కింద పాతాళగంగ. ఆ కొండఅంచున ఒకనున్నని రాయి కలదు. ఆరాతిమీద రెండు పాదచిహ్నాము లున్నవి. వాటికి "సిద్ధరామయ్య పాదుక" లని పేరు. మోక్షము నాశించే యాత్రికులు ఈ పాదుకలమీద నిలవబడి పాతాళగంగకు తిమ్ముతా మర్పించుకొంటారు. అటువంటివారినందరినీ కృష్ణానది యీ గుహలోకి చేర్చుతుంది. దీనికే పీనుగులగొంది అని పేరు.

పీనుగులగొందికి అవతలివైపున ఒక చిన్న చెంచుగూడెమున్నది. ఆ చెంచుగూడెముకు నాయకు లిద్దరు: గంగడు, గురవడు.

చెంచుపిల్లా, వీరభద్రుడూ కలిసి యీ గూడెము చేరుకున్నారు. చెంచుపిల్ల యీ గూడెమువారికి చాలా పరిచితురాలే. గూడెములో స్త్రీ పురుషులు చెంచుపిల్ల స్వాతంత్ర్యము చూచి ముక్కుమీద వేలుంచుకొంటారు. వారి ఆచారవ్యవహారములతోగాని, వారి కట్టుబాట్లతోగాని చెంచుపిల్లకు ఏమీ ప్రసక్తిలేదు. ఒకరిచెప్పుచేతలలో లేకుండా స్వేచ్ఛగా పెరుగుకు వస్తూ ఉంది ఆ చెంచుపిల్ల.

వీరు గూడెము చేరుకొనేసరికి గూడెములోని స్త్రీ పురుషులు చాలామంది వేటకుపోయారు. వీరభద్రుడూ, చెంచుపిల్లా కలిసి దుబ్బులవెంట పచారుచెయ్యడం మొదలుపెట్టారు. సాయంకాలమువరకూ వారు ఆ ప్రాంతాల తిరిగి కడుపునింపుకొని చివరకు గూడెము చేరుకొన్నారు.

3

ఒకరోజున చెంచుపిల్ల అక్కడ స్త్రీ పురుషుల నంద

రనూ పోగుచేసి నాట్యమాడించింది.

గంగడూ, గురవడూ, వీరభద్రుడూ ఆ నాట్యములో చేరక కొంతదూరముగా ఒక బండమీద కూర్చున్నారు. వీరభద్రుడిని చూడడముతోనే అతను లచ్చి కొడుకని వాళ్ళిద్దరూ గుర్తించారు.

"నీవు ఇంతదూరం ఇప్పుడు రావడానికి కారణమేమి?" అని వాళ్ళడిగారు.

"మా అమ్మ సముద్రాలమధ్యకు వెళ్లుతుందట. ఆ సంగతి మీతో చెప్పమన్నది" అని వీరభద్రుడు చెప్పాడు.

"గౌరిని నీ వెక్కడ చూచావు?" అని వా రడిగారు.

"గౌరి ఎవరు?"

"నీతో వచ్చిన చెంచుపిల్ల."

"తోవలో తటస్థపడి నాకు దారి చూపించింది."

"అయితే నీ వదృష్టవంతుడవే!"

"ఎందుచేత?"

"గౌరి ఇంతవరకు ఏ పురుషుడితోటీ కలిసిమెలిసి ఉండలేదు." వీరభద్రుడు మాట్లాడలేదు.

"గౌరి చిన్న చెంచురాణీ."

"మా అమ్మను చెంచురాణీ అనీ, నన్ను చెంచురాణీ కొడుకనీ పిలవడానికి కారణమేమిటి?" అని వీరభద్రుడు అడిగాడు.

వారిద్దరిలో కొంచెము పెద్దవాడైన గంగడు ఆ వృత్తాంతమంతా వీరభద్రుడితో ఈ విధముగా చెప్పాడు.

"లచ్చి చిన్నతనములో చాలా అందముగానూ, చురుకు

గానూ ఉండేది. ఆమె ఎక్కలేని కొండలూ, చెట్లూలేవు. పురుషులతో సమానముగా వేటాడుతూ మోటపనులుచేస్తూ ఉండేది. ఇంతేకాకుండా అడవులలో తిరిగి మందులూ మాకులూ సంపాదించి వైద్యము చేయడమే కాకుండా కొంతవరకు మంత్రములుకూడా నేర్చుకొన్నది. ఆ కారణముచేత చెంచు వాళ్ళకు లచ్చిఅంటే భయమూ, భక్తీ.

చిన్నతనములో లచ్చి, నేనూ చాలాస్నేహముగా ఉండే వాళ్ళము. ఇద్దరమూ కలిసి వేటకు వెళ్ళేవాళ్ళము. ఇద్దరమూ ఏటిలో ఈదులాడే వాళ్ళము. ఇద్దరమూ నదిఒడ్డున పొంచుండి, ఇసుకలో పడుకోవడముకు మొసళ్ళువచ్చినప్పుడు వాటిని ఉచ్చులతో పట్టుకొనేవాళ్ళము. అప్పుడు మాకు భయమంటే ఏమిటో తెలియదు. ఒక్కొక్కప్పుడు చాలారోజులవరకూ మేము అడవుల్లో వేటాడుతూ ఉండిపోయేవాళ్ళము.

ఆకాలములోనే లచ్చి నన్ను పెళ్లాడతానని చెప్పింది.

అప్పుడు చెంచువాళ్ళకు చాలా కష్టదినములు. అడవులలో పండిన పంటంతా అధికారులు తీసుకుపోయేవారు. మాకు తినడానికి తగినతిండి ఉండేదికాదు. ఎన్నివిధాలు తంటాలుపడ్డా, మాకు ఆకలి అణిగేదికాదు. అప్పుడు మేమందరమూ—ఆండు వాళ్ళూ, మగవాళ్ళూ—ఆలోచించాము. మాలో గురవడు చాలాబుద్ధిమంతుడు. అనేకమంది అనేకసలహాలు చెప్పారు. తుదకు అప్పుడు తీర్మానించుకొన్నాము—అధికారులను అడవులలో కాలుపెట్టనివ్వ కూడదని. అయితే ఆరీతిగా చెయ్యడం ఎలాగ ? అందరూ ఆలోచించారు. ఎవరికీ మార్గంతోచింది కాదు. ఎవరైనా సరియైన మార్గం సూచించినట్లయితే వారిని

లచ్చి పెళ్లాడతానన్నది. గురవడు తాను చేస్తానన్నాడు. నాకు దుఃఖము కలిగింది. లచ్చి మీదా, గురవడి మీదా నాకు కోపం వచ్చింది. పగలు తీర్చుకోవడానికి సమయముకాదది.

గురవడు చెంచువాళ్ళ నందరినీ పదిజట్టులకింద విడదీసి ఒక్కొక్క పెద్దను ఏర్పాటు చేశాడు. కొన్నిజట్టులను రోడ్లు కాయడానికి పంపాడు. కొన్నిజట్టులను అడవులలో ఉన్న అధికారుల మీదకు పంపాడు.

తరవాత గురవడు లచ్చిని పెళ్ళిచేసుకొన్నాడు. లచ్చి తల్లిదండ్రులకు నాలుగుజతల ఆవుల నిచ్చి లచ్చిని తీసుకు పోయాడు. ఒకనాడు రహస్యముగా లచ్చిని నేను కలుసుకొని చిన్నతనములో అది అన్నమాట జ్ఞాపకముచేశాను. లచ్చి నవ్వింది. ఈరీతిగా చెప్పింది: 'చిన్నతనములో నిన్ను పెళ్ళి చేసుకొన్నాను. ఇప్పుడు గురవడిని పెళ్ళిచేసుకొన్నాను. నాకిద్దరు భర్తలు, ఉండకూడదా?' రహస్యముగా ఇద్దరు భర్తలుండకూడదని నేను చెప్పిన మాటలు పెడచెవిని పెట్టింది. పర్యవసాన మేమిజరిగిందంటే-లచ్చి గురవడితో సంసారము చేస్తూ ఉన్నప్పటికీ మేమిద్దరము భార్యాభర్తలవలె ఉండడానికి నిశ్చయించుకొన్నాము. ఈవిషయము మాత్రము రహస్యముగా ఉంచాము.

ఆరోజులలో చెంచువాళ్ళ ప్రతాపము లోకానికి వెల్లడయింది. రోడ్లమీద ఎవరు ప్రయాణము చేసినప్పటికీ వాళ్ళు చెంచువాళ్ళ అలుగులకు గురి అయ్యేవారు. మావాళ్ళందరూ అధికారులను దొరికినంత మట్టుకు హతమార్చారు. అడవి సమీపానికి రావడానికి అందరూ భయపడ్డారు. ఆరోజులలో

ఎందరిని చెంచువాళ్ళు చంపారో, ఎందరిని చెరపెట్టారో చెప్పడానికి వీలులేదు. అడవిరాజ్యం కొంతకాలం మళ్ళీ చెంచువాళ్ళు ఏలారు. మా కప్పుడు కడుపునిండా తిండిదొరికింది. సంతోషించాము.

కాని తలవని తలంపుగా పోలీసుపటాలాలు అడవుల్లో ప్రవేశించినవి. మాకూ, వాళ్ళకూ అనేకయుద్ధాలు జరిగినవి. మాకు అలుగులూ, దబ్బలూను-వాళ్ళకు తుపాకులు. ఆ కారణముచేత చెంచువాళ్ళు చాలామంది చచ్చిపోవడం సంభవించింది. అందువల్ల వాళ్ళు భయపడి పారిపోవడం మొదలుపెట్టారు. పోలీసువాళ్ళు వాళ్ళని అడవులలో జింకలని వేటాడినట్లు వేటాడారు. కొంతకాలానికి అడవిరాజ్యం చెంచువాళ్ళ వశం తప్పి మళ్ళీ తెల్లవాళ్ళ స్వాధీన మైనది. చావగా మిగిలిన చెంచువాళ్ళు తెల్లవాళ్ళ రాజ్యాన్ని ఒప్పుకోక తప్పిందికాదు. మాయలు పన్ని, లంచా లిచ్చి ఒక తెల్లదొర చెంచునాయకులను కొందరిని పట్టుకొని ఉరిదీయించాడు. దానితో అల్లరులు సద్దుకొన్నవి.

చెంచువాళ్ళ కోపం చల్లార్చడానికీ, వాళ్ళల్లో మళ్ళీ కలవరం కలగకుండా ఉండడానికీ, వాళ్ళకు సరియైన జీతాలిచ్చి పనిచేయించడానికీ ఒక తెల్లదొర ఏర్పాటైనాడు. అతడు జాలిగుండెవాడు, మంచివాడు. అతడు నాగలూటి దగ్గిర బంగాళాలో ఉండి అన్నికార్యములూ న్యాయముగా చక్కపెట్టేవాడు. చెంచువాళ్ళ నందరినీ దయతో చూచేవాడు. వాళ్లు కష్టసమయములో ఉన్నప్పుడు వాళ్ళకు డబ్బిచ్చేవాడు. చెంచువాళ్ళందరకూ అతడంటే గౌరవమూ, భక్తీ కలిగినవి. అందరూ

సంతుష్టిచెంది కాలక్షేపం చేస్తున్నారు.

లచ్చి నాతో చనువుగా తిరుగుతున్నదనే సంగతి గురవడు గ్రహించాడు. గురవడూ, లచ్చీ కలిసి ఒకనాడు వేటకు వెళ్లారు. నేనూ స్వతంత్రముగా వేటకు వెళ్ళాను. ఆరోజు మధ్యాహ్నము మే మొకచోట తారసపడ్డాము. గురవడికి నన్ను చూడడంతోనే కోపం వచ్చింది. నామీదకు వచ్చి పడ్డాడు. మే మిద్దరమూ కలియబడ్డాము. లచ్చి నాపక్షము వహించింది. గురవడిని తోసిపారేసింది. గురవడు మాట్లాడకుండా వెళ్ళి పోయాడు. ఆరోజున లచ్చీ, నేనూ సాయంకాలమయ్యేవరకూ అడవుల్లో తిరిగి యింటికి చేరుకొన్నాము.

గురవడు చెంచులలో పెద్దవాళ్ళనందరినీ పిలిచి తగువు పెట్టాడు. పెద్దలందరూ విచారణకు పూనుకొన్నారు. ఈవిషయము నిజమేనా అని నన్ను అడిగారు. నేను నిజమే నన్నాను. నిజమేనా అని లచ్చిని అడిగారు. నాయిష్టమని లచ్చి నిర్లక్ష్యముగా సమాధానం చెప్పింది. నేరము నిర్ధారణ అయినది కాబట్టి పెద్దలందరూ తీర్పుచెప్పారు. 'గురవడి భార్యయైన లచ్చిని గంగడు మోసంచేసి తన భార్యగా చూచుకొంటున్నాడు కాబట్టి ఈరోజునుంచీ గంగడే లచ్చిని ఏలుకోవలసి ఉంటుందనీ, గురవడికి అపకారం జరిగిందికాబట్టి అతనికి గంగడు పదిహేనురూపాయలు దండుగయిచ్చుకోవలసి ఉంటుందనీ' తీర్పు.

లచ్చి నావశమైనందుకు నేనూ, లచ్చీకూడా సంతోషించాము. కాని పదిహేనురూపాయల దండుగ ఇచ్చుకోవడమెలాగ? నావద్ద అప్పుడు ఒక్కరూపాయైనా లేదు. నాకు చెప్పతగ్గ ఆస్తి ఏమీలేదు. దండుగ యిచ్చుకోకపోయినట్ల

యితే నన్ను వాళ్ళు ఏమైనా చేయవచ్చును. ఏమిచెయ్యడానికీ తోచక నేను లచ్చివిమాత్రం స్వీకరించి దండుగమాట తల పెట్టకుండా చాలా రోజు లూరుకొన్నాను. చెంచుపెద్దలకు కోపం వచ్చింది. నన్ను శిక్షించడానికి చెంచువాళ్ళు సిద్ధపడు తున్నారు, నాబంధువులూ, స్నేహితులూ నాపక్కనుండి నన్నుకాపాడుటకు ప్రయత్నిస్తున్నారు. అప్పుడు మాలో ఒక యుద్ధము జరగవలసినదే కాని తప్పి పోయింది. కారణ మేమి టంటే............

నాగలూటిలోఉన్న తెల్లదొరకు మా వివాదవృత్తాంతము తెలిసింది. అతడువచ్చి సంగతిసందర్భములను తెలిసికొని వివాదకు కారణము పదిహేనురూపాయలేకదా అనుకొని ఆ రూపాయలు అతడు గురవడికి నాతరపున ఇచ్చి వెళ్ళిపోయాడు. కాని ఒక చిక్కు తటస్థించింది. పదిహేనురూపాయలు ఎవరి స్తే వారికే లచ్చికూడా చెందవలసి ఉంటుంది. లచ్చి నాకే చెంద వలసి ఉంటుందని నేను ఎంత చెప్పినాపెద్దలు చెవిని పెట్టారు కారు. అది ఆచారం అన్నారు. మరునాడు వాళ్ళు లచ్చిని వెంటబెట్టుకొని తీసుకువెళ్ళి 'ఈమె నీ భార్య' అని చెప్పి తెల్లదొరకు అప్పజెప్పారు. తా నిచ్చిన రూపాయలకు తనకీ ప్రతిఫలము ముట్టినదని తెల్లదొరకు వారు నచ్చచెప్పారు. తెల్ల దొర ఆశ్చర్యపోయాడు, కాని తాను చెంచువాళ్ళమధ్య ఉన్నాడు కాబట్టి చెంచువాళ్ళ ఆచారములకు బద్ధుడైనట్లు తలచి విధికి తలవంచి ఊరుకొన్నాడు, అతడు బ్రహ్మచారి కూడాను. లచ్చి ఆనాటినుంచీ తెల్లదొరయింట్లో ఉండడము తటస్థించింది.

చెంచు రాణీ

౪

లచ్చిని చెంచుపెద్దలందరూ ఈరీతిగా చేయడం నాకు కష్టమనిపించింది. గురవడికికూడా కష్టమనిపించింది. ఆకారణము చేత అతనూ, నేనూ స్నేహితులమయాము. తెల్లదొర దగ్గిర నున్న లచ్చిని తీసుకురావడానికి ప్రయత్నాలుచేశాము. అందువల్ల చెంచువాళ్ళందరికీ మాటవస్తుందని మిగిలిన చెంచువాళ్ళు మమ్మలిని మందలించాడు. అయిన చెంచుకుటుంబములో పుట్టిన చెంచుదాన్ని పరాయివాళ్ళకర్పించడం న్యాయముకాదని వాళ్ళతో చెప్పాము. వాళ్ళు విన్నారుకారు. అప్పుడు మే మిద్దరమూ మా స్నేహితులనూ బంధువులనూ తీసుకొని, అక్కడ చెంచువాళ్ళని కులంతక్కువవాళ్ళని నిందించి, బయలుదేరి వచ్చి యిక్కడ —ఈపీనుగులగొంది దగ్గిర ఒకగూడెము నిర్మించుకొని కాపురం చేస్తున్నాము. మాయిద్దరికీ లచ్చిమీద అభిమానంపోలేదు. ఎప్పటికైనా దానిని మావశంచేసుకోవలెననే ఆశతోఉన్నాము.

లచ్చి దొరగారియింట్లో ప్రవేశించింది. కొన్నాళ్ళవరకూ లచ్చికీ, దొరగారికీ సంభాషణ జరగలేదు. కాని అక్కడనుంచి లేచి పారిపోయివస్తే దొర ఏమిచేసిపోతాడో అని భయం. అది అటుండగా అక్కడ కూటికీ, బట్టకూ లోటులేకుండా దివ్యముగా జరిగి పోతున్నది. అటువంటి భాగ్యము వదలిపెట్టడానికి కూడా ఆమెకు మనస్కరించిందికాదు. దొరగారు క్రమక్రమముగా లచ్చితో మాట్లాడడం మొదలుపెట్టారు. "నాప్రియా! ఇటు వచ్చుము. నా కొక ముద్దు నిచ్చుము" అనే వారట. లచ్చికి విలువయైన బట్టలూ, నగలూ, మంచిమంచి ఆహారమూ పెట్టేవారట. దానాదీనా వారిద్దరికీ అన్యోన్యంకుదిరింది. ఇద్దరూ

భార్యా భర్తలలాగ ఉంటున్నారని చెంచువాళ్ళకు తెలిసింది. చెంచువాళ్ళు దొరగారితో మాట్లాడవలసి వచ్చినా, దొరగారితో తమకష్టసుఖాలు చెప్పుకోవలసి లచ్చినా, దొరగారిని ఏమైనా కోరవలసివచ్చినా వచ్చి ద్వారానే ఆపనులుచేసేవారు. లచ్చి క్రమక్రమముగా చెంచువాళ్ళందరకూ దేవతవంటి దైనది.

తెల్లదొర లచ్చిని "బెస్సీ! నాప్రియా! బెస్సీ!" అని పిలిచేవాడు. చెంచువాళ్ళ వ్యవహారాలు పరిష్కరించవలసివచ్చినప్పుడల్లా తెల్లదొర తన బెస్సీ సలహాలేనిదే ఏపనీ చేసేవాడుకాడు. లచ్చి చెంచువాళ్ళందరికీ సాధ్యమైనంతవరకూ ఉపకారంచేసేది.

తెల్లదొరా, బెస్సీ కలిసి అప్పుడప్పుడు కొందరు చెంచువాళ్ళను తీసికొని షికారువెళ్ళేవారు. ఆసమయాలలో బెస్సీ తుపాకీ గురితప్పకుండా కాల్చడం నేర్చుకొన్నది. ఇదిచూచి చెంచువాళ్లు బెస్సీఅంటే భయంతోఉండేవారు. ఆరోజులలోనే చెంచువాళ్ళు లచ్చికి చెంచురాణీ అనే పేరుపెట్టారు. దొరగారుకూడా ఈమాట విని సంతోషించి చెంచురాణీ అనిఆమెను పిలిచేవారు.

ఒకనాడు నేనూ, గురవడూ కలిసి నాగలూటి వెళ్లాము. అక్కడ కొన్నాళ్ళు వేచిఉండి సమయము కనిపెట్టి లచ్చిని రహస్యముగా కలుసుకొన్నాము. మేము క్రొత్తగా నిర్మించిన క్రొత్త గూడెముకు తీసుకొనిపోతే వస్తుందేమో నని అడిగాము.

లచ్చికి మామీద అభిమానం తగ్గలేదు కాని మాతో వచ్చినట్లయితే దొర ఏమైనా చేసిపోతాడనీ, మాకే కాకుండా చెంచువాళ్ళందరకూ అది శ్రేయస్కరము కాదనీ ఏమేమో సాకులుచెప్పి తప్పించుకొన్నది. మాప్రయత్నాలు నిష్ఫలమైనవి. అప్పుడు లచ్చి కడుపుతో ఉంది. దొర ఆవిడను రోజు రోజూ

ఎక్కువ ఆదరముతో చూస్తున్నాడు. ఆరోజులలో లచ్చిని కాలు కదపనిచ్చేవాడు కాదు. రాత్రింబగళ్ళు తన బెస్సీ దగ్గరే గడిపేవాడు. లచ్చికి దొర అంటే ఎక్కడాలేనిప్రేమ. ఇట్లా అన్యోన్యముగా ఉంటూవుండగా తెల్లదొరకు బదిలీ అయినది. ఆ సంగతి లచ్చితో చెప్పి ఆవిడను వదలిపెట్టి వెళ్ళడానికి అనుమతి అడిగాడు. లచ్చి తననుకూడా తీసుకువెళ్ళమని ఎంతో ప్రార్థించింది. అది వీలుపడదన్నాడు దొర. చివరకు లచ్చి ఒప్పుకొన్నది. దొర ఆవిడకు కొన్ని బహుమతులిచ్చి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. చెంచురాణీ ఒక్కర్తే ఆ ప్రాంతాల గుడిసె వేయించుకొని అందులో ఉంటూ ఉన్నది.

ఈ సంగతి తెలిసి నేనూ, గురవడూ కలిసి మళ్ళీ నాగలూటి వెళ్ళినాము. లచ్చి మమ్మును చూచి కళ్ళనీరు పెట్టింది. మాతో రమ్మని ఆమెను కోరితే తన స్థితి మాతో చెప్పి రానన్నది. అప్పుడే ఒకతుపాకీ, ఒక వెండిసిగరెట్టు కేసూ, మూడు కాసులూ మాచేతికి జాగ్రత్త చేయమని చెప్పి యిచ్చింది. తాను కోరినప్పుడు వాటిని తిరిగీ యియ్యవచ్చునని చెప్పింది. నీవు వచ్చావు కాబట్టి నీకు వాటిని ఈరోజున అప్పచెప్పతాము. నీవు ఆమె పుత్రుడవు కాబట్టి, అవి నీతండ్రివి కాబట్టి నీకే చెందవలసినవి. నీవు చిన్న శిశువుగా ఉన్నప్పుడు మేము మళ్ళీ నాగలూటికివెళ్ళి లచ్చిని రమ్మన్నాము. తెల్లదొర ఎప్పుడైనా ఆప్రాంతాలకు రావచ్చుననీ, అందుచేత తానక్కడనే ఉండవలెననీ ఎప్పటికైనా తాను తెల్లదొరదేశం వెళ్ళవలెననీ, తన కొడుకు పెద్దవాడైనాక తన్ను తప్పకుండా తన తండ్రిదగ్గిరికి తీసుకువెళ్లు తాడనీ ఏమేమో ఆటంకములుచెప్పింది. తెల్లదొరతో కాపురం

చేసే రోజుల్లో అతడు తన దేశాన్ని గురించీ, తన దేశస్థులను గురించీ వారి వేషభాషలు ఆచారవ్యవహారములను గురించీ ఆమెతో చెప్పాడు. అప్పటినుంచీ లచ్చికి ఆ దేశం వెళ్ళవలెననీ, ఆ దేశంలో తన భర్తతో కూడా కాపురం చేయవలెననీ కోరిక."

వీరభద్రుడు తన తల్లి కథ ఆమూలాగ్రముగా విన్నాడు. తన పుట్టుకసంగతి తెలుసుకొన్నాడు. ఉండుండి తన తల్లి సముద్రాలమధ్యకు వెళ్లిపోతా నని చెప్పడం అప్పుడతనికి బోధపడింది.

గౌరి యింటల్లోకి పరుగెత్తుకొనివచ్చి "ఇంతసేపూ ఏమి చేస్తున్నావు నాకుకనిపించకుండా. రా నాట్యమాడదాంరా" అని చెయ్యిపట్టుకు తీసుకుపోయింది. చాలాసేపు వారు చెంచువాళ్ళందరితో కలిసి ఆడుతూ పాడుతూ సరదాగా కాలంగడిపారు.

వీరభద్రుడు ఆరోజునే తుపాకీ వగైరా వస్తువులు గంగడు, గురవళ్ళ దగ్గిర పుచ్చుకొని యింటికి వెళ్ళడానికి ప్రయాణమయ్యాడు. చెంచుపిల్లకూడా వస్తానన్నది.

వాళ్ళిద్దరూ మరుసటిదినం ఉదయం ప్రయాణమయినారు. కొత్తదోవలగుండా చెంచుపిల్ల అతన్ని తీసుకుపోతున్నది.

అనాటి సాయంకాలం వారు ఒక కొండకొలనుదగ్గర విశ్రమించారు. సంతోషముగా కబుర్లు చెప్పుకొన్నారు. చెంచుపిల్ల అక్కడ అప్పుడు తనను పెళ్ళిచేసుకోమని అతనిని కోరింది. "మీతల్లిదండ్రులకు కట్నముకింద ఆవులని ఇస్తేనేకాని పేచీ వస్తుందేమో" అన్నాడు వీరభద్రుడు. "నన్ను అందరూ చిన్న చెంచురాణీ అంటున్నారు. నేనే అందరినీ శాసిస్తాను. నాకు చెప్పేవాళ్ళెవళ్ళూ లేరు" అని ఆమె చెప్పింది.

"నీవు చిన్న చెంచురాణీవయితే నీకంటె పెద్ద చెంచు

రాణీ ఒకతె ఉండవచ్చుగదా. ఆమె మాటలూ వినవా?''

''ఎవరు పెద్దచెంచురాణీ?'' ''నా తల్లి''

''నిజంగా! అయితే వింటాను. అందుచేతనే నిన్ను పెళ్ళి చేసుకొందామని నాకు తోచింది.''

''నేను నిన్ను పెళ్ళాడనంటే ఏమిచేస్తావు?''

''నిన్ను నేను పెళ్ళాడుతాను. నేనుచిన్న రాణీని. నా మాట నీవు వినాలి.'' ''పెళ్ళి చేసుకొన్న తరువాతకూడా నీమాట నేను వినవలసి ఉంటే నేను పెళ్ళిచేసుకోను.''

''అప్పుడు నీమాట నేను వింటానులే'' అని చెంచుపిల్ల అతనిని సమీపించి బతినూలేటట్టు నిలుచున్నది. వీరభద్రుడు చిట్టచివరకు పెళ్ళిచేసుకోవడానికి ఒప్పుకున్నాడు. కాని తనతల్లి తో చెప్పితేనేగాని ముందుగా మాట యివ్వనన్నాడు. చెంచుపిల్ల కొంతసేపు కోపగించింది. కొంతసేపు ఏడ్చింది. అక్కడనుంచి వెనక్కు వెళ్ళిపోతా నన్నది. ఇక ముందు అతనికి తోవ చూపించనంది. ఇన్నీచేసి చివరకు అతని కంఠాన్ని కౌగలించుకొని అక్కడ అప్పుడు తనకు పెళ్లిచేసుకుంటేనేగాని వదిలిపెట్ట నన్నది. వీరభద్రుడు చివరకు ఒప్పుకొన్నాడు.

కొండసరస్సు నీళ్లల్లో నక్షత్రాలు ప్రతిఫలిస్తున్నవి. చెట్ల కొమ్మలసందులలోనుంచి గాలి నెమ్మదిగా వీస్తున్నది. వెదురు పొదలలో రొదలు వినబడుతున్నవి. అప్పుడే పక్షిదంపతులు గూళ్లల్లో నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నవి. ఒక్క పక్షి మాత్రము కొమ్మమీద కూర్చుని చల్లగా పలుకుతున్నది. ఆ సమయాన ఆ స్థలాన ఆ చెంచుపిల్లకూ, చెంచువాడికీ వివాహముః జరిగింది. పెండ్లిపెద్దలు లేని వివాహము, కట్నములు లేని వివాహము.

దీక్షితులు కథలు

మొదట మానవదంపతులకు ఇటువంటి సందర్భములలోనే వివాహముజరిగి ఉంటుంది. తమ వివాహము స్థిరపడినట్లు నిదర్శనముగా వారు ఒకరినొకరు ముద్దుపెట్టుకొన్నారు. ఒక్కమారు ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగినారు. చెట్టుమీద పక్షి మరీ మధురముగా పాడింది. తెల్లవారుజామున చెంచులిద్దరూ కిలకిలలాడుతూ కబుర్లు చెప్పుకొంటూ నాగలూటివైపు నడిచివెళ్లారు. వారికి ప్రపంచమంతా కలకలలాడుతున్నది. నడక శ్రమగా లేదు. చెంచుపిల్ల మాటలలో, నడకలో, కధలలో, అవయవములలో అంతటా ఉత్సాహమే; అంతా నవ్వే.

వారిద్దరూ నాగలూటి చేరుకున్నారు. వీరభద్రుడు తన గుడిసెదగ్గిరికి చెంచుపిల్లను తీసుకు వెళ్లాడు. అక్కడ అతనితల్లి కనిపించింది కాదు. పొరుగు చెంచువాళ్ళు వచ్చి అతనితో చెప్పారు ఈరీతిగా. అతడు వెళ్లిన మరునాడే చెంచురాణీ జబ్బుపడినదనీ, ఆ జబ్బులోనే "నేను సముద్రాల మధ్యకు వెళ్ళిపోతున్నా" అని ఉండుండి చెప్పి మరణించిందనీ.

వీరభద్రుడు చాలాసేపు దుఃఖించాడు. చెంచుపిల్ల అతనిని ఓదార్చింది. మరునాడే వారిద్దరూ నాగలూటి పుష్కరిణిలో స్నానముచేసి దట్టముగా ఉన్న అడవులలో వన్యమృగములతోపాటు కాపురము చెయ్యడానికి వెళ్లిపోయారు.

వీరభద్రుడు ఇంకా విచారముగా ఉండడము చూచి చెంచుపిల్ల గారి అతనితోఅన్నది. "నీతల్లి చెంచురాణీ సముద్రాలమధ్యకు పోయింది. నీభార్య చెంచురాణీ నిన్ను వదలకుండా ఈఅడవులలోనే నీతోతిరుగుతున్నది. ఇంకానీకెందుకువిచారం?"

౧౯౦౨

సుగాలి కుటుంబము

౧

పాత అధికారి వెళ్ళి కొత్తఅధికారి వచ్చినాడన్నవార్త చుట్టుపట్ల నున్న గ్రామాల కన్నింటికీ తెలిసింది. ఇంత త్వరలో తెలియడానికి కారణము లేకపోలేదు.

ఆప్రాంతపు దేశమంతా అడవిమయము. ఆ అడవిలో ఒకభాగమునకు ఈయన అధికారి. ఎవ్వారివాడో తెలియదు. అధికారము చెలాయించేటప్పుడు ముక్కుకు సూటిగా వెళ్ళడం ఈయనమతము. ఈసంగతి ఈయనే పలువురతో చెప్పటంకద్దు. లోకులు ఈ సన్మార్గమును కాఠిన్య మన్నారు.

ఒకనాటిసాయంకాలము ఈయన– పాత్రకు పేరు వుండవలెను, గనుక ఈయనను మునిస్వామి అందాము– కంసాలి వానికి వర్తమానము చేసినాడు. ముప్ఫైతులముల బంగారముతో చేయబడినకంఠె ఒకటి ఆయనభార్య పెట్టుకొనే అలంకారములలో ఒకటి. ఈకంఠెను చెరిపించి నలభై తులాల బంగారపుకంఠె చేయించిపెట్టమని భార్య అడగడము కంసాలిని పిలిపించడమునకు కారణము.

కంసాలి వచ్చినాడు. అతనికి చెప్పవలసిన మాటలు చెప్పుతుండగా అడవికాపరులు ఒకమనిషిని పట్టుకొని మునిస్వామివద్దకు తీసుకు వచ్చినారు.

అడవిలో నల్లమద్దికొమ్మ కొట్టి యీమనిషి తీసుకొని

పోతూండగా కాపరులు పట్టుకొన్నారు.

మునిస్వామి విచారణలో తేలినవిషయముమిది. ఈ మనిషి బండిచక్రమునకు కొన్ని ఆకులు విరిగిపోయినవట. కొనడానికి కెక్కడా కర్రలు దొరకలేదట. బండి తోలుకొని జీవించడమే అతని ప్రధానవృత్తిట. అందుచేత అడవిలో కొమ్మ కొట్టినమాట వాస్తవమట.

సన్మార్గగామియైన మునుసామి అతనిపై కేసు చేసినాడు. అడవికేసులకు సాక్ష్యము మొదలైనవి అక్కరలేదు. అధికారిమాటా, మేజిస్ట్రేటుశిక్షా, నేరస్థునికొంప గుండము! అడవిపరిపాలనలో న్యాయచక్రము పైమాటిమీద ఎప్పుడూ వర్తిస్తూఉంటుంది.

ఆమనిషికి రెండుసంవత్సరముల కఠినవరకము పడినది. మునుసామి వచ్చిన నెలలోపుగా ఇట్టి వెన్నో జరిగినవి. ఆయన కీర్తిచంద్రికలు నాల్గువేపులా వ్యాపించిన వంటే ఆశ్చర్య మేమి!

౨

రాక్షసనామసంవత్సరమున సకాలమున వర్షములు లేకపోవుటచేత కొన్నిచోట్లా, వర్షములు వెనకబట్టుటచేత కొన్నిచోట్లా కాటకము సిద్ధించినది. పచ్చని చేలుండవలసిన తావులందు పర్రభూములు కానవస్తున్నవి. సూర్యునివేడిమి నానాటికీ సహింపశక్యము గాకున్నది. నాగళ్ళు, గొఱ్ఱులు, జడ్డిగాలు, పాపటలు, మెట్టులు అన్నియు మూలకొదిగినవి. నూతులందు నీరు నానాటికి లోనికి పోవుచున్నది. చెరువు లెండుకుపోయినవి. విత్తనములకొరకై వెనకటిసంవత్సరము దాచుకొన్న ధాన్యము, జొన్నలు, కొఱ్ఱలు ఈసంవత్సరము గ్రాసమునకు విని

యోగపడుచున్నవి. భూమిపై గడ్డి మొలవలేదు. అడవిలో చెట్లు చిగుర్చలేదు. ఆవులకు మేత లేదు. మనుష్యుల కావుపాలు లేవు.

"మేడు వర్షములు లేక పంటలు లేవు. తినడానికి తాటి పళ్ళైనా పడడంలే"దని ఒకమాలవాడు విలపించినాడు.

ఈకాలమున మునుసామి అధికారములోనున్న అడవికి సమీపమున ఒకవూరిలో ఒకసుగాలీకుటుంబము కాపురమున్నారు. ఈకుటుంబము ఆవూరికి రావడమునకు పూర్వము ఎర్ర కొండలలో వుండేదిట. అక్కడవున్న చెంచువాళ్లు వీళ్ల కొంపలో పడి దోచుకొనడముచేతనూ, వీళ్ళపశువులను తోలుకుపోవడంచేతనూ జీవనాధారం లేక యిక్కడికి వచ్చినారు. అడవిలో నివసిస్తే చెంచువాళ్లు బాధపెడతారనే భయముచేత వూళ్లోనే కాపురమున్నారు.

ఈకుటుంబము కడుబీదస్థితిలో వున్నది. భార్యా, భర్తా, ఏడుగురుపిల్లలూను. వీరిపై దయదలచి ఒకబ్రాహ్మడు తన దొడ్డిలో వీరి నుండనిచ్చెను. ఆదొడ్డిలో పాకవేసుకొని వీళ్లున్నారు.

సుగాలీవాళ్లు అడవిజాతికి చేరినవాళ్లు. చెంచులు, ఎరుకులు, కోయలు, ఒడ్డెలూ ఇట్టిఅడవిజాతులే. సుగాలీలు వాలిసుగ్రీవుల సంతతివారమని చెప్పుకొంటారు.

సుగాలులకు కొండలూ, అడవులూ నివాసస్థానము, వీళ్లు అడవులకు పిల్లలవంటివారు. అడవులు వీరిని కనును, అడవులు వీరిని పోషించును, అడవులు వీరిని భరించును, అడవులకు వీరు తమఅస్థుల నర్పింతురు.

సుగాలీస్త్రీలు అలంకారప్రియులు. వివాహితలైన సుగా

లిస్త్రీ చేతులకు ఎముకలతో చేసిన కంకణములను మోచేతి వరకు ధరిస్తుంది. బొంతెలలో చిన్న చిన్న అద్దములు కుట్టి, గవ్వలను మాలలుగా కుట్టి బొంతల కతికించి ఆబొంతెలను లంగా వలె కట్టుకొనును. ఉరస్థలిపై కప్పుకొనును. రంగురంగుల గుడ్డలతో ఈబొంతలు చేస్తారు. రంగు లన్న వారికి ప్రీతి. వారి బొంతలతోనైన టోపీని తలపై ధరించడంకూడా కద్దు. సుగాలీ స్త్రీలు సొగసుగా ఉంటారు. ఆరోగ్యము సౌందర్యమునకు వన్నె తెస్తుంది. వీరికి ఆరోగ్యము, సౌందర్యముకూడా కలవు.

పురుషులును స్త్రీలునుకలసి పండుగదినములలో నృత్యము చేస్తారు. సుగాలీభాషలో పదములు పాడతారు.

అడవులలో కట్టెలనుకొట్టి మోపులుగా గట్టి ఊరూరు దిరిగి వాటి నమ్మి జీవిస్తారు వీరు. ఇది కొందరివృత్తి. కొందరు అడవులలో పశువులను మేపుకొని జీవిస్తారు.

ఈసుగాలులు ఇతర అడవిజాతులవలెనే అప్పుడప్పుడు దారులు కాచి దొంగతనంచేయడంకద్దు. అందుస్త్రీలుగూడ పాల్గొంటారు. వీరిలో సాధారణముగా స్త్రీలు పురుషులకన్న బలాఢ్యలు.

కాటకము నానాటికి తీవ్రమైపోయింది. మర్యాదగా కూలిపని చేసుకొని గుక్కెడుఅంబలి త్రాగేవాళ్ళందరికీ చిప్ప చేతికి వచ్చింది. ఊళ్ళల్లో యాచకులసమ్మర్దము ఎక్కువ అయిందని పత్రికలలో మొరలు వినిపించాయి. వీధులలో పాటలుపాడుకొంటూ యాచకులు సంచారము చేస్తున్నారు. "వానదేవుడు పదములు" అంతటా వినబడుతున్నాయి.

వానదేవుడా! ఓవానదేవుడా!

సుగాలీకుటుంబము

ఇగ యెందు వున్నావు జగమేలు నాసామి
చిన్న చిన్న మొలకలు జింకల పాలాయె
చేసినచే లన్ని ఎండెండిపోయె
చుక్కలంటి మొగవాళ్లు నూకలైపోయిరి
ఏకంత మొగవాళ్లు ఎదవాడివుండిరి
గుంటిక కొట్టేవాళ్ల గుండెలారుకుపోయె
నాగలి పట్టేవాళ్ల నడుము లెంకుకుపోయె
నెత్తిమీద సూర్యుడా నెలవన్నెకాడా
తలమీద సూర్యుడా దండంబు నీకు
ఏనుగంత యెద్దులూ ఎత్తుబడిపోతాయి
గాడికట్టిన పసరం గదేంకు పోలేదు
ఎక్కడా వున్నావో గ్రక్కునా కదులయ్యా
కురిపించు నాసామి కుంభవర్షాలు
కురవాక మాతోడ కువ్వార మేల
వానలు కురిపించి ప్రాణాలు రప్పించు
వంకలూ నిండంగ వాగులూ నిండ
కురిపించు నాసామి కుంభవర్షాలు
వానదేవుడా! ఓవానదేవుడా!
ఇగ యెందుకున్నావు జగమేలు నాసామి

3

ఈ సుగాలీకుటుంబము కూలిపనులున్నరోజులలో కూలి పని చేసుకొని పొట్టపోసుకునేవాళ్ళు. కాటకమురావడం, కూలి పనులు పోవడం ఒక్కమారు తటస్థించాయి. కట్టెలు కొట్టుకొని అమ్మి జీవిస్తామంటే అడవి స్వాధీనములో లేదు. పశువులను

కాచుకుందామంటే పశువులు లేవు. అడవిజాతివాళ్లని అడవిని అనుభవించ వద్దనడం పిల్లను తల్లివద్ద పాలుతాగరా దనడమే.

ఈసుగాలీకుటుంబము యజమానిపేరు రూపల్‌నాయక్, అతనిభార్యపేరు చంద్రి. వీనికి కొడుకులు కూతుళ్లూ పాలుత్రాగేపిల్ల మొదలుకుని ౧౫ యేళ్ళవరకు వయస్సువచ్చిన పిల్లలు ఏడుగురు. సూర్యనాయక్, రామనాయక్, పాటేల్‌నాయక్, లక్ష్మి, సీత, బద్ది, భారతి వాళ్ళపేర్లు. తండ్రీ, తల్లీ పాటుపడి పిల్లలనందరనూ పోషించవలెను. పెద్దపిల్ల లక్ష్మికి వివాహమయినది పంద్రెండవయేట. అత్తవారు తీసుకుపోయి బాధలు పెట్టడంవల్ల అత్తవారింటినుంచి పారిపోయి వచ్చి తల్లివున్న వూళ్ళోనే ఒకశూద్రకుటుంబములో చాకిరీకి ప్రవేశించి పొట్ట పోసుకుంటూంది లక్ష్మి.

తొలికోడి కుయ్యడంతోనే రూపల్ నాయకుడూ, చంద్రీ బయలుదేరి కొండలమీదికి అడవులలోకి పోతూవుండడం వాడుక. పిల్లలందరూ యింటివద్దనేవుందురు. అడవికిపోయి అక్కడ దేవదారుకూర, పింకికాయలు, పాలపళ్ళు, వెలగపళ్ళు—ఏవిదొరికితే అవి తీసుకువచ్చి ఊరూరూ తిరిగి జొన్నలు కొర్రలు పోగు చేసుకొని మధ్యాహ్నం ఒంటిగంటకు ఇంటికి వచ్చేవాడుక. అప్పుడు కొర్రన్నమో, జొన్నసంకటో, జొన్నరొట్టో తయారు చేసి తామింత తిని పిల్లల కింత పెట్టి ఆరోజు గడుపుకునేవాళ్లు.

సుగాలీవాళ్ళు కష్టపడి పనిచేసి యింత తింటారు గాని ఒకరిని దేహీ అని చెయ్యిచాపి అడగరు; ఇస్తే వద్దనరు.

కొంతకాలం ఈరీతిగా జరిగింది. ప్రజలలో క్షామము ప్రవేసించింది. ఆకుకూరలూ పండ్లూ కొనేవాళ్ళసంఖ్య నానా

టికీ క్షీణించింది. ఇక చేయవలసిన దేమి? చేయడానికి కూలి పనులు లేవు. కాయడానికి పశువులు లేవు. ఆకుకూరలు కొనడానికి మనుష్యులు లేరు. ఇలాంటిస్థితిలో నున్నవారే కొందరు యాచకులౌతారు. ఇట్టిస్థితి నున్నవారే కొందరు దారులుకొట్టుటకు మొదలుపెడతారు. ఎవరి దీతప్పు? వారిదా?

౪

అయిదారుగురు పిల్లలు రోటిచుట్టూ మూగినారు, వారెవరు? మోకాలిపై తలనుంచి ధ్యానముచేస్తూ కూర్చున్నాడొకమూల, ఆతడెవరు? వారిముఖములు తేజోవిహీనమై యున్నవేల? వారికడుపులు నడుముల కంటుకుపోయిన వేల? రోకలి చేతబూని ఒక్కరీతిగా దంచుచున్నది. అవి యేమి? ఆమె ఎవరు?

ఈతపండ్లు నక్కడక్కడ పోగుచేసుకొని వచ్చి వాని నెండబెట్టి తరువాత దంచి గింజలను పారవేసి ఆపొట్టుతో రొట్టెలను గాల్చుకొనుచున్నారు రూపల్‌నాయక్ కుటుంబము. మార్గము లేనివారికి భగవంతు డొకమార్గము కల్పించకమానునా! కాలినది ఈతపొట్టుతోనయిన రొట్టె ఒకటి. తినడానికి సిద్ధముగా నున్నవారు ఎనమండుగురు.

కొంతకాల మిట్లు గడచింది. ఈతపళ్ళుకూడా కొన్నాళ్ళకరుదైనవి. కావూ? చెంచువాళ్ళూ, మాలమాదిగెలూ, సుగాలీవాళ్లూ ఇందరికీ ఎంతకాలము ఈతపళ్ళు ఆధారమై వుండగలవు? ఇంక సాధన మేమిటి?

ఒకనాటివుదయము రూపల్‌నాయక్, చంద్రీ యిద్దరూ తట్టలుచేతితో పట్టుకు పోయినారు. వాళ్ళపిల్లలు ఊరిలో వీళ్ళ

గడపలూ, వాళ్ళగడపలూ పట్టుకొని కాలము బుచ్చుతున్నారు. మధ్యాహ్నమయేసరికి భార్యాభర్తలిద్దరూ తట్టెడు చింతగింజలను తెచ్చినారు. అవి ఎందుకు? ఆచింతగింజలనురోటిలో ఇద్దరూ దంచినారు. నీళ్ళల్లో నానవేసి కడిగినారు. ఎండబెట్టి తిరుగలితో విసరినారు. తెల్లటిపిండి తయారైనది. వీరుచేసే పనులను పన్నెండు కన్నులు చూస్తూవున్నవి. ఈపిండితో సాయంత్రమయేసరికి రెండురొట్టెలు తయారైనవి. మెడపట్టులు పట్టుకొంటూ తమకు తక్కువైనదని కొట్లాడుచూ పిల్లలూ దంపతులూ ఆరొట్టెలను తిన్నారు. ఇంతనీరు త్రాగినారు. ఆదినమునకు భగవంతు డింతయిచ్చినాడు. హాయిగా రాత్రి అందరూ వెన్నెలలో విచారములేకుండా నిద్రపోయినారు.

కొంతకాల మీరీతిగా జరిగింది. చింతగింజలకు కూడా కరవైనది. కొన్నాళ్ళకు చింతగింజలను వర్తకులు అమ్మ మొదలుపెట్టిరి. పడి అర్థణా! అర్థణా ఆసుగాలీవాళ్ళకు ఎక్కడనుంచి వస్తుంది? ఇక చేసేదేమిటి?

ఒకనాటి సాయంకాలము ఒకసుగాలీకుటుంబము ఆరుబయట ఆకులలో నల్లటిపదార్థము పెట్టుకొని ఆత్రముగా తింటున్నారు. ఆనల్లటిపదార్థమేమిటి? చింతచిగురూ, చింతపండూ బూడిదలో కలిపి పొయ్యిమీద ఉడికించగా తయారైన పదార్థము. ఈఅంబలిత్రాగి కడుపునిండా నీళ్ళుత్రాగి చింతలేక హాయిగా నిద్రపోయారు. ఇట్లు కొన్నాళ్లు అడవిలో చింతపండు తెస్తూవున్నవాళ్ళకు శిక్షపడుతూందని వదంతి పుట్టింది. ఇక చేయవలసిన దేమిటి?

దేవదారుకూర మిగిలిన ఆకుకూరలవలెగాక కొంతసు

సుగాలీకుటుంబము

వాసన కలిగిఉంటుంది. దీనిని బ్రాహ్మలు పప్పులోవేసి వండు కొంటారు. అడవులలో తిరిగేవాళ్లు ఈకూరను వూరివారికి బియ్యానికీ, జొన్నలకూ అమ్ముతారు. కొనేవాళ్లులేరిప్పుడో?

అడవిసమీపమున నున్న దేవదారుచెట్ల నాశ్రయించి మధ్యాహ్నమయేసరికి ఒకతట్టెడు దేవదారుకూర తెచ్చినారు ఈసుగాలిదంపతులు, కుండలో ఆకూరనుబోసి నీళ్ళుపోసి వుడక బెట్టి దించినారు. ఆకులలో బెట్టుకొని పిల్లలూ, తల్లీ, దండ్రీ కడుపు నిండా తిన్నారు. హాయిగా నిద్రపోయినారు.

ఈరీతిగా కొన్నాళ్ళు జరిగింది. అడవియంచుల నున్నకూర నానాటికీ తరిగిపోయింది. ఇక చేయవలసిన దేమిటి?

నడిరాత్రి బయలుదేరి ఎవ్వరూ చూడకుండా యింత దేవదారుకూర దూసుకొని వచ్చి తెల్లవారుసరికి ఇల్లుచేరి ఆ రోజు గడుపుకొనవలసి వచ్చింది. ఇట్లుకొంతకాలము గడిచింది. ఒకనాడు తోవలో నలుగురు మాలవాళ్ళు కనిపించినారు. రెం డురోజులకు ముందు వారు దేవదారుకూర ఆరీతిగా తీసుకుపో తూండగా అడవికాపరులు పట్టుకొన్నారట. నూతనోద్యోగికడకు తీసుకుపోయారట. బొటనవ్రేలిముద్రలను వేయించుకొన్నారట. ఈవర్తమానము సుగాలిదంపతులకు తెలియవచ్చింది. ఇక అడ వికి పోవుట ఎట్లు? పొట్ట పోషించుకోవడమెట్లా? పిల్లలను పోషించడం ఎట్లా?

రెండురోజులపాటు సుగాలీకుటుంబమునకు తిండిలేదు. దిగుడుబావిలోనుంచి తెచ్చుకున్న నీళ్ళే తిన్నారు. ఆనీళ్ళే త్రా గినారు. వెన్నెలలో సుఖముగా నిద్రపోయినారు. రెండురోజులు గడచినవి. ఇక ఎన్నిరోజులు గడచును?

దీక్షితులు కథలు

కష్టములో ఉన్నవారికి భయముతక్కువ. ఏమన్నా భయముండదు. అధికారులంటే భయమా ! మృగములంటే భయమా ! తోడివారంటే భయమా! ఆపత్తులు సంభవిస్తవని భయమా ! భయములేకుంటే నేమవుతుంది? కష్టములు వచ్చును. ఉన్నకష్టములలో అవి కలసిపోతవి. ఇంక భయమెందుకు?

మరింతజాగ్రత్తగా దేవదారుకూర అడవులలోనుంచి వారు తెచ్చుకొనక తప్పినది కాదు. కొంతకాలము సరిగానే జరిగింది. ఒకనాడు రూపల్‌నాయక్ అడవిలో దేవదారుకూర కోస్తున్నాడు. చంద్రి కొండలలో ఒకచరియలో ఈతచెట్లకు పళ్ళున్నవని విని ఆపళ్ళకోసము అక్కడకు వెళ్ళింది. రూపల్ నాయకుడు ఒడినిండా కూరకోసుకొని అడవి దాటి వస్తావున్నాడు. ఇద్దరు అడవికాపరులు అతనిని అడ్డగించినారు. పారిపోయినాడు. పరుగెత్తి వానిని పట్టుకొన్నారు. అతనిని పరీక్షించినారు. దేవదారుకూర కానవచ్చినది. మునుసామి కడకు తీసుకుపోయినారు. దేవదారుకూర కోసినట్లును, కొమ్మలను విరిచినట్లును కేసు. కూర కోయ్యడం తప్పుకాదు, కొమ్మలు విరవడం నేరము. కొమ్మలు విరవడం ఎందుకు? పట్టుకుపోయి అమ్ముకుందామనేకదా, అడవికి నష్టము కలుగ జేయవలెననే వుద్దేశ్యమే కద! మేస్ట్రీటువద్ద కేసు జరిగింది. రూపల్‌నాయకుడు దీనముగా చెప్పుకున్నాడు. తనకు ఏడుగురు పిల్లలనీ, కూలిపనిచేసుకోవడము వృత్తనీ, కూలిపనులులేవనీ, తిందామంటే ఈతపళ్ళు కరవయినవనీ, బూడిద తాగుదామంటే చింతపండు కరవయిందనీ, చింతపిక్కలు తిందామంటే ఖరీదైనవనీ, దేవదారు కూరపై అతనికుటుంబమంతా ఆధారపడియున్నదనీ. అతడు

కొమ్ములు విరవలేదట, కూర కోసుకున్నట్లు ఒప్పుకున్నాడు.

మేస్త్రీయీటు నూతనోద్యోగి చాకచక్యమును మెచ్చుకున్నాడు. సుగాలీవానికి నాలుగు సంవత్సరముల ఖయిదు విధించినాడు.

౫

చంద్రి ఈతపళ్ళను ఇంటికి తెచ్చుసరికి రూపల్‌నాయకుడు ఇంటికిరాలేదు. ఎక్కడైనా కూలికి పోయినాడేమో అని సంతోషించింది. ఈతరొట్టెలను పిల్లలకు పెట్టి తాను తిన్నది. రెండుమూడురోజులపాటు రూపల్‌నాయకుడు ఇంటికి రాకుండడము అలవాటే.

రెండురోజులు పోయినమీదట తనభర్తకు ఖయిదువేసినారని చంద్రికి తెలిసింది. ఏమి చేయగలదు! తనరెక్కలతో ఇందరని పోషించగలదా! ఎడపిల్లను పెద్దపిల్లకు అప్పగించి చంటిపిల్లను చంకబెట్టుకొని ఒకనాడు ప్రయాణమై తెల్లకొండలకేసి పోయింది. తెల్లకొండలలో దానిచుట్టాలున్నారట. ఈసంగతి వూరివారికి తెలియదు.

పాకలో నలుగురుపిల్లలు తల్లిదండ్రులకోసము ఆనాటి మధ్యాహ్నమువరకూ వేచిఉన్నారు. ఎవ్వరూ రాలేదు. పాకను విడిచి వూరిలో ఆనలుగురూ వేర్వేరు దిక్కులకు పోయారు. వారేమయిరో ఎక్కడుండిరో ఎవరికీ తెలియదు. భూదేవి వారిని కన్నది. భూదేవి వారిని మళ్ళీ స్వీకరించింది.

రూపల్‌నాయకుడు నాలుగేండ్లయినతర్వాత ఆవూరు వచ్చినాడు. తనకుటుంబములేదు. భార్య తెల్లకొండలలో ఎక్క

డకో పోయిందనీ పిల్ల లెక్కడకో పోయినారనీ పొరుగువాళ
చెప్పినారు. రూపల్ నాయకుడు ఆరోజునే బయలుదేరి తె
కొండలకు పోయినాడు. అక్కడ వానిభార్య కానరాలేదు.

మునుసామి నానాటికి ధనము గడించడము మొద
పెట్టినాడు. సాలుకు ఇంత యిచ్చేపద్ధతిమీద తనకు
కుండా అడవిసరకు తెచ్చుకొన వచ్చునని లోపాయి
అడవిమనుష్యులతో రాజీ పడ్డాడు. కేసులు తక్కువకై
అధికారి సామర్థ్యమునకు దొరతనము సంతోషించింది.

అది విషజ్వరముల కాలము. ఊరూరా, దేశదేశములా
విషజ్వరములే. ఎందరో దాని వాతబడిరి. మునుసామియి ట
ప్రవేశించిన దీవిషజ్వరము. భార్యా, యిద్దరుపిల్లలూ పదిరో
లలో ఎగిరిపోయినారు.

మునుసామి ఒక్కడు, "నా" అన్నవాళ్ళులేరు. ధనమునే
చుట్టముగా చూచుకొన మొదలుపెట్టినాడు.

క్రమక్రమముగా మునుసామిప్రవర్తన పై అధికారు
లకు తెలియవచ్చింది. విచారణ జరిగింది. మునుసామిని ఉద్యో
గమునుండి తొలగించారు.

చిన్ననాటి బంధువులతోనూ, మిత్రులతోనూ జీవితము
గడపవచ్చునని స్వగ్రామము పోయినాడు మునిసామి. మిత్ర
బంధుకోటి ఆగ్రామమున అతనికి కరవైంది.

౧౯-౩౯

ఆంధ్రభూమి ముద్రణాలయము, వేపేరి, మదరాసు.

తెలుగు గ్రంథాలయం

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA111B129
పుస్తకం పేరు	దీక్షితులు కథలు
తారీఖు	26/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	105
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	NO
తయారు చేసినది	VedaVathi
పేజీలు విడదీసినది	VedaVathi
స్కాన్ చేసినది	Haleema
పరీక్ష చేసినది	pragathi
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good.